RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam




# వుదయం

Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal




సంపుటి : 12 | సంచిక : 287 | ఆదిలాబాద్ | గురువారం, ఏప్రిల్ 10, 2025 | VOODAYAM Telugu Daily | వెల : రూ. 3.00 | పేజీలు : 12

# మోడీ విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడుదాం.




## ■ తెలంగాణలో బీజేపీకి అవకాశం ఇవ్వం
## ■ సీడబ్ల్యూసీ భేటీలో సీఎం రేవంత్

ప్రధాని మోడీ అనుసరిస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీని ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారం లోకి రానీయ్యబోమని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం అహ్మదాబాద్ లో నిర్వహించిన సీడబ్ల్యూసీ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..."మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్‌ల గడ్డపైన, సబర్మతీ నది ఒడ్డున రెండు రోజులుగా మనం మేధో మదన (చింతన్ బైఠక్) సదస్సు జరుపుకుంటున్నాం. అధికారం చేపట్టిన తర్వాత దేశంలో మోదీ చేస్తున్న విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేసేందుకు సబర్మతీ ఒడ్డున మనం ఇక్కడ సమావేశమయ్యాం..గాంధీజీ ఆలోచనలకు అనుగుణంగా దేశాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు రాహుల్ గాంధీ నాయకత్వంలో మనం ప్రయత్నిస్తున్నాం. గాడ్సేఆలోచన విధానాన్ని దేశంలో వ్యాపింపజేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారు.. గాడ్సే వారసుల ఆలోచన ధోరణిని అడ్డుకునేందుకు గాంధీ కుటుంబ సభ్యులు, రాహుల్ గాంధీ గారి మిత్రులు, దేశ నలుమూలల ఉన్న ప్రతి ఒక్కరూ మోదీకి వ్యతిరేకంగా పోరాడాలి..మోదీ రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలు తెచ్చారు.. వాటికి వ్యతిరేకంగా రైతులు 14 నుంచి 15 నెలలు ధర్నాలు చేసినా చర్చలకు రాలేదు..మోడీ మణిపూర్‌లో మంటలు రాజేశారు.. దేశ మూల వాసుల జీవన హక్కును కాలరాసే ప్రయత్నం మోదీ చేశారు. మరోవైపు, కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు రాహుల్ గాంధీ నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర



చేశారు..కుల గణన, రైతు రుణ మాఫీ, యువతకు ఉద్యోగాల కల్పన, మహిళల సంక్షేమంపై ఆయన వాగ్దానాలు చేశారు. పాదయాత్రలో భాగంగా తెలంగాణకు వచ్చినప్పుడు కుల గణన, రైతు రుణమాఫీ, నిరుద్యోగ నిర్మూలన, మహిళల సంక్షేమానికి రాహుల్ గాంధీ హామీలు ఇచ్చారు..రాహుల్ గాంధీ వాగ్దానం మేరకు ప్రకారం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే 25 లక్షల కుటుంబాలకు రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేశాం. మేం తెలంగాణలో కుల గణన చేసి చూపించాం. ఈ గణనపై రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడాతారనే భయంతో ఆయనకు లోక్‌సభలో మోదీ మైక్ ఇవ్వ లేదు...ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ హామీ ఇచ్చారు. పదకొండు సంవత్సరాలు దాటిపోయింది.. ఈ లెక్కన 20 కోట్లకు పైగా ఉద్యోగాలు ఇవ్వాలి...మోడీ, అమిత్ షాకు ఇద్దరికే ఉద్యోగాలు వచ్చాయి...ప్రతి ఏటా 2 కోట్ల యువకులకు ఉద్యోగాలు రాలేదు...దేశంలోని మూలమూలన ఉన్న గాంధేయవాదులు మోదీ వ్యతిరేక పోరాటంలో రాహుల్‌గాంధీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నా...గాంధీ ఆలోచనధారతో ఉన్న మనమంతా గాడ్సే వారసులను, మోదీని ఓడించాలి. రైతులు, యువత, మహిళల కోసం సీడబ్ల్యూసీలో సాగిన చర్చలపై ఆశతో నేను ఇక్కడి నుంచి వెనక్కు వెళుతున్నా... తెలంగాణలో మేం బీజేపీకి అవకాశం ఇవ్వం... గుజరాత్ గడ్డపై నుంచి నేను చెబుతున్నా.. మేం నిజాం ప్రభుత్వం కింద ఉన్నప్పుడు జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో వల్లభభాయ్ పటేల్ నేతృత్వంలో మాకు స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే గుజరాత్ ప్రజలతో, వల్లభాయ్ పటేల్ వారసులతో మా తెలంగాణ ప్రజలకు సంబంధం ఉంది...మాకు స్వాతంత్ర్యం ప్రసాదించిన వల్లభాయ్ పటేల్‌తో మాకు హృదయపూర్వకమైన బంధం ఉంది..మాకు స్వాతంత్ర్యం వల్లభాయ్ పటేల్ ఇచ్చారు.. తెలంగాణను మాకు సోనియా గాంధీ అందించింది. వల్లభాయ్ పటేల్ భూమి నుంచి నేను ఒక్కటే చెబుతున్నా..

. సోనియా గాంధీ నాయకత్వంలో మేం బీజేపీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వం. బీజేపీని అడ్డుకుంటాం.. వారిని ఎవరూ క్షమించరు..గాంధీజీ బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా దండి సత్యాగ్రహంతో పాటు 30 ఏళ్ల పాటు అనేక పోరాటాలు చేశారు.. .కానీ బ్రిటిష్‌వాళ్లు ఎప్పుడూ గాంధీజీ మీద లాఠీ ప్రయోగం చేయలేదు.స్వాతంత్ర్యం వచ్చిన ఆరు నెలల్లోనే గాడ్సే వారసులు గాంధీజీపై తుటా పేల్చి ఆయనను హత్య చేశారు.బ్రిటిషర్ల కంటే బీజేపీ నాయకులు ప్రమాదకారులు... బ్రిటిషర్లను దేశం నుంచి తరిమికొట్టినట్లే రాహుల్ గాంధీ నాయకత్వంలో మనమంతా బీజేపీని దేశం నుంచి తరిమికొట్టాలి. మోదీకి వ్యతిరేకంగా పోరాడేందుకు మనమంతా సిద్ధంగా ఉండాలి.. తెలంగాణలో బీజేపీని అడ్డుకునేందుకు, ఓడించేందుకు మేం ఇక్కడి నుంచి ఆశను, ఆదేశాన్ని తీసుకొని వెళుతున్నాం...రానున్న రోజుల్లో బీజేపీని ఓడించే బాధ్యతను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త, గాంధీ వారసులు ఇక్కడి నుంచి తీసుకొని వెళ్లాలని నా విజ్ఞప్తి" అని సీఎం తెలిపారు.

# భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి

## ● సౌకర్యం మరియు సౌలభ్యం అందించడానికి శర వేగంగా పనులు



హైదరాబాద్ : భారతీయ రైల్వేలో ప్రయాణీకులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించాలనే దృక్పథంతో భారీ స్థాయిలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా గొప్ప పరివర్తన దిశగా పురోగమిస్తుంది. " అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్" (ఏ.బి.ఎస్.ఎస్.) కింద, తెలంగాణ వ్యాప్తంగా 40 రైల్వే స్టేషన్‌లను రూ. 2,737 కోట్ల అంచనా వ్యయంతో, ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలను అందించడానికి మరియు వాటిని ప్రాంతీయ జనాభాకు వృద్ధి కేంద్రాలుగా మార్చడానికి పునరాభివృద్ధిచేయబడుతున్నాయి. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు ఆగస్టు 2023 మరియు ఫిబ్రవరి, 2024లో తెలంగాణ రాష్ట్రంలో స్టేషన్ల పునరాభివృద్ధికి శంకుస్థాపన చేయడంతో ఈ పథకానికి మరింత ప్రోత్సాహం లభించింది. ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున చేపట్టిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పనులు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ౦ో లో ే ్వ మంత్రిత్వ శాఖ రైల్వే స్టేషన్‌లను ఆధునీకరించడం, దీర్ఘకాలిక దృష్టితో నిరంతర ప్రాతిపదికన అభివృద్ధిని చేయడం లక్ష్యంగా పెట్టుకుని అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ విధానాన్ని రూపొందించింది. ఈ ఆలోచన ఎప్పటికప్పుడు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మరియు రైల్వే స్టేషన్‌ల ప్రోత్సాహాన్ని పెంచే మాస్టర్ ప్లాన్ ప్రకారం వివిధ కీలక అంశాల అమలుపై ఆధారపడిందిభద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ గురించి సంక్షిప్త సమాచారం : భారతదేశం వ్యాప్తంగా రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేసే లక్ష్యంతో అమృత్ భారత్ స్టేషన్ పథకం (ఏ.బి.ఎస్.ఎస్.) కింద పునరాభివృద్ధి చేయబడుతున్న తెలంగాణ రాష్ట్రంలోని 40 రైల్వే స్టేషన్లలో భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ ఒకటి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఉన్న ఈ రైల్వే స్టేషన్, భారతీయ రైల్వేల ప్రారంభ రోజుల నాటి గొప్ప చరిత్రను కలిగి ఉంది. ప్రారంభంలో, ఈ స్టేషన్ సమీపంలోని గనుల నుండి నిజాం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు బొగ్గును రవాణా చేయడానికి నిర్మించబడింది. కాలక్రమేణా, ఇది హైదరాబాద్, విజయవాడ, వరంగల్ మరియు ఇతర ప్రధాన నగరాలను కలుపుతూ కీలకమైన రవాణా కేంద్రంగా అభివృద్ధి చెందింది.ఈ స్టేషన్ ప్రముఖంగా భద్రాచలంలోని ప్రసిద్ధ శ్రీ రామచంద్ర స్వామి ఆలయానికి ప్రవేశ ద్వారంగా ఉంటూ ప్రతి సంవత్సరం లక్షలాది మంది యాత్రికులను మరియు పర్యాటకులను ఆకర్షిస్తుంది. ఈ స్టేషన్ భద్రాచలం ఆలయ పట్టణానికి సమీపంలో ఉండటం వలన భక్తులు మరియు ప్రయాణికులకు ఇది ఎంతో అనువుగా ఉంది. ఇటీవలి సంవత్సరాలలో, ఈ స్టేషన్ గణనీయంగా అభివృద్ధి చెందింది. ఈ అభివృద్ధిలో భాగంగా విద్యుదీకరణ మరియు భద్రాచలం రోడ్ - సత్తుపల్లి మధ్య కొత్త రైల్వే లైన్ నిర్మాణం ఉన్నాయి. ఈ కొత్త రైల్వే లైన్ ను దక్షిణ మధ్య రైల్వే మరియు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. తద్వారా బొగ్గు రవాణాను సులభతరం చేయడం మరియు ఈ ప్రాంతంలో ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం సుమారు రూ.25.41 కోట్ల అంచనా వ్యయంతో వెయిటింగ్ రూములు, ఎస్కలేటర్, లిఫ్ట్ మరియు మెరుగైన ప్రయాణీకుల సౌకర్యాలతో సహా ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలతో మరింత పునరాభివృద్ధి చేయబడుతూ ఒక ముఖ్యమైన రైల్వే స్టేషన్‌గా నిలువనుంది.నాన్-సబర్బన్ గ్రేడ్-4 (ఎన్.ఎస్.జి-4)గా వర్గీకరించబడిన భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోకి వస్తుంది. డోర్నకల్-మణుగూరు సెక్షన్‌లో నున్న ఈ స్టేషన్ రూ 7.61 కోట్ల వార్షిక ఆదాయంతో సగటున రోజుకు 8020 మంది ప్రయాణీకుల రాకపోకలతో ప్రయాణీకులకు సేవలను అందిస్తుంది.

భద్రాచలం రోడ్ స్టేషన్‌లో 3 జతల రైళు బయలుదేరుతాయి/ముగిస్తాయి మరియు 2 రైళ్లు ఆగుతాయి.

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ప్రణాళిక చేయబడిన పనులు :

స్టేషన్ భవనం ముఖద్వారం అభివృద్ధి.

ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం ఏర్పాటు.

ప్రయాణీకుల సౌకర్యార్థం 12 మీటర్ల వెడల్పు గల పాదాచారుల వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిర్మాణంతో పాటు 01 లిఫ్ట్ & 01 ఎస్కలేటర్ ఏర్పాటు.

ప్లాట్‌ఫామ్ ఉపరితల మెరుగుదలలు.

ప్లాట్‌ఫారమ్‌పై అదనపు కప్పు ఏర్పాటు.

ఇప్పటికే ఉన్న టాయిలెట్లకు మెరుగుదలలు, దివ్యాంగుల సౌకర్యాలతో సహా కొత్త టాయిలెట్ బ్లాకుల నిర్మాణం.

వెయిటింగ్ హాల్ అభివృద్ధి.


స్టేషన్ వినియోగదారులకు ఆహ్లాదకరమైన ప్రాకృతిక అనుభవాన్ని అందించడానికి స్టేషను ఆవరణలో పచ్చదనాన్ని పెంచడం, ట్రాఫిక్ సజావుగా సాగడానికి స్టేషన్ ప్రాంగణం మెరుగుదల.

స్టేషన్ ప్రాంతాలలో కళలు మరియు సంస్కృతి చిత్రీకరణ. ప్రయాణీకులకు అనుకూలమైన సంకేతాలు, రైలు సూచిక బోర్డులు, కోచ్ సూచిక బోర్డులు

ఇప్పటివరకు మొత్తం 45 శాతం పైగా పనులు పూర్తయ్యాయి.అన్ని పనులు ఏకకాలంలో పురోగతిలో ఉన్నాయి మరియు రాబోయే కొన్ని నెలలలో పనులు పూర్తి చేయడంపై దృష్టి సారించారు.

# విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోదీకి క్రెమ్లిన్ ఆహ్వానం

న్యూ డిల్లీ ఏప్రిల్ 9 : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కి రష్యా నుంచి మరోసారి ఆహ్వానం అందింది. మే 9న నిర్వహించే విక్టరీ డే పరేడ్ వేడుకల్లో పాల్గొనాలని మోదీకి క్రెమ్లిన్ ఆహ్వానం పంపింది. ఈ విషయాన్ని ఆ దేశ ఉప విదేశాంగ శాఖ మంత్రి ఆంద్రీ రుడెంకో వెల్లడించారు.రెండో ప్రపంచయుద్ధంలో నాజీ జర్మనీపై విజయానికి గుర్తుగా ఏటా మే 9న రష్యా విక్టరీ డే పరేడ్ నిర్వహిస్తుంది. జర్మనీపై విజయం సాధించి 80 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రష్యా ఏర్పాట్లు చేస్తోంది. ఇక ఈ వేడుకల్లో పాల్గొనాలని రష్యా తన మిత్రదేశాలకు ఆహ్వానం పంపుతోంది. ఇందులో భాగంగానే ప్రధాని మోదీకి కూడా ఆహ్వానం పంపింది.



విక్టరీ డే వేడుకలకు ప్రధాని మోదీ హాజరవుతారని తాము ఆశిస్తున్నట్లు ఆంద్రీ రుడెంకో తెలిపారు.కాగా, గతేడాది జూలైలో ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. దాదాపు ఐదేళ్ల తర్వాత ఆ దేశంలో పర్యటించారు. గత పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ను భారత్ సందర్శించాలని ఆహ్వానించారు. మోదీ ఆహ్వానాన్ని పుతిన్ కూడా అంగీకరించారు. అయితే, తేదీలు మాత్రం ఇంకా ఖరారు కాలేదు.

'పుతిన్ భారత పర్యటనకు సన్నాహాలు జరుగుతున్నాయి. మోదీ ఆహ్వానాన్ని ఆయన అంగీకరించారు.

గతేడాది మోదీ మాస్కోలో పర్యటించారు.. ఇప్పుడు మా వంతు' అని రష్యా రాయబార కార్యాలయం గత నెల వెల్లడించిన విషయం తెలిసిందే. ఇక పుతిన్, మోదీలు తరచూ ఫోన్‌లో టచ్‌లోనే ఉన్నారు. వివిధ అంశాలపై సంభాషించుకుంటున్నారు. అంతేకాదు పలు అంతర్జాతీయ వేదికలపై కూడా ఇరువురు నేతలు సమావేశమవుతున్నారు.

# పెంచిన పెట్రో, గ్యాస్ ధరలను వెనక్కి తీసుకోవాలి

## ♦ కేంద్ర ప్రభుత్వానికి కేటీఆర్ డిమాండ్
## ♦ కేంద్ర పెట్రోలియం మంత్రి హార్దీప్ సింగ్ పూరి కి లేఖ

హైదరాబాద్ :

పెట్రో రేట్లను సెస్సుల రూపంలో పెంచుతూ మోడీ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక దోపిడికి పాల్పడుతూ రాష్ట్రాల హక్కులను కబళిస్తోందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వసూలైన సెస్సులతో మౌలిక సదుపాయాలను కల్పించకుండా తమ సొంత రాజకీయ అజెండా ప్రచారాల కోసం వినియోగిస్తున్నారని మండిపడ్డారు. పన్నుల్లో రావాల్సిన న్యాయమైన వాటాను రాష్ట్రాలకు ఇవ్వకుండా దేశ సమాఖ్య వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు మోడీ ప్రభుత్వం పాల్పడుతుందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి గణనీయంగా సహకరిస్తున్న తెలంగాణ వంటి రాష్ట్రాలు నిధుల కొరతతో అల్లాడుతుంటే అక్రమంగా వసూలు చేస్తున్న సెస్సులతో సమకూరుతున్న ఆదాయంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలపై పెత్తనం చెలాయిస్తుందన్నారు. ఆకాశాన్నంటుతున్న పెట్రో ధరలపై కేంద్ర పెట్రోలియం,సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరీ కి బహిరంగ లేఖ రాసిన కేటీఆర్, ఇంధన ధరల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన దేశాల్లో ఒకటిగా మనదేశం నిలిచిందని విమర్శించారు. భూటాన్, పాకిస్తాన్, ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన శ్రీలంకలో కూడా పెట్రో, డిజిల్, ఎల్.పి.జి ధరలు భారత్ లో కంటే చౌకగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఎల్పీజీ సిలిండర్ ధర ?1,100 దాటడం పేద, మధ్యతరగతి ఆడపడుచులకు భరించలేని భారంగా మారిందన్నారు కేటీఆర్. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల యోజన ఒక క్రూరమైన జోక్ గా మారిందన్నారు. ఒకప్పుడు ఉజ్వల యోజన కింద సిలిండర్లు తీసుకున్న మహిళలు, పెరిగిన గ్యాస్ ధరలతో మళ్లీ కట్టెలపైనే వంట చేస్తున్నారని చెప్పారు. గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు 100 డాలర్లు దాటినప్పుడు కూడా ఇప్పటితో పోలిస్తే దేశంలో ఇంధన ధరలు తక్కువగా ఉన్నాయని, ఇప్పుడు క్రూడ్ ధరలు తగ్గినప్పటికీ ప్రజలపై భారం



పెంచడం దేనికి సంకేతమని కేటీఆర్ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంలోని మంత్రులతో పాటు బిజెపి నేతలు అంతా గతంలో పెట్రో ధరలు తగ్గించమని ఆందోళన కార్యక్రమాలు చేసిన విషయాన్ని కేటీఆర్ తన లేఖలు ప్రస్తావించారు. కేంద్రం పెంచుతున్న పెట్రోల్ గ్యాస్ ధరల వలన పేద ప్రజల జేబులు ఖాళీ అవుతుండగా ఆయిల్ కంపెనీలకు వేలకోట్ల రూపాయలు చేరుతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ధరలు స్థిరంగా ఉంచి, ఓట్లు పండగ అయిపోగానే పెంచడం ప్రజల్ని వంచించడమే అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నన్స్ అన్న కేంద్ర ప్రభుత్వ నినాదం "మాక్సిమం టాక్సేషన్, మినిమం రిలీఫ్"గా మారిందని విమర్శించారు. మోడీ చెప్పిన "అచ్ఛే దిన్" అంటే ఈఎంఐలు కట్టలేక, ఇంధన బిల్లుల భారం భరించలేక మిడిల్ క్లాస్ సతమతమవడం, సిలిండర్ తెచ్చుకోవాలా?, సరుకులు కొనుక్కోవాలా? అన్న మీమాంసలో పేదలు ఉండిపోవడం, రాష్ట్రాలు తమ స్వయంప్రతిపత్తిని కోల్పోవడమేనా అని కేటీఆర్ పశ్నించారు. దేశంలోని కోట్లాది ప్రజల తరపున రాసిన ఈ లేఖలో, ప్రజల తరపున కొన్ని డిమాండ్లను కేంద్రమంత్రి ముందు కేటీఆర్ ఉంచారు. ఇంధన ధరల పెంపును వెంటనే ఉపసంహరించుకోవాలని, కేంద్ర ఎక్సైజ్ సుంకాలను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాలకు ఇవ్వని సెస్‌లను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ క్రూడ్ ధరలకు అనుగుణంగా పారదర్శక ధరల విధానం అమలు చేయాలన్నారు. ఇంధన పన్నులు, సెస్ వినియోగం, ఆదాయ వాటా వివరాలతో కూడిన శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆర్థిక కేంద్రీకరణ విధానాలను విడనాడి, నిజమైన సహకార ఫెడరలిజాన్ని పునరుద్ధరించాలని సూచించారు.

.దేశ ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన సమయం కేంద్రప్రభుత్వానికి వచ్చిందన్నారు కేటీఆర్. ఆకట్టుకునే నినాదాల వెనుక దాక్కోవడం మాని, అసలైన పని చేయాలన్నారు.

# అనంతన్ మరణం పట్ల సీఎం రేవంత్ సంతాపం



హైదరాబాద్ : తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్ గారి తండ్రి తమిళనాడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గొప్ప సాహితీవేత్త శ్రీ కుమారి అనంతన్ (హరికృష్ణన్ నాడార్ అనంతకృష్ణన్) గారి మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గారు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మహాత్ముడి సిద్ధాంతాలను పునికిపుచ్చుకున్న దేశ భక్తుడు, తమిళ భాషా ప్రేమికుడు, అనంతన్ గారిని కోల్పోవడం ఎంతో బాధాకరం అని పేర్కొన్నారు.కుమారి అనంతన్ గారు నాలుగుసార్లు శాసనసభకు, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నో సేవలు అందించారని గుర్తుచేశారు. తండ్రిని కోల్పోయి దుఃఖంలో ఉన్న తమిళ సై గారికి, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి గారు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. అనంతన్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

# సంపాదకీయం

## ఆక్వాను వదలని ట్రంప్ టారిఫ్‌లు

'అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా చేద్దాం, అమెరికా ఫస్ట్' నినాదాలతో అమెరికా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ తన దూకుడు స్వభావంతో వాణిజ్య యుద్ధానికి తెర లేపాడు. ఏప్రిల్ రెండవ తేదీన వాణిజ్య లోటును తగ్గించడం, దేశీయ తయారీని ప్రోత్సహించే లక్ష్యంతో వ్యాపార సంబంధ దేశాలపై ప్రతీకార సుంకాలను విధించాడు. పెంచిన సుంకాలు ఏప్రిల్6 నుండే అమలవుతాయని అమెరికా స్పష్టం చేసింది. ఈ సుంకాల వల్ల 60 పైగా దేశాలు ప్రభావితం అవుతున్నాయి. భారత్‌పై 27 శాతం, చైనాపై 34 శాతం, తైవాన్‌పై 32 శాతం, జపాన్‌పై 24 శాతం, యూరోపియన్ యూనియన్‌పై 32 శాతం, ఇతర దేశాలపై 10 శాతం సుంకాలు విధించారు. భారత్‌కు అమెరికా అతి పెద్ద వాణిజ్య భాగస్వామి. 2024 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు ఎగుమతుల విలువ 77.5 బిలియన్ డాలర్లు. భారత్ నుండి ఎగుమతి అయ్యే ప్రధాన వస్తువులు ఎలక్ట్రానిక్స్, రత్నాలు, ఆభరణాలు, ఫార్మా ఉత్పత్తులు, యంత్రాలు, పెట్రోలియం ఉత్పత్తులు. అయితే ఈ సుంకాల ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై గణనీయంగా పడనుంది. ముఖ్యంగా మన రాష్ట్రానికి సంబంధించిన సీ ఫుడ్స్, ఆక్వా రంగాలను తీవ్రంగా నష్టపరచనున్నాయి. రొయ్యల ఉత్పత్తిలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. 2022-23 సంవత్సరంలో భారత్ నుండి 63.969 కోట్ల విలువ కలిగిన 1.73 మిలియన్ టన్నుల మత్స్య ఉత్పత్తులు ఎగుమతి అయ్యాయి. అమెరికా మత్స్య ఉత్పత్తులకు పెద్ద మార్కెట్. మొత్తం 5.6 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు ఎగుమతి అయితే అందులో 2.4 బిలియన్ డాలర్ల విలువైన రొయ్యలు అమెరికాకు ఎగుమతి అయ్యాయి. దాదాపు 40 శాతం మార్కెట్ వాటా భారత్‌దే. మన దేశం నుండి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంస ఉత్పత్తిల్లో రొయ్యలు మూడవ స్థానంలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకు ఆక్వా కల్చర్ అభివృద్ధి ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుండి అత్యధికంగా ఆక్వా ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ జిల్లాలో దాదాపు 1.20 లక్షల ఎకరాలు, రాష్ట్ర వ్యాప్తంగా 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతుంది. పశ్చిమ గోదావరి నుండే 3.5 లక్షల టన్నుల రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. మొత్తం 18 వేల కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇందులో విదేశీ ఎగుమతుల వాటానే అధికం. కోవిడ్-19 కారణంగా ఎగుమతులు నిలిచిపోయి పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోయింది. దీనికి తోడు వైరస్‌ల బెడద, ధరలు పతనం కావడం, రైతులకు సాగు పెట్టుబడి పెరిగి పోవడంతో ఆక్వా పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. ఇటువంటి సమయంలో ట్రంప్ 27 శాతం సుంకాలు విధించడంతో పరిస్థితులు మరింత దిగజారిపోతున్నాయి. అమెరికా సుంకాలు విధించగానే 100 కౌంట్ రొయ్య ధర 240 నుండి 200 రూపాయలకు పడిపోయింది. కంపెనీలు కొనడానికి ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు అమెరికా ఏప్రిల్-6వ తేదీ నుండే సుంకాల పెంపు అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఇప్పటికే ఒప్పందాలు కుదుర్చుకున్న వాటి పరిస్థితి ఏంటి? ఆరవ తేదీ తరువాత అమెరికా రీచ్ అయ్యే ప్రతి సరుకుపై పెరిగిన సుంకాలు అమలు చేస్తామని అమెరికా అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ టారిఫ్ అమలైతే లక్ష రూపాయలు విలువ చేసే రొయ్యలు అమెరికాకు ఎగుమతి చేస్తే 26 వేల రూపాయల పన్ను కట్టాలి. అంతేకాకుండా రవాణా, ప్యాకింగ్, ఇతర ఖర్చులు కలిపి దాదాపు 50 శాతం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే భారత్ ఎగుమతులపై యాంటీ డంపింగ్ డ్యూటీలు (ఎ.డి.డి)-3.88 శాతం, కౌంటర్ వైలింగ్ డ్యూటీలు (సి.వి.డి)-5.77 శాతం సుంకాలను వసూలు చేస్తున్నారు. కొత్తగా ప్రకటించిన టారిఫ్‌తో కలుపుకుంటే 35 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 1 లక్ష టన్నుల రొయ్యలు ఎగుమతికి సిద్ధంగా ఉన్నాయి. ఇవి కోల్డ్ స్టోరేజ్‌లో ఉన్నాయి. అమెరికాకు 20-40 కౌంట్ ఉన్న రొయ్యలనే ఎగుమతి చేస్తారు. ఎగుమతిదారులు 30 కౌంట్ రొయ్యలను 480 రూపాయలకు కొని కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచారు. కొత్త టారిఫ్ ప్రకారం ఎగుమతి చేస్తే మరో 80 రూపాయలు అదనంగా ఖర్చు అవుతుంది. అంటే టన్నుకు రూ.8.50 లక్షలు నష్టం వస్తోంది. ఉన్న సరుకును ఎగుమతి చేయలేరు. కోల్డ్ స్టోరేజ్ ఖర్చులు భరించలేరు. మరోవైపు వడ్డీల భారం ఉండనే ఉంది.

ఈ సుంకాల విధింపు వల్ల ఎగుమతిదారులే కాకుండా.. రొయ్యల రైతులు, కార్మికులకు తీవ్ర నష్టం జరగనుంది. ఒడిదుడుకుల ప్రభావం మొట్టమొదట పడేది రైతులు, కార్మికుల పైనే. కౌలుకు తీసుకుని సాగు చేసే రైతుల పరిస్థితి మరింత దారుణం. సాగుతో పాటు దీనికి అనుబంధంగా ఉన్న ఫీడ్ కంపెనీలు, టెస్టింగ్ ల్యాబులు, మెడిసిన్ కంపెనీలు, ప్యాకింగ్ యూనిట్లు, ఇందులో పని చేసే కార్మికులపై వీటి ప్రభావం తీవ్రంగా పడుతుంది. రాష్ట్రంలో 450 పైగా రొయ్యల హేచరీలు, 50 పైగా ఫీడ్ మిల్లులు, 2 లక్షల పైగా రొయ్యల చెరువులు, 250 ప్రాసెసింగ్ ప్లాంట్లు, 6 వేలకు పైగా పడవలు, నౌకల ద్వారా కూడా వేలాది మందికి ఉపాధి కల్గుతుంది. 1.5 లక్షల మంది రైతులున్నారు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షల మందికి ఆక్వా పరిశ్రమ ఉపాధి చూపుతుంది. పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతే వీరంతా ఉపాధిని కోల్పోతారు. ట్రంప్ భారత పర్యటన సందర్భంలోనే భారత్‌పై సుంకాలు విధిస్తానని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. అమెరికాతో సత్సంబంధాలు ఉన్నా సంప్రదింపులు జరపలేదు. ట్రంప్ నా స్నేహితుడు, హౌడీ-మోడీ అని ప్రచారం చేసిన ప్రధాని ఇప్పుడు స్పందించటంలేదు. అక్రమ వలసదారుల పేరు చెప్పి భారతీయుల కాళ్లకు గొలుసులు కట్టి బానిసల్లా ఇండియాకు పంపినా నోరు మెదపలేదు. సుంకాలు విధించి ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నా కిమ్మనడం లేదు మన ప్రధాని. దీంతో రూ.18 వేల కోట్ల టర్నోవర్ కలిగిన ఆక్వా పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోతుంది. లక్షల మంది రైతులు, కార్మికులు, ఎగుమతిదారులు నష్టపోతున్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సిక్స్, ఫోర్ అంటూ పథకాల ప్రచారంలో మునిగిపోయింది. ఈక్వెడార్ నుండి ఎగుమతిలో గట్టి పోటీ ఎదురవుతుంది. ఇదే అలసత్వం ప్రభుత్వాలు ప్రదర్శిస్తే, ఇండియన్ మార్కెట్ అంతా ఈక్వెడార్, ఇండోనేషియా వంటి దేశాలకు షిఫ్ట్ అయిపోతుంది. ఆక్వా రంగం నిలదొక్కుకోవాలంటే ఎగుమతులను ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలి. దేశీయ మార్కెట్‌ను అభివృద్ధి చేసే విధంగా, అమెరికాపై ఆధార పడకుండా ప్రత్యామ్నాయ మార్కెట్లను ఏర్పాటు చేసుకోవడానికి దీర్ఘకాల వ్యూహాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉంది. తక్షణ ఉపశమనంగా రైతుల రుణాలను రీషెడ్యూల్ చేయాలి. ఎగుమతిదారులకు, కార్మికులకు ఆర్థికంగా అండగా నిలవాలి. ఎ.పి ఆర్థిక వ్యవస్థలో ఆక్వా రంగం కీలకమైంది. కనుక దీన్ని కాపాడాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

# ప్రతిభాశాలి యజ్ఞేశ్వర చింతామణి



C Y Chintamani
(1880 - 1941)


చిర్రావూరి యజ్ఞేశ్వర చింతామణి. ఈ పేరు చాలా మందికి తెలియనిది. నేటి జర్నలిస్టులు గాని, రాజకీయ నాయకులు గానీ చింతామణి గురించి ఎక్కువగా విని ఉండక పోవచ్చు. ఆయన ఒక తెలుగువాడిగా పుట్టడం తెలుగు వారందరికీ గర్వ కారణం. చదువులో రాణించలేక పోయినా, ఆంగ్ల భాషలలో విశ్వవిద్యాలయ పట్టాలేకున్నా, పుట్టిన గడ్డను వదిలి, నిండా 18 ఏళ్లు నిండకుండానే, ఒక ఆంగ్లపత్రికకు సంపాదకుడుగా కాగలిగి, దాదాపు మూడు దశాబ్దాల కాలం అదీ ఇంగ్లీషు వారి పరిపాలనా సమయంలో ముఖ్య సంపాదకత్వ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన అసమాన ప్రతిభాశాలి చింతామణి. చిర్రావూరు యజ్ఞేశ్వర చింతామణి 1880-1941) పోప్ ఆఫ్ ఇండియన్ జర్నలిజంగా పేరుపొందిన ప్రసిద్ధ పాత్రికేయులు, ఉదారవాద రాజకీయ నాయకులు. అలహాబాదు నుండి వెలువడిన లీడర్ అనే ఆంగ్ల పత్రికకు 1909 నుండి 1934 వరకు మూడు దశాబ్దాలపాటు సంపాదకత్వం వహించారు. ఈయన ఇండియన్ హెరాల్డ్, స్టాండర్డ్ పత్రికలను కూడా వ్యవస్థీకరించారు. 1880 ఏప్రిల్ 10న తెలుగు నూతన సంవత్సరాది నాడు చింతామణి జన్మించారు. విజయనగరం ఆస్థానంలో రాజపురోహితులు. ఆయన తండ్రి చిర్రావూరు రామసోమయాజులు, వేదపండితుడు, విజయనగరం సంస్థానంలో మహారాజా విజయరామ గజపతిరాజుకు రాజగురువు. తాతలు, తండ్రుల లానే చింతామణి కూడా పురోహితులు అవుతారని అందరూ అనుకున్నారు. యజ్ఞేశ్వర చింతామణికి 10 యేటనే వివాహమైనది. చింతామణి అనారోగ్యం వల్ల, మాతృవియోగం వల్ల ఎఫ్.ఏ పరీక్షలో ఉత్తీర్ణుడు కాలేక పోయారు. అయితే, యువరాజా సూచనతో, విజయనగరం మహారాజా కాలేజ్‌లో ఇంగ్లీషు చదువుకోసం వెళ్ళినా, చింతామణి విశాఖలో స్థానిక రాజకీయ వ్యక్తులతో తిరగటం ప్రారంభించారు. విశ్వవిద్యాలయాల నుండి పట్టాలు పొందలేక పోయాయినా, అసమానమైన ఆంగ్లభాషా పాండిత్యాన్ని సంపాదించారు. చదువుకొనే రోజుల్లోనే పత్రికలకు వ్యాసాలు రాశారు చింతామణి. స్వయంకృషితో పట్టుసాధించి, అనేక సభలలో ఉపన్యాసాలను ఇచ్చేవారు. పత్రికా రచనపై ఆయనకు ఆసక్తి మెండుగా ఉండేది. ప్రారంభ దశలో "తెలుగు హార్స్" అనే పత్రికకు సంపాదకుడిగా ఉన్నారు. ఈయన వ్రాసే వ్యాసాలు వైజాగ్ స్పెక్టేటర్ పత్రికలో అచ్చు అవటం ప్రారంభమైంది. ఆ తర్వాత కొంతకాలానికే 18 యేళ్ల వయసులోనే వైజాగ్ స్పేక్టేటర్ పత్రికకు సంపాదకత్వం వహించే అవకాశం లభించింది. అప్పట్లో 30 రూపాయలు జీతం ఇచ్చారు. ఆ తరువాత చింతామణి ఆ పత్రికను 300 రూపాయలకు కొని, తనతో పాటు వైజాగ్ స్పెక్టేటర్ పత్రికను విజయనగరానికి తీసుకొచ్చారు. తర్వాత ఆ వారపత్రికకు "ఇండియన్ హెరాల్డ్" అని నామకరణం చేశారు. ఆ తర్వాత ఈ విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటూ చింతామణీ "నేను కేవలం సంపాదకుడినేకాదు, ఫోర్మెన్, ప్రూఫ్ రీడర్, విలేఖరి, ఉపసంపాదకుడు, యజమాని అన్నీ నేనే' అని వివరించారు. పత్రిక బాగా ప్రాచుర్యం పొందినా ఆర్థిక ఇబ్బందుల వల్ల రెండు సంవత్సరాలలో దాన్ని మూసివేయవలసి వచ్చింది. ఆ సమయంలోనే చింతామణి భార్య మృతి చెందగా, మద్రాసుకు మకాం మార్చి, కొంతకాలం యునైటెడ్ ఇండియా అనే వారపత్రికలోను, ఆ తర్వాత జి. సుబ్రమణ్యం అయ్యర్ సంపాదకత్వంలో వెలువడుతున్న "మద్రాస్ స్టాండర్డ్" దినపత్రికలో ఒక సంవత్సరం పాటు పనిచేశారు. 1903లో నాగేంద్రనాథ్ గుప్తా ప్రారంభించిన "ఇండియన్ పీపుల్" పత్రికకు సంపాదకత్వం వహించడానికి అలహాబాదు మకాం మార్చారు. 1909 అక్టోబరులో మదన్ మోహన్ మాలవ్యా, తేజ్ బహద్దర్ సప్రూ వంటి మితవాద కాంగ్రెస్ నాయకులు "లీడర్" అనే ఆంగ్ల దినపత్రికను ప్రారంభించారు. "ఇండియన్ పీపుల్" పత్రిక "లీడర్" పత్రికలో కలిసిపోయింది. చింతామణి లీడర్ పత్రిక సంపాదకత్వ బాధ్యతను స్వీకరించారు. చింతామణి నిష్పక్షపాతమైన విమర్శకుడిగా పేరు గడించారు. ఈ పత్రికలోని సంపాదకీయాలు ఇతడికి మంచి పేరు ప్రతిష్ఠలను తెచ్చిపెట్టగా, 1916 వరకు లీడర్ పత్రికా సంపాదకుడిగా ఉన్నారు. 1927నుండి మళ్లీ లీడర్ పత్రికకు సంపాదకునిగా వ్యవహరించారు. పత్రికా రంగంతో పాటు రాజకీయాలపై కూడా ఆసక్తి ఉంది. 20 సంవత్సరాలు కూడా నిండని వయసులో 1900 సంవత్సరం చివరలో లాహోరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యేందుకు ప్రయాణ ఖర్చులకు డబ్బు లేకపోతే అప్పుచేసి వెళ్లారు. ఆ సమావేశాలలో అనేక విషయాలపై ఆయన చేసిన గంభీరమైన ఉపన్యాసాలు. సురేంద్రనాథ్ బెనర్జీ, భూపేంద్రనాథ్ బోస్ వంటి కాంగ్రెస్ నాయకుల ప్రశంసా పాత్రాలు అయినాయి. "హిందూ" పత్రిక ఆ ఉపన్యాసాలను ప్రశంసించింది. 1916లో తిరిగి 1927లోనూ ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనమండలి సభ్యులుగా ఎన్నికైనారు. 1921-23 మధ్య అప్పటి యునైటెడ్ ప్రావిన్సెస్ (నేటి ఉత్తరప్రదేశ్)కు విద్య, పరిశ్రమల శాఖల మంత్రిగా పనిచేశారు. 1930-31లో లండన్‌లో జరిగిన మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రతినిధిగా హాజరైనారు. కాంగ్రెస్ వాదిగా రాజకీయాలలో పాల్గొని, గాంధీ సహాయ నిరాకరణ, శాసనోల్లంఘన ఉద్యమాలతో విభేదించి, మితవాదిగా పంథా మార్చుకున్నారు. అయినా గాంధీ, నెహ్రూతో సహా నాటి నేతలంతా చింతామణిని అభిమానించేవారు. బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు 1939లో సర్ బిరుదునిచ్చి సత్కరించింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు (ఎల్.ఎల్.డి)ప్రదానం చేసింది. అలహాబాద్ విశ్వవిద్యాలయం డి.లిట్. గౌరవ పట్టాను ఇచ్చింది. తెలుగు తేజాన్ని, రాజకీయ పరిజ్ఞానాన్ని భారతదేశ మంతటా చాటిన చింతామణి 1941, జూలై 1 న తన 62వ యేట మరణించారు. మరణించిన దినాన సైతం ఆయన స్వీయ సంపాదకీయం రాయడం గమనార్హం.



రామ కిష్టయ్య సంగన భట్ల...

# దోషాలను తొలగించే ప్రదోష వ్రతం

ప్రదోషమంటే అది ఒక కాల విశేషము. దోషాలను హరించే ప్రశస్తమైన కాలాన్ని ప్రదోషకాలం అంటారు. ప్రదోషమంటే పాప నిర్మూలన అని అర్థము. ప్రతిరోజూ సూర్యాస్తమయ సమయములో చంద్రుడి కదలికల వలన ఏర్పడునది ప్రదోషము."ప్రదోషో రజనీ ముఖం" అంటారు. అంటే ప్రదోషకాలం రాత్రికి ప్రారంభం వంటిది. ఈ సమయం లో పరమశివుడు పార్వతీదేవితో కలిసి అర్ధనారీశ్వర రూపంగా దర్శనమిస్తాడు. చంద్రుడి గతి వలన, ఏర్పడే తిథుల సంధులలో సూర్యాస్తమయము అయితే, అప్పుడు ప్రదోషము అంటారు. త్రయోదశినాడు కలిగే ప్రదోషాన్ని 'మహా ప్రదోషం' అంటారు. ప్రదోష సమయం రోజు వస్తున్న త్రయోదశి నాడు వచ్చే ప్రదోష సమయం చాలా పవిత్రమైనది. త్రయోదశి వ్రతం శివుడు ప్రధాన దేవునిగా ఆచరించే వ్రతం. త్రయోదశి నాడు చేస్తారు కనుక త్రయోదశి వ్రతం అని, శివపూజ, రాత్రి భోజనం చేయడం వల్ల ప్రదోష వ్రతం అని అంటారు. త్రయోదశి వ్రతం ఆచరించడం వల్ల మహాశివుడు ప్రసన్నం అవుతాడు. సకల సుఖాలు, సర్వ సంపదల కోసం ఈ వ్రతం చేస్తారు. ప్రదోషం అంటే దోషాలను తొలగించేది అని అర్థం. ప్రతి రోజూ సూర్యాస్తమయ కాలంలో దాదాపు ఆరు ఘడియల అంటే రెండు గంటల 24 నిమిషాల సమయాన్ని ప్రదోష కాలంగా పరిగణిస్తారు. ప్రదోష కాలములో త్రయోదశి తిథి ఉంటే దానిని మహా ప్రదోషం అంటారు. మహా ప్రదోషం రోజున శివ భక్తులు ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారుస్కంద పురాణంలో ప్రదోష మహత్య కథ కూడా వివరింప బడింది. రెండు త్రయోదశి తిథులలో (శుక్ల పక్షము/ కృష్ణ పక్షము) ప్రదోష వ్రతాన్ని ఆచరిస్తారు. కొన్ని ప్రాంతాలలో మాత్రం కేవలం కృష్ణ పక్ష ప్రదోషం రోజును మాత్రమే పాటిస్తారు. అన్ని పూజలు, వ్రతాల వలె త్రయోదశి వ్రతాన్ని ఉదయం వేళ కాకుండా, సూర్యాస్తమయం నుండి రాత్రి రెండు ఘడియలలోపు ఈ పూజ చేస్తారు. ఏ నెలలో అయినా త్రయోదశినాడు ఈ వ్రతం చేసుకోవచ్చు. అయితే ఇది సుదీర్ఘకాలంపాటు చేయాల్సిన వ్రతం. ప్రతినెలలో వచ్చే రెండు త్రయోదశుల్లోనూ త్రయోదశి వ్రతం చేయాలి. అలా 11 సంవత్సరాల పాటు ఆచరించాలి. ఏదయినా ఆటంకం వచ్చి మధ్యలో చేయలేకపోతే ఉద్యాపన చేసి ప్రతిమను విసర్జించవచ్చు. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు ఏకకాలంలో రెండు రూపాల్ని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతి రెండవ భాగమున పరమేశ్వర రూపంగా



"అర్ధనారీశ్వరుడుగా" దర్శనమిచ్చేకాలం. ప్రదోష సమయంలో శివుడు అర్ధనారీశ్వర రూపంలో ఆనంద తాండవ నృత్యం చేస్తాడని నృత్యరత్నావళి లో చెప్పబడింది. ప్రదోష సమయంలో సమస్త దేవతలందరూ శివుడిని అర్చిస్తారని భావిస్తారు. ప్రదోష సమయంలో చేసే శివారాధన ఉత్తమమని చెప్పబడుతుంది. ఈ సమయంలో శివారాధన చేయటాన్ని సమస్త దేవతలను పూజించటంతో సమానంగా భావిస్తారు. మహాశివుడు అభిషేక ప్రియుడు కనుక మంత్రోక్తంగా పంచామృతాలతో ఆయనను అభిషేకించాలి. వీలు పడని వారు ఆలయానికి వెళ్ళి ప్రదోష సమయం లో అభిషేకం చేయించవచ్చు. ప్రదోషకాలం లో శివప్రదోష స్తోత్రాన్ని పఠించడం వలన విశేష ఫలితాలు పొందవచ్చు. ప్రదోష సమయంలో శివాలయాలలో జరిగే అభిషేకాలను దర్శించే వారికి సకల సంపదలు సిద్ధిస్తాయని భావిస్తారు. ఈ సమయంలో శివుడితో పాటు నందీశ్వరుడిని కూడా ఆరాధిస్తారు. నందీశ్వరుడు నాలుగు వేదాలు, 64 కళలను అభ్యసించిన నిష్ణాతుడైనప్పటికీ, వినయంతో వుండి, శివునికి ఏర్పడిన అనుమానాలను కూడా నివృత్తి చేస్తాడని విశ్వసిస్తారు. అందువల్ల నందీశ్వరుడిని ఆరాధించడం వలన బుద్ధికుశలత, మానసిక ఉల్లాసం లభిస్తాయి. త్రయోదశి తిథి ఆదివారం రోజు వస్తే దానిని రవి ప్రదోషం అని, సోమవారం రోజు వస్తే దానిని సోమ ప్రదోషమనీ, మంగళవారం రోజు వస్తే దానిని భౌమ ప్రదోషమని, బుధవారం రోజు వస్తే దానిని బుధ ప్రదోషమని, గురువారం రోజు వస్తే దానిని గురు ప్రదోషమని, శుక్రవారం రోజు వస్తే దానిని శుక్ర ప్రదోషమని, శనివారం రోజు వస్తే దానిని శని త్రయోదశి అనీ, శని ప్రదోషమని పిలుస్తారు. దేవ దానవులు క్షీర సాగరాన్ని మథించినప్పుడు వెలువడిన హాలాహలం నుండి శివుడు ప్రపంచాన్ని రక్షించిన రోజుగా శనిప్రదోషం రోజును చెబుతారు. శని కర్మకారకుడు, శివుడు సంహార కారకుడు కావున శని ప్రదోష సమయాన శివారాధన చేయడం ఉత్తమంగా పరిగణిస్తారు. సోమవారం శివుడికి ప్రీతికరమైనది. కాబట్టి ఆ రోజున వచ్చే సోమ ప్రదోషమును ప్రశస్తమైనదిగా భావిస్తారు. ఈ రోజున ప్రదోష వ్రతము ఆచరించటం వలన మనసులోని మలినాలన్నీ తొలగిపోతాయి.

త్రయోదశీ ప్రదోషము గురువారం వస్తే ఆ రోజును గురు త్రయోదశిగా భావిస్తారు. గురు ప్రదోష పూజ వలన విద్యాబుద్ధులు, సంపదలు కలుగుతాయని చెబుతారు. జాతకములో ఉండే గురు దోషములకు రుద్రారాధన విరుగుడుగా భావిస్తారు. ప్రదోషం రోజు ఉదయమే స్నానం చేసి తెల్లని వస్త్రాలను ధరించి, శరీరంపై విభూతిని, రుద్రాక్షమాలను కూడా ధరించటం మంచిది. ఆ రోజులో వీలైనప్పుడల్లా పంచాక్షరి మంత్రాన్ని (ఓ నమ:శివాయ) జపం చేయాలి. ప్రదోషం రోజున నిశ్శబ్దంగా ఆరాధించటాన్ని శివుడు ఇష్టపడతాడని చెబుతారు. కఠిన ఉపవాసం చేయలేనివారు పండ్లు, పాలు లాంటివి తీసుకోవచ్చు. ఉడికించిన పదార్థాలను తీసుకోకూడదు. సాయంకాలం ప్రదోష సమయంలో స్నానమాచరించి శివ షోడశోపచార పూజ జరపాలి. ప్రదోషం రోజు ఆ పరమ శివుడికి నేతి దీపారాధన, ఆవుపాలతో అభిషేకం అభిషేకం చేయటం, బిల్వ పత్రాలు మరియు శంఖుపూలతో అర్చించటం శ్రేయస్కరం. మహా మృత్యుంజయ మంత్రాన్ని ...ఓం త్రయంబకం యజామహే, సుగంధిం పుష్టి వర్ధనం, ఊర్వారుకమివ బంధనాత్, మృత్యోర్ముక్షీయ మామృతాత్... మహా మృత్యుంజయ మంత్రము పఠించాలి....108 సార్లు జపించి ప్రదోష కథను వినటంగానీ చదవటం గానీ చేయాలి. ఇంటిలో పూజ ముగించిన అనంతరం శివాలయాన్ని దర్శించాలి. వీలైనవారు ప్రదోష స్తోత్రం, శివ స్తోత్రములను కూడా పఠించాలి.

# తోబుట్టువులు - దేవుడిచ్చిన ఆత్మీయ రక్త సంబంధీకులు

డిజిటల్ యుగంలో మానవ సంబంధాలు పునర్నిర్వహించబడుతున్నాయి. న్యూక్లియర్ ఫ్యామిలీ కల్చర్ పెరుగుతున్నది. నాడు "ఇద్దరు లేదా ముగ్గురు బిడ్డలను కనండి" అన్న కుటుంబ నియంత్రణ నినాదం నేడు "ఒక్కరు లేదా అసలే వద్దు" అనే దుస్థితికి చేరడం చూస్తున్నాం. వివాహ బంధం, మంగళ సూత్రం భారమని తలిచి డేటింగ్, సహజీవన సంసారులు, సిచువేషన్‌షిప్ సంబంధాలు పెరిగాయి. సింగిల్ పేరెంట్ సంస్కృతి ఫ్యాషన్ అయిపోతున్నది. ఒక్క సంతానమే తల్లితండ్రులకు భారం అయిపోతున్నది. కుటుంబం అంటే అమ్మ నాన్నతో పాటు ఒక అబ్బాయి లేదా అమ్మాయి మాత్రమే అయిపోతున్నారు. ఈ ఏఐ యుగపు కుటుంబాల్లో ఇద్దరు లేదా అంత కన్న ఎక్కువ సంతానం ఉండడం అరుదైపోతున్నది. నేడు తోబుట్టువులు ఉన్న కుటుంబాలు తక్కువగానే కనిపిస్తున్నాయి. తోబుట్టువులు ఉన్న కుటుంబాలు పిల్లల ఆటపాటలతో ఉల్లాసంగా ఉండడం, తోబుట్టువుల మధ్య రక్త సంబంధం పెనవేసుకుపోవడం, ఒకరినొకరు ప్రాణాలకు మిన్నగా త్యాగగుణంతో జీవించడం చూస్తున్నాం. అదే విధంగా ఒక వయస్సు దాటిన పిదప తోబుట్టువుల మధ్య రక్త సంబంధాలు రక్తపాతం వరకు కూడా వెళ్లడం చూస్తున్నాం. అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవ ప్రాధాన్యం: తోబుట్టువుల మధ్య పవిత్ర రక్త సంబంధం ఉండడం, ఒరకినొకరు ప్రేమగా చూసుకోవడం, సోదరికి సోదరుడు జీవిత కాల రక్షకుడిగా ఉండడం లాంటి విషయాలను అవగాహన పర్చడానికి ప్రతి ఏట 10 ఏప్రిల్‌లన "అంతర్జాతీయ లేదా ప్రపంచ లేదా జాతీయ తోబుట్టువుల దినం (నేషనల్ లేదా వరల్డ్ సిబ్లింగ్స్ డే)"ను పాటించుట ఆనవాయితీగా మారింది. ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మ నాన్న తర్వాత అతి ప్రేమ కలిగిన ఆత్మీయ బంధువులుగా తోబుట్టువులు నిలుస్తున్నారు. హిందూ సమాజం సోదరసోదరీమణుల మధ్య రక్త సంబంధ విలువను తెలుపులకు "రక్షాబంధన్" లేదా "రాఖీ పండుగ"ను తోబుట్టువుల దినం మరో రూపంలో పవిత్రంగా నిర్వహించుకుంటున్నాం. చిన్నతనంలో సోదరి సున్నితమైన ప్రేమను రుచి చూడని సోదరుడు, నేనున్నాననే అనంత ధైర్య రక్షణ గొడుగు పట్టే సోదరుడి తెగువ చూడని సోదరి ఉండదు. అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవ చరిత్ర: 1995లో తన సోదరుడు, సోదరిని చిన్న వయస్సులోనే కోల్పోయిన అమెరికన్ "క్లాడియా ఇవర్ట్" తన సోదరి లిసెట్టె పుట్టిన రోజున 10 ఏప్రిల్‌న "తోబుట్టువుల దినం ఫౌండేషన్" ఏర్పరిచి తోబుట్టువుల దినం జరుపుకోవడం ప్రారంభించాడు. అనంతరం అమెరికాలో ఒబామా చొరవతో "జాతీయ తోబుట్టువుల దినం", తర్వాత 1998 నుంచి ఐరాస నేతృత్వంలో "అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవం" పాటించుట కొనసాగుతున్నది. వయస్సు పెరగడంతో పాటు ప్రాధాన్యాలు, చదువుల మార్గాలు, వివాహాలు జరగడం, ఉద్యోగ ఉపాధుల పేరుతో విడివిడిగా వేరు వేరు ప్రాంతాల్లో జీవించడం కొనసాగుతూనే అనువంశిక ఆస్తి తగాదాలతో గొడవలు పడడం లాంటి అవాంఛనీయ విభేదాలు కూడా పొడచూపడం తరుచుగా గమనిస్తున్నాం. తోబుట్టువుల అపురూప రక్త సంబంధం: శరీరంలో కాళ్లు సోదరులను, చేతులు సోదరీమణులను పోలి ఉంటాయి. అమితమైన ప్రేమలు కలిగిన తోబుట్టువులు ఉన్న ఇల్లు బలమైన మానవ రక్త సంబంధాలు కొలువైన కోవెలగా నిలుస్తున్నది. మన మనస్తత్వం అణువణువున తెలిసిన వ్యక్తులుగా తోబుట్టువులు నిలుస్తారు. భార్యాభర్తల బంధాలను పోలిన బంధాలుగా తోబుట్టువుల సంబంధాలు నిలుస్తున్నాయి. మనం ఏ వయస్సులో ఉన్నా చిన్నతనపు రోజులను గుర్తు చేసే వారు తోబుట్టువులు మాత్రమే. సోదరి లేని సోదరుడి జీవితం ప్రేమలు కొరవడిన యాంత్రిక జీవితంగా నిలుస్తుంది. సోదరికి జీవితకాల హీరో సోదరుడు మాత్రమే. జీవితాంతం మన గురించి మంచిని ఆలోచించే వ్యక్తులుగా తోబుట్టువులు మాత్రమే నిలుస్తారు. సోదరుడికి చిన్న నొప్పి తగిలినా సోదరి కళ్లు కుళాయి వలె కన్నీళ్ల వరదలు పారిస్తుంది. తోబుట్టువులు అత్యుత్తమ స్నేహితులుగా లేదా శత్రువులుగా ఉండడం చూస్తున్నాం. అంతర్జాతీయ తోబుట్టువుల దినం వేడుకలు: అంతర్జాతీయ తోబుట్టువుల దినోత్సవం సందర్భంగా ప్రపంచ దేశాల్లో ప్రతి కుటుంబంలో సోదరసోదరీమణులు కలిసి సంతోషంగా గడపడం, వారి మధ్య పవిత్ర బంధాన్ని వ్యక్తం చేసుకోవడం, స్వల్ప విబేధాలను పరిష్కరించుకోవడం, రక్త సంబంధాల విలువను అవగాహన పర్చడం, తోబుట్టువులు అందరు కలిసి తమ వయస్సును మరిచి బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో సరదాగా గడపడం, కుటుంబ సభ్యులు పిక్నిక్ రూపంలో బయటకు వెళ్లి గడపడం, ఆటపట్టించిన సందర్భాలను నెమరు వేసుకోవడం, తమ పవిత్ర బంధాన్ని జీవితాంతం కొనసాగించడానికి ప్రతిన బూనడం, తోబుట్టువులు కలిసి తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ సన్మానించుకోవడం, తోబుట్టువులు తమ విభేదాలను మరిచి తిరిగి ఏకం అయ్యే రోజుగా మార్చుకోవడం లాంటి పవిత్ర కార్యక్రమాలు నిర్వహించవచ్చు. జన్యువులను పంచుకొని పుట్టిన తోబుట్టువులు జీవితకాల ప్రేమలను పంచుకోవడానికి ప్రయత్నాలు చేయాలి. పొడ చూపిన స్వల్ప విభేదాలను పరిష్కరించుకుంటూ రక్త సంబంధ బలాన్ని ప్రదర్శించాలి. తోబుట్టువుల దినం ఆనందాల విందులు పంచి పెట్టే వేడుకలుగా మారాలి.



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



లాల్కట క్రాసింగ్ దగ్గర తీ లేరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు

ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి రైతు సహకార ప్రాథమిక కేంద్రంలో వడ్లు అమ్ముకోవాలని దళారులకు చేతిలో మోసపోవద్దని ఆమె అన్నారు ప్రతి రైతు వారి అమ్మిన వెంటనే వారి వారి అకౌంట్లో డబ్బులు పడతావని అని అన్నారు ఈ కార్యక్రమంలో పేట డిసిసి అధ్యక్షులు కె ప్రశాంత్ కుమార్ రెడ్డి పి ఎస్ సి చైర్మన్ జి రాజేందర్ గౌడ్ జిల్లా ఓబీసీ అధ్యక్షులు గొల్ల కృష్ణయ్య జిల్లా నాయకులు మోహన్ రెడ్డి మాజీ మండల యువత అధ్యక్షుడు అంజిరెడ్డి వినీతమ్మ నీలి రవి తిమ్మారెడ్డి తో పాటు అధిక సంఖ్యలో నాయకులు పాల్గొన్నారు

# బోరును బాగు చేయించండి ప్రజలు పంచాయతీ సెక్రెటరీనీ కోరడం జరిగింది



ఊర్కొండ ఏప్రిల్09వుదయం ప్రతినిధి):

నాగర్ కర్నూల్ జిల్లా ఊరుకొండ మండలం ఈరోజు ఊరుకొండ పేట గ్రామంలో ఆరువ వార్డ్ లో నీరు ఉన్న నిరూపకంగా ఉన్న బోరును బాగు చేయించండి అంటూ ఉరుకొండ పేట గ్రామ పంచాయతీ సెక్రెటరీ ప్రజలు కోరడం జరిగింది. నిరూపకంగా ఉన్న బోరుని వద్దకు వచ్చి పరిశీలించిన గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఇబ్రహీం

# అకాల వర్షాలతో నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించాలి.

బి ఆర్ ఎస్ నర్సంపేట రూరల్ మండల పార్టీ డిమాండ్.



నర్సంపేట ఏప్రిల్09వుదయం ప్రతినిధి): నర్సంపేట రూరల్ బి ఆర్ ఎస్ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నామాల సత్యనారాయణ మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల రైతులకు చాలా పంట నష్టం జరిగిందని వెంటనే ప్రభుత్వం అధికారుల ద్వార పంట నష్టం అంచనా వేసి పరిహారం రైతులకు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. అలా చేయకుంటే ప్రజలందరినీ చేరదీసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నరసింహరములు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మంచిక నర్సయ్య, మోతే పద్మ నాభ రెడ్డి, మోటూరి రవి, కోడారి రవి, కట్ల సుదర్శన్ రెడ్డి, తాల్లపెల్లి రాం ప్రసాద్, బీరం మదవరెడ్డి, వళ్ళల కర్ణకార్, అల్లి రవి, పెండ్యాల మునేందర్, పెండ్యాల బిక్షపతి, బుస రాజు, చుండు ప్రశాంత్, చేరాల గోవర్ధన్, చాంద్ పాషా, జాఫర్, నూనె కుమారస్వామి, రాజీ రెడ్డి, బుక్య వీరన్న, జినుకల విజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వడ దెబ్బతో వ్యవసాయ కూలీ మృతి..



పరకాల ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి):పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామం సీతారాంపురంకు చెందిన కుసుంబ మోతే రావు రోజువారి కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజువారి లాగే ఏప్రిల్ 8 మంగళవారం రోజున కూలి పనికి వెళ్తూ వడదెబ్బ తాకడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. కుటుంబ యజమాని మరణించడంతో శోకసముద్రంలో మునిగిపోయారు. మోతే రావుకు భార్య కుమారుడు కూతురు ఉన్నారు.

## నిశ్చితార్థ వేడుకలకు హాజరై కాబోయే నూతన వధువులను ఆశీర్వదించిన జువ్వాడి నర్సింగరావు



మేట్ పల్లి ఏప్రిల్ 09 (వుదయం విలేఖరి) మేట్ పల్లి పట్టణ ప్రాంతంలో ఐ క్యూ మైండ్స్ లో అడ్మినిస్ట్రేషన్ లో పని చేసే కానరవు మహేశ్వర్ నిశ్చితార్థ వేడుకలు ఆర్పి రెస్టారెంట్లో బుధవారం జరిగిన ఇట్టి నిశ్చితార్థ వేడుకలకు హాజరై కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు తో పాటు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ



మధిర ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపల్ చరిత్ర అధ్యాపకులు డాక్టర్ రవీంద్రారెడ్డి రచించిన III B.A. స్టడీ మెటీరియల్ (తెలంగాణ చరిత్ర సంస్కృతి) ఆవిష్కరించి బిఏ ఆరవ సెమిస్టర్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి అరుణ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ వక్తలు కళాశాలలో విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించడం జరుగుతుందని దీనిని సద్వినియోగపరచుకొని కళాశాలలో విద్యార్థులు అందరూ ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ ఎస్, ఇందిర, డాక్టర్ పి, సుజాత, వెంకటలక్ష్మి ,జ్యోతి, హారిక , శ్రీనివాసరావు, మాధురి,డాక్టర్ సుబ్బరాజు ,ఫణీంద్ర కుమార్, సురేష్, శివకుమారి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మధిరలో వంద పడకల హాస్పిటల్ ను వెంటనే ప్రారంభించాలి:

## బిజెపి అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు



మధిర ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) మధిరలో నూతనంగా నిర్మించిన వంద పడకల ప్రభుత్వహాస్పిటల్ ను ప్రారంభించాలని వంద పడకల హాస్పటల్ ఎదుట పట్టణ బీజేపీ అధ్యక్షులు శివరాజు సుమంత్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరావు మాట్లాడుతూ ప్రజలు అన్నీ సదుపాయాలతో మెరుగైన వైద్యం కోసం ఎదురు చూస్తున్నారని, వైద్యం కోసం అన్నీ విభాగల్లో సిబ్బందిని నియమించి ప్రజలకు సౌకర్యంగా ఏర్పాటు చెయ్యాలని అన్నారు. అత్యవసర పరిస్తులలో ఖమ్మం వెళ్లవలిసి వస్తున్నదని అన్నీ సదుపాయాలు ఏర్పాటు చెయ్యాలని అన్నారు. వంద పడకల హాస్పిటల్ ఇంత వరకు ప్రారంభానికి నోచుకోక పోవటం విడ్డురంగా ఉందన్నారు. ప్రజలకు ఇంత అవసరం ఉన్నా మన ఎమ్మెల్యే, మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఎందుకు చొరవ తీసుకోవటం లేదో ప్రజలకు అర్థం కావటం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వనికి ప్రజలపై విశ్వాసం లేదని విమర్శించారు. వెంటనే వంద పడకల హాస్పిటల్ ప్రారంభించాలి అని డిమాండ్ చేశారు. లేనిచో భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో ఈ ప్రభుత్వం పై ఉద్యమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో బీజేపీ జిల్లా కార్యదర్శి చిలివేరు సాంబశివరావు,జిల్లా కార్యవర్గ సభ్యులు కుంచం కృష్ణారావు, మండల అధ్యక్షులు గుండా శేఖర్ రెడ్డి,పాపట్ల రమేష్,సీనియర్ బీజేపీ నాయకులు గడ్డం శ్రీహరి,జిల్లా నాయకులు అనగాని రామారావు, కోరిపల్లి శ్రీను,బాడిశా అర్జునరావు, తదితరులు.

# క్రియాశీల సభ్యుల సమావేశం...



కోరుట్ల ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం కథలాపూర్ మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు మల్యాల మారుతి ఆధ్వర్యంలో కథలాపూర్ మండల భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పార్టీ క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు ఈసమావేశానికి ఇంచార్జ్ గా రాజన్న సిరిసిల్ల జిల్లా ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు నంద్యాడపు వెంకటేష్ విచ్చేశారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలను క్రియాశీల సభ్యులు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు క్లుప్తంగా వివరించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని కోరారు ఈకార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కోడిపెల్లి గోపాల్ రెడ్డి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాచమడుగు వెంకటేశ్వర్ రావు జిల్లా కౌన్సిల్ సభ్యులు కథలాపూర్ మహేష్ పిడుగు ఆనంద్ రెడ్డి నరెడ్ల రవి దయ్యా లక్ష్మినర్సయ్య జిల్లా సత్యం అల్లకొండ నవీన్ పాలేపు రాజేష్ నరేష్ గంగామల్లయ్య శ్రీధర్ శివ వినయ్ నరేందర్ మహేష్ సంతారం సాయిరెడ్డి వినయ్ రాజేష్ రాజరెడ్డి శ్రీకాంత్ పాల్గొన్నారు

# రాజీవ్ యువ వికాసం పథకం గడువు పొడిగింపు



జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) : రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుల కొరకు గడువు ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలకు చిన్ని నా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థిక పురోగతి పెంపొందించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని వెల్లడించారు అర్హత ఆసక్తి కలవారు ఆన్లైన్లో దరఖాస్తులు నమోదు చేసి దరఖాస్తు చేసిన పత్రాలను మండలాలలోని మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ, పత్రం కుల దృవీకరణ పత్రం, వ్యవసాయ సంబంధిత స్కీం వారికి మాత్రమే పట్టాదారు పాస్ పుస్తకం, వానలో స్కీం వారికి మాత్రమే డ్రైవింగ్ లైసెన్సు, వికలాంగులకు సదరం క్యాంప్ సర్టిఫికెట్ తోపాటు ఫోటో జతపరచి జరకాసులు చేసుకోవాలని తెలిపారు దరఖాస్తుదారులకు సంబంధించి గ్రామీణ ప్రాంతం అయితే సంవత్సరానికి 1,50,000 రూపాయల ఆదాయం పట్టణ ప్రాంతాలు అయితే సంవత్సరానికి 2 లక్షలకు ఆదాయానికి మించకుండా తెలిపారు 21 సంవత్సరం నుండి 55 ఏళ్ల వరకు ఉన్నవారే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు.

# మజ్జిగ పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు

మిర్యాలగూడ, ఏప్రిల్09వుదయం ప్రతినిధి): త్రిపురారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద బుధవారం ఉదయం మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు 500 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతకాయల యాదయ్య, రాంబాబు, బైరం శ్రీను, శివ, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలు వలన నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం

## ఇవ్వాలి: రైతు సంఘం జిల్లా సభ్యులు దివ్వెల వీరయ్య



మధిర ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) ఎర్రుపాలెం మండలంలో అకాల వర్షాలు, ఈదురు గాలులతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపియం తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య డిమాండ్ చేశారు. ఎర్రుపాలెం మండలంలోని బీమవువరం, గుంటూవల్లి గోవవరం వలు గ్రామంలో సిపియం పార్టీ రైతు సంఘం నాయకులు పర్యటించి అకాల వర్షాలు, ఈదురు గాలుల వలన దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. రైతులను అడిగి పంట నష్టం వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం,సిపియం జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య మాట్లాడుతూ.. నోటికొచ్చిన పంట భూమి పాలైందని అన్నారు. జిల్లాలో అకాల వర్షాలు, ఈదురు గాలులతో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న, వరి, మామిడి, సపోట, బొప్పాయి,జామ తదితర పంటలకు వేలాది ఎకరాలలో నష్టం వాటిల్లిందని చెప్పారు. అప్పులు చేసి పంటలకు పెట్టుబడి పెట్టిన రైతులు నష్టపోయి దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని చెప్పారు. పంటలకు జరిగిన నష్టాలను తక్షణమే నమోదు చేసి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అన్ని పంటలకు పంటల బీమా పథకం వర్తింపజేయాలన్నారు. నష్టపోయిన రైతుల పంట రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వానలు ఈదురు గాలులు పరిపాటిగా మారిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విపత్తు సహాయం కింద ఖమ్మం జిల్లా కూ నిధులు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే సర్వే చేసి ఆహారధాన్యాల కు ఎకరాకు రూ. 25 వేలు,వాణిజ్య పంటల కు ఎకరాకు రూ. 40,000 పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను అన్ని విధాల ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గొల్లపూడి పెద్ద కోటేశ్వరరావు,సిపిఎం మండల కమిటీ సభ్యులు నల్లమోతు హనుమంతురావు, షేక్ జాని,గొల్లపూడి చిన్న కోటేశ్వర రావు,విశ్వనాధం, వేమిరెడ్డి కృష్ణరెడ్డి,సొసైటీ డైరెక్టర్ శ్రీహరి నారాయణ, మందడపు భాస్కరరావు, అనూమోలు, మోహన్ రావు, వేంకట కృష్ణ పలువురు రైతులు పాల్గొన్నారు.

# స్టాచ్యూ ఆఫ్ యూనిటీని సందర్శించిన మంత్రులు జూపల్లి, తుమ్మల



నాగర్ కర్నూల్ ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి)గుజరాత్‌లోని సత్పురా, వింధ్యాంచల్ పర్వత శ్రేణుల్లోని నర్మదా నది తీరంలో.. కెవాడియా ప్రాంతంలో.. ఉన్న సర్దార్ వల్లబాయ్ పటేల్ ఐక్యతా (స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ) విగ్రహాన్ని, టెంట్ సిటీని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సందర్శించారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, పెట్టుబడులను, పర్యాటకులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం, ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశంలో నూతన పర్యాటక విధానాన్ని తీసుకువచ్చామని అన్నారు. తెలంగాణ పర్యాటక అభివృద్ధిలో భాగంగా దేశీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రదేశాలను సందర్శించి, తెలంగాణ పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను అధ్యయనం చేస్తున్నామని దీంట్లో భాగంగానే స్టాచ్యూ ఆఫ్ యూనిటీ, టెంట్ సిటీని సందర్శించామని మంత్రి జూపల్లి తెలిపారు. 2027-28 సంవత్సరాల్లో తెలంగాణ జరగనున్న గోదావరి, కృష్ణ పుష్కరాలకు సంబంధించి సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు టెంట్ సిటీలో ఉన్న వసతులను అధ్యయనం చేశామని చెప్పారు. ఇలా తెలంగాణ పర్యాటక అభివృద్ధికి ఉన్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. మంత్రుల వెంట పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, డాక్టర్ రాజేష్ రెడ్డి ఉన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి

## బిస్మారాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి



నారాయణపేట టౌన్ ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం సజనాపూర్ గ్రామంలో బొడ్రాయి పండుగ బుధవారం ఆ గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ముందు భీష్మరాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 1.35 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభాన్ని బుధవారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థులంతా కలిసి ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణం చేపట్టారని, ధ్వజస్తంభ నిర్మాణానికి సహకరించాలని తమను కోరిన వెంటనే రూ. 1.35 లక్షలతో ధ్వజస్తంభ నిర్మాణాన్ని చేపట్టి దేవాలయ నిర్వాహకులకు అందజేయడం జరిగిందని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవానికి తమను ఆహ్వానించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలంతా ఆధ్యాత్మికను పెంపొందించుకోవాలని కోరారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరైన రాజ్ కుమార్ రెడ్డిని దేవాలయ నిర్వాహకులు, గ్రామస్థులు శాలువలతో, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు రాజ్ కుమార్ రెడ్డి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన అన్నదానంలో పాల్గొని భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు సి.మాణిక్యప్ప, కనకప్ప, నర్సప్ప, వెంకటేష్, షరీఫ్, ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, పోలీసు పటేల్ మధుసూదన్ రెడ్డి, హన్మంతు, గోపాల్ గౌడ్, రుద్రారెడ్డి, వై.సంతోష్, అశోక్, ఎం.సంతోష్, నందుకుమార్, చామకూర నగేష్, ప్రవీణ్, విజయ్, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు. మాణికేశ్వరి మాత ఆలయంలో పూజలు

సజానపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మాణికేశ్వరి మాత ఆలయానికి భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి రూ. 50 వేలను విరాళంగా ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న దేవాలయంలో బుధవారం రాజ్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు చేపట్టారు. దేవాలయాన్ని సందర్శించిన రాజ్ కుమార్ రెడ్డిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆనంద్, మహిళలు పాల్గొన్నారు. మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు మండలంలోని గట్ రెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీశ్రీశ్రీ మైసమ్మ తల్లి బోనాల పండుగ సందర్భంగా దేవాలయాన్ని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్ కుమార్ రెడ్డి సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సిరెడ్డి, సాయిరెడ్డి, బుగ్గప్ప, వెంకటరెడ్డి, నారాయణరెడ్డి, ఐరపల్లి రాంరెడ్డి, హన్మంతు, తిమ్మారెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలూర్ ఎంపీడీవో ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు

కామారెడ్డి, ఏప్రిల్09వుదయం ప్రతినిధి): ఆలూర్ మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎంపీడీవో అధికారికి గంగాధర్ కు బీఆర్ఎస్ నాయకులు బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిది గ్రామల ప్రజలకు ఈ ప్రజా పరిషత్ ద్వారా అనేక సేవలు అందుతాయన్నారు. కార్యాలయంకు వచ్చే ప్రజల పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవోని కోరారు.

# రాంజీ గోండ్ చరిత్రను వెలుగులోకి తేవాలి

## భారత ప్రథమ పోరాట యోధుడు రాంజీ గోండ్ కి ఆదివాసుల ఘన నివాళులు

## తుడుం దెబ్బ, ఆదివాసీ సంక్షేమ పరిషత్



కొత్తగూడ ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి ): మండల కేంద్రంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి "తుడుం దెబ్బ" మండల అధ్యక్షుడు పూనేం సందీప్ అధ్యక్షతన ఆదివాసుల కోసం బ్రిటిష్-నిజాం లను ఎదిరించి పోరాడిన గోండ్ వీరుడు రాంజీ గోండ్ 165 వ వర్ధంతి ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షులు దాట్ల నాగేశ్వరరావు, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్ట%శీ% ఉపేందర్, గుమ్మడి లక్ష్మీనారాయణ ఎం ఇ ఓ మాట్లాడుతూ భారత ప్రథమ స్వతంత్రం పోరాటం అంటేనే సహజంగా స్ఫూర్తించేది 1857 సిపాయి తిరుగుబాటు. అదిలాబాద్ జిల్లాలోని గోండ్ లో ధైర్యశాలిగా పేరున్న మర్శ కొల్ల రాంజీ గోండ్ 1836-1860 మధ్యకాలంలో నాటి జనగం (అసిఫాబాద్)కేంద్రంగా చేసుకొని బ్రిటిష్ సైన్యాలను దీటుగా ఎదుర్కొన్న తొలి పోరాట యోధుడు. రోహిల్లాల తిరుగుబాటు రాంజీ గోండ్ నాయకత్వంలో తీవ్ర రూపం దాల్చింది. రాంజీ గోండ్ పోరాట పటిమను చుసిన బ్రిటిష్-నిజా%శీ% లు నిర్మల్ కలెక్టర్ తో కుట్రపాన్ని దొంగ చాటున పట్టుకొని కడదక పోరాడిన రాంజీ గోండు తో సహా 1000 మందిని పట్టుకొని నిర్మల్ నడిబొడ్డున ఉన్న ఊడల మర్రి చెట్టుకు 1860 ఏప్రిల్ 9న ఉరి తీశారు. ఆ మర్రి చెట్టుకు "వెయ్యి ఊరిల మర్రిచెట్టు" గ ప్రసిద్ధి. . దేశ ప్రథమ స్వతంత్ర పోరాటం తర్వాత బ్రిటిష్ నిజాం నిరంకుషత్వాలకు ఎదురెల్లి ప్రాణాలను అర్పించిన ఘనత తొలి విర యోధుడుగా రాంజీ గోండ్ కె దక్కింది.

ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జాతీయ అధ్యక్షులు దాట్ల నాగేశ్వర్ రావు, తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు వట్టం ఉపేందర్, తుడుం దెబ్బ మండల అధ్యక్షులు పూనేం సందీప్, మల్లెల సారయ్య, భాస్కర్, శ్రీను బాబు, నగేష్, సుదర్శన్, ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు గుమ్మడి లక్ష్మీనారాయణ ఎం ఈ ఓ , వాసం వీర స్వామి, వట్టం సాయిలు, జేజ్జరీ శివ క్రిష్ణ, పూనేం రామచందర్, పెనక ప్రభాకర్, ఇరుప సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ద్యేయంగా మెగా జాబ్ మేళా

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు





జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ద్యేయంగా మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, జాబ్ మేళా నిర్వహించే టాస్క్ కంపెనీ ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఈ నెల 26 న నిర్వహించే మెగా జాబ్ మేళా కార్యక్రమ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో టాస్క్ కంపెనీ నిర్వహిస్తున్న జాబ్ మేళా లో ప్రముఖ కంపెనీలు పాల్గొంటు న్నట్లు తెలిపారు. 700 కంపెనీలు పాల్గొంటున్న ఈ జాబ్ మేళా లో 10 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీన నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు ఈ జాబ్ మేళా కార్యక్రమంపై గ్రామ గ్రామాన విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈనెల 26 వ తేదీన జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే జాబ్ మేళా కు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు హాజరవుతారని తెల్పారు. క్యూ ఆర్ కోడ్ లో దరఖాస్తు ఉంటుందని విద్యార్హతలు ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. క్యూ ఆర్ కోడ్ లో రిజిస్ట్రేషన్ చేయించుకొని వారు 26వ తేదీన నిర్వహించే జాబ్ మేళా స్టాళ్లలో నమోదు చేసుకోవాలని తెలిపారు. 10 వతరగతి నుండి డిగ్రీలు, పిజీలు ఇతర పై చదువులు చదువుకున్న నిరుద్యోగ యువత కు గొప్ప అవకాశమని అన్నారు. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో అవగాహన కల్పించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని అత్యవసర వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని జిల్లా వైద్యాధికారికి సూచించారు. మందులు, ఓ ఆర్ ఎస్ అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జాబ్ మేళా కార్యక్రమపై గ్రామ స్థాయిలో అధికారులు నిరుద్యోగ యువతను గుర్తించి వారి పూర్తి బయో డేటా నివేదిక తయారు చేయాలని తెలిపారు. అట్టి జాభితా మేరకు అర్హతలు బట్టి వారికి అవకాశాలు కల్పనకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. జాబ్ మేళా రిజిస్ట్రేషన్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ ఆర్ కోడ్ పై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ జాబ్ మేళాలో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొనేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అదే రోజున నియమక ఉత్తర్వులు జారీ చేస్తారని తెలిపారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ నిరుద్యోగ ఈ జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెడు వ్యసనాలకు బానిస కాకుండా యువత కు ఈ జాబ్ మేళా ద్వారా ఉపాధి లభిస్తుందని తెలిపారు. దూరం అని కాకుండా ఎక్కడ అవకాశం వస్తే ఆ జిల్లాకు వెళ్లాలని, నేను కలెక్టర్ ఇతర రాష్ట్రాల నుండి వచ్చి ఇక్కడ ఉద్యోగం చేస్తున్నామని అన్నారు. యువతి ,యువకులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ శాఖ ద్వారా కూడా పెద్ద ఎత్తున జాబ్ మేళా పై ప్రచారం కల్పిస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కేటీపీఎస్ సీఈ ప్రకాష్, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రఘు, టాస్క్ ప్రతినిధి ప్రదీప్ రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా

యాదాద్రి భువనగిరి/వుదయం పతినిధి:- మోత్కూర్ బూతు నెంబర్ 01 లో బూత్ అధ్యక్షులు జినుకల దశరథ పార్టీ జెండాను ఆవిష్కరించడం జరిగినది, స్వీట్లు పంపిణీ చేసి పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగినది , అనంతరం గమ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా మోత్కూర్ పట్టణ అధ్యక్షురాలు చాడా మంజుల ఆధ్వర్యంలో ముదిరాజ్ భవన్ ఏరియా కాలనీలో ప్రజల సమస్యలను తెలుసుకోవడం జరిగినది అనంతరం మన ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ రేషన్ షాప్ లో ఉచితంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం తో వండిన భోజనాన్ని బూత్ అధ్యక్షులు జినుకల లావణ్యదశరథ ఇంట్లో బిజెపి నాయకులు కార్యకర్తలు అందరూ తినడం జరిగినది, ఈ కార్యక్రమంలో మాజీ రైల్వే బోర్డునెంబర్ కొనతం నాగార్జునరెడ్డి జిల్లా కోశాధికారి గుజ్జ సోమ నరసయ్య జిల్లా నాయకులు గౌరు శ్రీనివాస్ దొంతి నరసింహారెడ్డి పోచం సోమయ్య నియోజకవర్గ కో కన్వీనర్ కూరాకుల వెంకన్న బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం ప్రోగ్రామ్ కన్వీనర్ చేకూరి మల్లేశం మహిళా మోర్చా నాయకులు మరాఠీ విజయలక్ష్మి మధు సోమేశ్వరి జిల్లాకౌన్సిల్ మెంబర్ ఎడ్ల రాము పట్టణ నాయకులు ముత్తినేని తిరుమలేష్ కందుకూరి



ప్రకాష్ టంగుటూరి వెంకన్న తీగల శ్రీధర్ గౌడ్ పురుగుల కృష్ణ మాసిరెడ్డి రెడ్డి బీసు మధు తదితరులు పాల్గొన్నారు..

# మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో నిందితునికి 20 సంవత్సరంల జైలు శిక్ష

జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) మైనర్ బాలికను అత్యాచారం చేసిన కేసులో నిందితునికి కోర్టు 20 సంవత్సరంల జైలు శిక్ష తోపాటు15 వేల రూపాయల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం మహాముతారం మండలం నిమ్మగూడెం గ్రామానికి చెందిన గౌరవేణి అర్జున్ (27) 2020 వ సంవత్సరంలో మండలానికి చెందిన ఒక మైనర్ యువతని అత్యాచారం చేసినందుకు గాను అతనిపై అత్యాచారం తోపాటు ఫోక్సొ చట్టం కింద అడవి ముత్తారం పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ గా ఉన్న ఎస్సై రాజు కేసు నమోదు చేయగా అప్పుడు కాటారం డిఎస్పీగా ఉన్న ప్రస్తుత అడిషనల్ ఎస్పీ భూపాలపల్లి జిల్లా బి కిషన్ కోర్టులో చార్జ్ షీట్ ఫైల్ చేసినట్టు



తెలిపారు కేసు విచారణలో నిందితుడు గౌరవనీ అర్జున్ పై నేరం రుజువు అయినందున భూపాలపల్లి జిల్లా కోర్టు న్యాయమూర్తి,నారాయణబాబు, నిందితునికి 20 సంవత్సరంల జైలు శిక్ష తోపాటు 15,000 రూపాయలు జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు ఈ కేసులో జిల్లా కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ విష్ణువర్ధన్ రావు, వాదనలు వినిపించగా కోర్టు లైసనింగ్ ఆఫీసర్ జి.వెంకన్న ఏఎస్ఐ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్, రమేష్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ కిరణ్ ఖరే నిందితుడికి శిక్ష విధించడంలో సమర్థవంతంగా పనిచేసిన అప్పటి దర్యాప్తు అధికారిని, కేసు ట్రయల్ లో భాగంగా సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టడానికి కృషి చేసిన ప్రస్తుత కాటారం డి.ఎస్.పి రామ్మోహన్ రెడ్డి ని సీఐ నాగార్జున రావు, అడవి ముత్తారం ఎస్సై,మహేందర్ కుమార్లను, పి పి, కోర్టు లైజని%శీ%గ్ ఆఫీసర్, కోర్టు పిసిలను అభినందించినట్లు ప్రకటనలో వెల్లడించారు.

# ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం.. "పాదూరి శంకర్ రెడ్డి"



తుంగతుర్తి/ శాలిగౌరారం, ఏప్రిల్ 9, (వుదయం ప్రతినిధి): శాలిగౌరారం మండల పరిధిలోని ఎన్జీ కొత్తపల్లి గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాలిగౌరారం మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే రైతులు తాలు, చెత్త లేకుండా తేమ శాతం 17 లోపు ఉండే విధంగ ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని అన్నారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగె నరసింహ, ఏపిఎం రాములు, సిసి బాలు, వడ్లకొండ పరమేష్, సంకటి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనికి హాజరు కావాలి.

## ప్రతి రోజూ 307 రూపాయలు వచ్చేలా పని చేపించాలి..

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు.

పరకాల ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి): పరకాల మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో యంపీడీఓ మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి తేదీ నుండి నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభం అయినందున జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనికి వచ్చే విధంగా చూడాలని వారికి ప్రతి రోజూ 307 రూపాయలు వచ్చేలా పని చేపించాలని పంచాయతీ కార్యదర్శులు మరియు ఫీల్డ్ అసిస్టెంట్ లను ఆదేశించారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్ లు పని ప్రదేశంలో మస్టర్ ప్రకారం యన్.యం.యం.యస్ యాప్ ద్వారా అటెండెన్స్ నమోదు చేస్తున్నారా లేదా అని వారంలో ఒకరోజు తప్పనిసరిగా పరిశీలించాలని ఆదేశించారు. అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు పని ప్రారంభం రోజు వెళ్లి కొలతలు చూపించి చివరి రోజు జరిగిన మొత్తం పనికి సంబంధించిన కొలతలు తీసుకుని అదే రోజు రికార్డు చేసి మండల్ కంప్యూటర్ సెంటర్ లో అప్పగించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ కన్సల్టెంట్ కొలతలు చేసిన పనకి తగ్గట్టుగా చేశారా లేదా స్క్రూటినీ చేయాలని ఏపీఓ కూడా ప్రతి రోజూ ఏదో ఒక పని ప్రదేశాన్ని తనఖీ చేయాలని సూచించారు. కంప్యూటర్ ఆపరేటర్లు రోజు అందిన యంబీలు ఆదే రోజు చెల్లింపులు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ ఇందిర, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు ఫీల్డ్ అసిస్టెంట్ లు హాజరు అయినారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన... "పాదూరి శంకర్ రెడ్డి"

తుంగతుర్తి/ శాలిగౌరారం ,ఏప్రిల్ 9 ,(వుదయం ప్రతినిధి): ఆరు లక్షల రూపాయల ఎస్డిఎఫ్ నిధులతో నూతన సిసి రోడ్డు పనులను శాలిగౌరారం మండలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి ఎన్జీ కొత్తపల్లి గ్రామంలో ప్రారంభించారు. అనంతరం శంకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో నూతన సిసి రోడ్ల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందని, పల్లె సీమలే ప్రగతికి మెట్లని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే గ్రామాలలో మౌలిక వసతులు కల్పించబడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నరిగె నరసింహ, వడ్లకొండ పరమేష్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సంకటి లింగయ్య, ఒగోటి శంకరయ్య, సంకటి కిషోర్ ,పుట్ట



యాదయ్య , చెరుకు సుధాకర్, సంకట నాగయ్య, భూపతి శ్రీకాంత్, రవీందర్ రెడ్డి, రావుల వెంకన్న, సంకట శంకర్, సంకట నరేష్, ఓగోటి యాద య్య తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం పథకం గడువు పొడిగింపు

జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తుల కొరకు గడువు ఈనెల 14వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు జిల్లాలోని వెనుకబడిన తరగతుల కులాలకు చిన్ని నా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆర్థిక పురోగతి పెంపొందించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని వెల్లడించారు అర్హత ఆసక్తి కలవారు ఆన్లైన్లో దరఖాస్తులు నమోదు చేసి దరఖాస్తు చేసిన పత్రాలను మండలాలలోని మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ, పత్రం కుల దృవీకరణ పత్రం, వ్యవసాయ సంబంధిత స్కీం వారికి మాత్రమే పట్టాదారు పాస్ పుస్తకం, వానలో స్కీం వారికి మాత్రమే డ్రైవింగ్ లైసెన్సు, వికలాంగులకు సదరం క్యాంప్ సర్టిఫికెట్ తోపాటు ఫోటో జతపరచి జరకాసులు చేసుకోవాలని తెలిపారు దరఖాస్తుదారులకు సంబంధించి గ్రామీణ ప్రాంతం అయితే సంవత్సరానికి 1,50,000 రూపాయల ఆదాయం పట్టణ ప్రాంతాలు అయితే సంవత్సరానికి 2 లక్షలకు ఆదాయానికి మించకుండా తెలిపారు 21 సంవత్సరం నుండి 55 ఏళ్ల వరకు ఉన్నవారే ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు.

# మహనీయుల జయంతి ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరించిన జాన్సన్ నాయక్



జన్నారం, ఏప్రిల్ 9(వుదయం విలేకరి) జన్నారం మండల కేంద్రంలో సాయిని ప్రసాద్ నేత (ఎస్సీటీ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షులు టీఎన్ఏంవిఎస్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 12న నిర్వహించనున్న మహనీయుల జయంతి ఉత్సవాల వాల్ పోస్టర్లను బిఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ జాన్సన్ నాయక్ ఆవిష్కరించారు. బుధవారం మధ్యాహ్నం ఖానాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జయంతి ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మహనీయుల జయంతి ఉత్సవాలను ఒకే వేదిక మీద చేస్తున్న సాయిని ప్రసాద్ నేతను అభినందించారు. ఈ కార్యక్రమంలో జన్నారం మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షులు జాడి గంగాధర్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు ఒల్లాల నర్సాగౌడ్,జంగం సంతోష్,నేతకాని కుల సంఘం రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్,ఎస్సీటీ సంస్థ సభ్యులు మంతెన వెంకటేష్,పొడేటి సతీష్,అల్లూరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లలో దేవునిగూడెం జిపికి రాష్ట్రస్థాయిలో తొమ్మిదో స్థానం



జన్నారం, ఏప్రిల్ 9(వుదయం విలేఖరి) జన్నారం మండలంలోని దేవుని గూడెం గ్రామ పంచాయతీ నిర్దేశిత పన్ను లక్ష్యాలను సాధిస్తూ రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో నిలిచిందని జన్నారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్,ఎంపీఓ జలంధర్,పంచాయతీ కార్యదర్శి సరిత తెలిపారు.బుధవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన పన్ను వసూలులో దేవునిగూడెం గ్రామపంచాయతీ 80.49 శాతం సాధించి రాష్ట్రస్థాయిలో తొమ్మిదవ స్థానంలో నిలిచిందని వెల్లడించారు.దీంతో జిల్లా అధికారులు జన్నారం మండల,పంచాయతీ అధికారులను అభినందించారు.

## నేడు బి. ఆర్. ఎస్ కార్యకర్తల సమావేశం గోడ పత్రికను విడుదల చేసిన మాజీ ఎమ్మెల్యే



నారాయణపేట టౌన్ ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) నారాయణ పేట జిల్లాలోని స్థానిక సింగారం చౌరస్తా దగ్గర జిల్లా బి.ఆర్.ఎస్.పార్టీ కార్యాలయంలో జరిగే కార్యకర్తల సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి కోరారు. నారాయణ పేట నియోజకవర్గంలో ఉన్న ప్రతి నాయకులు,కార్యకర్తలు బి.ఆర్.ఎస్.అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చెయ్యాలని ఆయన కోరారు. ఈ సమావేశాన్ని ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది అని ఆయన తెలిపారు.అనంతరం గోడ పత్రికలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అపార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పి.జె.కుటీరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం...

**ముఖ్య అతిథిగా పాల్గొన్న జగద్గిరిగుట్ట ఇన్స్పెక్టర్ కె.నరసింహ.**



కుత్బుల్లాపూర్: ఏప్రిల్ 9,(వుదయం ప్రతినిధి),వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు చల్లటి త్రాగునీరు అందించడమే లక్ష్యంగా పి.జె. కుటీరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కైలాష్ హిల్స్ కమాన్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముఖ్య అతిథిగా జగద్గిరిగుట్ట సిఐ పాల్గొని ఫౌండేషన్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఎస్.ఐ. అప్పారావు మాట్లాడుతూ యువత సమాజిక సేవా కార్యక్రమాలలో ముందు ఉండాలని ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని పి.జె. కుటీరం ఫౌండేషన్ సభ్యుల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వాసాల సాయితేజ, ముత్యపాగ శ్రీశైలం, నామా మోహన్, శ్రీకాంత్, ప్రవీణ్ రెడ్డి, దుర్గా, ధాత రంజిత్ రెడ్డి, స్థానిక విలేకరులు వాసాల బాలరాజ్, ఎల్లంపల్లి నర్సింహులు, రాగాల ఆనంద్, జెల్ల శివ, గోపిశెట్టి అనిల్, సోమిరెడ్డి, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

## మజ్జిగ పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు

మిర్యాలగూడ, ఏప్రిల్09వుదయం (ప్రతినిధి):త్రిపురారం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్లో నిర్వహిస్తున్న చలివేంద్రం వద్ద బుధవారం ఉదయం మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు, గ్రామ మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు 500 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతకాయల యాదయ్య, రాంబాబు, బైరం శ్రీను, శివ, తదితరులు పాల్గొన్నారు.

## ముదిమణిక్యం గ్రామంలో దారుణం

నల్లగొండ, ఏప్రిల్09వుదయం (ప్రతినిధి): నల్గొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం ముదిమణిక్యంలోగ్రామంలో బుధవారం దారుణం చోటుచేసుకుంది. సీఐ నాగదుర్గ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం సైదులు అనే వ్యక్తి తన భార్య నర్సాకుమారిని కత్తితో దారుణంగా నరికి చంపాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నామని, నిందితుడు పరారీలో ఉన్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే

దన్వాడ, ఏప్రిల్09వుదయం (ప్రతినిధి):దన్వాడ మండలం ఎంనోనిపల్లి గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారు మణెమ్మ ఇంట్లో సహపంక్తి భోజనం చేశారు. స్వతహాగా కూరగాయలు, అన్నం వడ్డించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సన్న బియ్యం పథకం ప్రారంభించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్న బియ్యం పంపిణీ చేస్తామని చెప్పారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ చేసిన బిఆర్ఎస్ నాయకులు



కొండపాక ఏప్రిల్09వుదయం (ప్రతినిధి): మండల పరిధిలోని రవీంద్ర నగర్ గ్రామానికి చెందిన కోడెల ఐలవ్వ కు ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయినా 81500 రూపాయల చెక్కును గ్రామ అధ్యక్షులు కోడెల మల్లేశం, మండల రైతు నాయకులు మంద ఐలయ్య లతో కలిసి బారాస మండల అధ్యక్షుడు నూనె కుమార్ యాదవ్ అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందినకోడెలఐలవ్వగతంలోఅనారోగ్యసమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంది అనే విషయాన్నీ బిఆరెస్ గ్రామశాఖ అధ్యక్షులు కోడెల మల్లేశం యాదవ్ తెలపగ వెంటనే మాజీ మంత్రివర్యులు హరీష్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఈ సీఎంఆర్ఎఫ్ చెక్ మంజూరు చేయించి అందించామన్నారు. ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్ పార్టీ నాయకులు గుర్రాల నాగయ్య, కుసుంబ శేఖర్, మార్క బుచ్చయ్య, మూడోజు శుక్లాచారి, మూడోజు సాయి తేజ, చిన్నబోయిన శేఖర్, మూడోజు విద్యాసాగర్, ఆసర్ల కరుణాకర్, చిక్కుడు బాను, గాధగోని రాకేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాయుడుపాలెంలో మా ఇంటి మణిదీపం కార్యక్రమం



సత్తుపల్లి ఏప్రిల్ 9 (వుదయం ప్రతినిధి) వేంసూరు మండల పరిధిలోని రాయుడుపాలెం లో సిడిపిఓ కనకదుర్గ ఆధ్వర్యంలో మా ఇంటి మణిదీపం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ బాబ్జి ప్రసాద్ ఎంపీడీవో రాజారాం సిడిపిఓ కనకదుర్గ మాట్లాడుతూ నేటి సమాజంలో మగ సంతానం కు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారని, సృష్టిలో ఆడ మగ సమానమని , ఆడపిల్లలు లేకపోతే సృష్టి మనుగడే ప్రశ్నార్ధకంగా మిగిలిపోతుందని పేర్కొన్నారు, ఆడపిల్లలను చక్కగా చదివిస్తే ఉద్యోగాల్లో స్థిరపడతారని, అందుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పిహెచ్సి డాక్టర్ ఇందుప్రియ డాక్టర్ ఫాతిమా ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంత రాణి అంగన్వాడి టీచర్లు నాగలక్ష్మి పద్మ రమాదేవి రాధా రాణి సత్యావతి నాగేంద్ర పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వీరాభిమానికి వినికిడి యంత్రం వితరణ



వెల్దండ ఏప్రిల్ 9 (వు దయం ప్రతినిధి) మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ వీరాభిమాని అల్లడి రంగయ్యకు కాంగ్రెస్ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ 25 వేల రూపాయలు వెచ్చించి వినికిడి యంత్రాన్ని వితరణ గావించారు గత కొంతకాలంగా వినికిడి సమస్యతో బాధపడుతున్న రంగయ్యకు వైద్య పరీక్షలు నిర్వహించి డాక్టర్ల సూచన మేరకు వినికిడి యంత్రాన్ని కొనుగోలు చేసి బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకు లు మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి తో కలిసి అందజేశారు.కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని పేర్కొన్నారు. , కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తిరుపతిరెడ్డి, కొయ్యల పుల్లయ్య, ఎండి రషీద్, కృపానందం, ఎండి అమీద్, మారేపల్లి శ్రీను, దాసరి మహేష్, గంటల రామకృష్ణ, మనముని రామకృష్ణ, జంగిలి కొండలు, మట్ట నాగార్జున, గోరేటి భరత్, రమేష్, శివరాజ్, భరత్ గౌడ్ పాల్గొన్నారు

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచాలి

### ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా విద్యాధికారి



వెల్దండ ఏప్రిల్ 9 (వు దయం ప్రతినిధి) ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచాలని జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ ఆదేశించారు బుధవారం మండలంలోని %వీజూజూం% తునికిబండ తండా మరియు పెద్దాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెద్దపూర్ లో విద్యార్థులకు జరుగుతున్న వార్షిక పరీక్ష ను పరిశీలించి విద్యార్థుల యొక్క సామర్థ్యాలను నైపుణ్యాలను పరిశీలించి పలు సూచనలను సలహాలను అందజేశారు

## ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి : ఐసిడిఎస్ సీడిపివో రేష్మ



జన్నారం, ఏప్రిల్ 9(వుదయం విలేకరి) గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని లక్షెట్టిపేట ఐసిడిఎస్ సిడిపిఓ రేష్మ సూచించారు.బుధవారం మధ్యాహ్నం జన్నారం మండలంలోని తిమ్మాపూర్ -2 అంగన్వాడీ సెంటర్ లో పోషణ పక్షం కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణీ మహిళలు వెయ్యి రోజుల సంరక్షణ, పౌష్టికాహార ప్రాముఖ్యత, ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వాణి, ఉమెన్ హబ్ జెండర్ స్పెషలిస్ట్ లిప్సిక, అంగన్వాడి టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సత్య యాదవ్ ను సన్మానించిన మిత్రమండలి సభ్యులు



నారాయణపేట టౌన్ ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) . నారాయణపేట జిల్లా బిజెపి అధ్యక్షుడు సత్య యాదవ్ పదవి బాధ్యతల స్వీకరణ చేసిన సందర్భంగా నారాయణపేట స్నేహ మిత్ర మండలి సభ్యులు భారీ శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మిత్ర మండలి సభ్యులు దేగుల్ మడి మల్లేష్,గుత్తి రమేష్ సత్య యాదవ్ కు శుభాకాంక్షలు అభినందనలు తెలిపారు.మిత్రమండలికి తన సహకారం అందిస్తానని సత్య యాదవ్ కృతజ్ఞతలు

## శ్రీ గురు లోక్ మాసంంద్ ప్రభు బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

**జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్**





నారాయణపేట టౌన్ ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి)

నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డి పల్లి లో ఈ నెల 11 నుంచి 14 వరకు జరిగే శ్రీ గురు లోక్ మాసంద్ ప్రభు ( బావోజి) బ్రహ్మోత్సవాలకు అధికారులు పగడ్బందీగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. నాలుగు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం ఆలయ అవరణలో సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులతో ఉత్సవాల ఏర్పాట్ల గురించి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఎస్పీ యోగేష్ గౌతమ్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, నిర్వహణ కు స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గ్యాంగ్వర్ ను నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని తెలిపారు. నోడల్ అధికారి పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు జాతర ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా వి.ఐ.పి మేనేజ్ మెంట్ జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. దేవాదాయ శాఖ పరంగా ఏం ఏర్పాట్లు చేశారని అడిగారు. ఆలయానికి, రథానికి కలర్స్ వేయిస్తున్నామని, మిగతా జాతర ఏర్పాట్లు చేస్తున్నామని ఈ.వో తెలిపారు. జాతర కోసం తమ శాఖ నుంచి మొత్తం 15 మంది ఉద్యోగులు సిబ్బందిని డిప్యూట్ చేయగా ప్రస్తుతానికి ఇద్దరు వచ్చి విధుల్లో చేరారని, మిగతా 13 మంది రెండు రోజుల్లో వస్తారని ఈ.వో తెలిపారు. గతేడాది మాదిరిగానే ఈ సారి ఆలయంలో 8 సీసీ కెమెరాలు అమర్చుతామని ఈ. వో తెలపగా, పోలీసు శాఖ కోరినట్లు మొత్తం 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ పరంగా బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు నీటి వసతి కల్పించామని, అలాగే 8 బ్లాకుల్లో రెండింటి లో స్లాబ్ వేయించామని, టైల్స్, ఆన్ ఆఫ్ ట్యాప్ క్లిప్పు లను ఫిట్ చేయాల్సి ఉందని మిషన్ భగీరథ ఈఈ రంగారావు తెలిపారు. రెండు పవర్ బోర్లకు మోటార్లు బిగించాల్సి ఉందన్నారు. శానిటేషన్ పరంగా దాదాపు 300 మంది కార్మికులతో పారిశుద్ధ్య సేవలు చేస్తామని, మూడు సిఫ్టులలో వంద మంది చొప్పున కార్మికుల సేవలు అందుబాటులో ఉంటాయని డీఎల్ పీ వో సుధాకర్ రెడ్డి తెలిపారు. జాతర నాలుగు రోజులు తిమ్మారెడ్డి పల్లి లో సెల్ ఫోన్ లు కలవవు అని, తమకు వాకీ టాకీ లు ఇవ్వాలని డీ ఎల్ పి వో సుధాకర్ జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ను కోరారు. జాతరలో ఒక డాక్టర్, సూపర్ వైజర్ , ఏ ఎన్ ఎం, ఆశాలతో మూడు సిఫ్టులలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని ఇంచార్జీ డీ ఎం అండ్ హెచ్ ఓ శైలజ తెలిపారు. జాతరలో బారీ కేడ్లు ఏర్పాటు చేస్తామని పి అర్ అధికారి విలోక్ చెప్పారు. అగ్నిమాపక శాఖ పరంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఫైర్ అధికారి చెప్పారు. జాతరకు వచ్చే భక్తుల కోసం కోస్గి డిపో నుంచి 8 బస్సులు నడిపిస్తామని, మహబూబ్ నగర్ డిపో నుంచి అదనంగా మరికొన్ని బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డి ఎం లావణ్య తెలిపారు. జాతరలో భక్తుల కోసం దుస్తులు మార్చుకునే షెడ్లను ఏర్పాటు చేయడంతో మొబైల్ టాయిలెట్ ను అందుబాటులో ఉంచుతామన్నారు. విద్యుత్ శాఖ పరంగా అవసరమైన విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు, విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగనట్లు మొబైల్ ట్రాన్స్ ఫార్మర్ ను ఉంచుతామని విద్యుత్తు శాఖ అధికారి తెలిపారు. ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా జాతరలో దొంగతనాలు, ఈవ్ టీజింగ్ జరగకుండా మఫ్టీ పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రామచందర్ నాయక్, డిఎస్పి నల్లపు లింగయ్య, సీ ఐ సైదులు, తహాసిల్దార్ జయరాములు, ఎంపీడీఓ కృష్ణా రావు, సంబంధిత శాఖల అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ఎంసి లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ పాదయాత్ర...




కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 9,(వుదయం ప్రతినిధి),రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 18వ,19 వ డివిజన్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆదేశాల మేరకు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, 18వ డివిజన్ మాజీ కార్పొరేటర్ వీరేందర్ రెడ్డి, ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వార మాట్లాడుతూ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం జాతీయ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గొప్ప కార్యక్రమం అని, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంటింటికి ప్రజల వద్దకు వెళ్లి స్వాతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు స్వాతంత్రం వచ్చిన తరువాత దేశంలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని, అదేవిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రజలకు అందించిన అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా, దేశంలో బిజెపి ప్రభుత్వం ఏ విధంగా రాజ్యాంగాన్ని అవమానిస్తూ కించపరుస్తూ వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేస్తూ అప్రజస్వామిక నిర్ణయాలు తీసుకుంటున్న బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, మేడ్చల్ మల్కాజిగిరి సెక్రటరీ కొలన్ బాల్ రెడ్డి, కమ్మెట నారాయణ, 19వ డివిజన్ అధ్యక్షులు డీలర్ శంకర్, 18వడివిజన్ అధ్యక్షులు కె రాజేందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొలన్ జీవన్ రెడ్డి, కె. అశోక్, శెట్టి జీతయ్య, కోలన్ ప్రశాంత్ రెడ్డి, యువనాయకులు జిత్తు, టిల్లు, ఏలూరి సత్య (నాని), లింగాల గంగాధర్, వాసు వరగాని, సందీప్, రాము, టీ జెంతేందర్, జితేందర్, ప్రశాంత్, మల్లేష్, తరుణ్, తిరుపతి రెడ్డి, జగన్ యాదవ్, రాజి రెడ్డి, రాజేందర్, జిత్తు, శ్రీశైలం యాదవ్, ప్రవీణ్ రెడ్డి, హరియా నాయక్, రాంచందర్ నాయక్, సురేష్ రెడ్డి, సత్తిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, వీర బాబు, సాయి, ప్రేమ్, కోటేశ్వరి, సాయి రాజ్, నవ్య, మౌళీశ్వర్, పితాని శ్రీనివాస్, మురళి, ప్రశాంత్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీదేవి, యశోద, లక్ష్మి, గిరిజ కుమారి, సునీత, కరుణ,నాగిన, రమణి, సరిత రెడ్డి, ధనలక్ష్మి, రమ, మొహమ్మద్, రఘు, హరి బాబు, నర్సింగ్ రావు, శ్రీనివాస్ గౌడ్, గోలి శ్రీను, రమేష్, దినేష్, క్రాంతి, మల్లికార్జున్, లోకనాథం, ఏ.శ్రీనివాస్, విజయ లక్ష్మి, తులసి దాస్, మధు, రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సహాయ నిధి పేదలకు వరం

దేవరకొండ, ఏప్రిల్09వుదయం (ప్రతినిధి): సీఎం సహాయనిధి పేదలకు వరమని ఆపద సమయంలో సీఎం సహాయనిధిని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బాలు నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను వారు బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిరాజ్ ఖాన్, వేణుధర్ రెడ్డి, అలంపల్లి, దేవేందర్ నాయక్, పున్న, మాధవరెడ్డి, సంజీవరెడ్డి, నాగభూషణం, సురేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏ ఎన్నికైన గెలుపే లక్ష్యంగా సైనికుల పనిచేయాలి

**పాలమూరు ఎంపీ డీకే అరుణ**

నారాయణపేట టౌన్ ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) . రాష్ట్రంలో ప్రభుత్వం పాలకులు మారారు కానీ పాలన మారలేదని ఈ రాష్ట్ర ప్రభుత్వ వైఫొల్యాలను ఎండగట్టి ఏ ఎన్నిక అయినా బిజెపి గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పాలమూరు ఎంపి.డికె.అరుణ,బిజెపి రాష్ట్ర సీనియర్ నేత, నాగు రావు నామాజీ పిలుపు నిచ్చారు.బుధవారం నారాయణపేటలో జిల్లా బిజెపి నూతన అధ్యక్షుడు సత్య యాదవ్ పదవి బాధ్యతల స్వీకరణ ఉత్సవం అట్టహాసంగా జరిగింది.సత్య యాదవ్ ను కార్యకర్తలు అభిమానులు గజమాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపి డికె.అరుణ,నాగురావు నామాజీ దిశా నిర్దేశం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీ ల గారడీతో 6 అబద్ధాలు 66 మోసాలతో అధికారంలోకి వచ్చిందన్నారు.రైతు రుణ మాఫి పూర్తి కాలేదు,ఏడాది అయినా రైతు బరోసా పూర్తిగా లేదని,మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేశారని అన్నారు.అలాగే గృహజ్యోతితో మహిళలను మోసం చేశారని,వృద్ధులకు చేయూతఅందించలేదని,యువత వికాసం మరిచారని సొంతిల్లు కలగానే మిగిలి పోయిందనివిమర్శించారు.అన్ని వర్గాల ప్రజలు రోడ్డున పడ్డారనీ అన్నారు.బి ఆర్ ఎస్,కాంగ్రెస్ దోచుకోవడం లో రెండు పార్టీలు ఒక్కటేనని, అంతే కాకుండా పదేళ్లు బి ఆర్ ఎస్ కే.ట్యాక్స్ ఇప్పుడు కాంగ్రెస్ ఆర్ ఆర్ ట్యాక్స్ చెల్లిస్తున్నదనివిమర్శించారు.అలాగే ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారని ప్రజలు వీరి పాలనలో భూమి, ఇళ్లు కోల్పోయారని.రాష్ట్రాన్ని అప్పుల కుప్పలు చేశారని ఆడబిడ్డలు ఆక్రందనలు చెందుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అలాగే కేంద్ర ప్రభుత్వం సబ్ కా వికాస్,సబ్ కా విశ్వాస్ నినాదంతో చేపట్టిన సంక్షేమ పథకాలను,వక్ఫ్ బోర్డు రద్దీతో ముస్లింలకు ఏమి నష్టం లేదన్న విషయాన్ని ప్రజలకు వివరించాలని బిజెపి గెలుపుకు పట్టుదలతో కృషి చేయాలని అన్నారు. సంస్థగతంగా పార్టీని మరింత పటిష్టం చేయాలని కోరారు.బిజెపి మాజీ జిల్లా అధ్యక్షుడు పగుడాకుల శ్రీనివాసులు మాట్లాడుతు తనకు గత 5 ఏళ్లుగా నాయకులు,కార్యకర్తలు ఎంతో సహకారం అందించారని అందరి సహకారంతో జిల్లాలో పార్టీని బలోపేతం చేశానని అసెంబ్లీ ,పార్లమెంట్ ఎన్నికల్లో గణనీయమైన ఓట్లు సాధించామని అన్నారు.తనకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ నూతన అధ్యక్షుడు సత్య యాదవ్ కు పూర్తి సహకారం అందించి పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.బిజెపి రాష్ట్ర నాయుకులు కే.రతంగ్ పాండు రెడ్డి,బి.కొండయ్య మాట్లాడుతు అందరి సహకారంతో పార్టీని పటిష్టం చేయాలని దిశానిర్దేశం చేశారు.







నమ్మకాన్ని వమ్ము చేయను
నూతన అధ్యక్షుడు సత్య యాదవ్......

తనపై నమ్మకం ఉంచి పార్టీ అధిష్టానం బిజెపి జిల్లా అధ్యక్షుడు చేసిన పార్టీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని జిల్లాలో పటిష్టం చేస్తానని పదవి బాధ్యతలు చేపట్టిన బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ అన్నారు.ఎల్లవేళలా కార్యకర్తలకు అందుబాటులో ఉండి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.కార్యకర్తల కష్టాన్ని తన కష్టంగా భావిస్తానని అన్నారు.పార్టీ పెద్దలు,కార్యకర్తల సలహాలు పాటించి రానున్న ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతామని అన్నారు.తమకు ఇప్పుడు ఎంపి రూపంలో పవర్ ఉందని తమ చిరకాల స్వప్నం అయిన బిజెపి ఎమ్మెల్యేలను జిల్లాలో చూడాలని ఉందని ఆకల సాకారం చేసుకుంటామని అన్నారు.అనంతరం సత్య యాదవ్ ను కార్యకర్తలు అభిమానులు భారీ ఎత్తున సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా,మండల పదాది కారులు,మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# డ్రోన్లు వైద్య సేవల పరికరాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడతాయి

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





జయశంకర్ భూపాలపల్లి ఏప్రిల్ 09(వు దయం ప్రతినిధి) మారుమూల ప్రాంతాల్లో అంగన్ వాడి సిబ్బంది సేవలకు, రైతులకు ఉపయోగపడే డ్రోన్లు, వైద్య సేవల పరికరాలు జిల్లా ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడతాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో ఈసీఐఎల్ కంపెనీ సిఎస్ఆర్ నిధులు నుండి 20 ఎలక్ట్రానిక్ స్కూటీలు, 12 డ్రోన్ల పంపిణీ చేశారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్ వాడి సూపర్ వైజర్లు మారుమూల గ్రామాల్లో.సేవలు అందించడానికి, వ్యవసాయంలో డ్రోన్లు వినియోగం, వైద్య సేవలు సిటీ స్కాన్, ఇతర పరికరాలు ఈసిఐఎల్ సి ఎస్ ఆర్ నిధులు ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.మారుమూలు ప్రాంతాలకు అంగన్వాడి సూపర్ వైజర్లు వెళ్ళడానికి రవాణా సౌకర్యాలు లేవని ఎలక్ట్రానిక్ స్కూటీలు కుగ్రామానికి సైతం సులువుగా వెళ్ళడానికి ఉపయోగ పడతాయని తెలిపారు. ఈ రోజుల్లో వ్యవసాయ పనులకు కూలీలు కొరత ఉందని, ఈ ఆధునిక సాంకేతికత డ్రోన్లు వినియోగం రైతులకు చాలా ఉపయోగమని అన్నారు. రసాయన మందులు పిచికారీ సమయంలో ప్రజలు ప్రాణాలకు అపాయం ఏర్పడుతుందని, డ్రోన్లు వినియోగం ద్వారా ప్రాణాలకు ఎలాంటి అపాయం ఏర్పడదని, సమయం కూడా ఆదా అవుతుందని తెలిపారు. అలాగే జిల్లా ప్రధాన ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలకు సిటీ స్కాన్ ఇతర పరికరాలు ఇవ్వనున్నారని తెలిపారు. రానున్న నెల రోజుల్లో వైద్య పరికరాలు ఏర్పాటు జరుగుతుందిని తెలిపారు.ఈసిఐఎల్ సి అండ్ ఎండి అనురాగ్ కుమార్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ స్కూటీ లు, డ్రోన్లు, వైద్య పరికరాలు మొత్తం 4 కోట్ల సి ఎస్ ఆర్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. స్కూటీలు, డ్రోన్లు వినియోగం వల్ల అంగన్వాడీ సేవలకు, రైతులకు ఉపయోగకరమని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సీపీఓ బాబు రావు, సంక్షేమ అధికారి మల్లీశ్వరి, వ్యవసాయ అధికారి వీరు నాయక్, ఆసుపత్రి పర్య వేక్షకులు డా నవీన్ కుమార్, ఈసిఐఎల్ హెచ్ ఆర్ ఈడీ మురళీధర్, సీఎంఓ వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ధనిక పేద అనే తేడా లేకుండా అందరికి

**సన్నబియ్యం చేరాయి**
**కొమ్ము విజయకుమార్**



కొండపాక ఏప్రిల్09వుదయం ప్రతినిధి): ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండే ఆహారం పేదలకు కూడా చెందాలనే దృఢ సంకల్పంతో ప్రవేశ పెట్టిన సన్నబియ్యం పంపిణీ పథకం నేడు పూరి గుడిసెల వరకు చేరాయి అన్నారు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము విజయకుమార్. బుధవారం అంకిరెడ్డిపల్లి గ్రామంలోని పేదకుటుంబానికి చెందిన తలారి రాములు ఇంట్లో విజయ్ కుమార్ తో పాటు యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనీల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేశం, గ్రామ ఉపసర్పంచ్ నర్సింగారావులు ప్రభుత్వం పంపిణి చేసిన సన్న బియ్యం తో భోజనం చేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కడుపు నింపాలనే మంచి ఆలోచన తోనే సన్న బియ్యం పంపిణి చేసే గొప్ప కార్యక్రమం చేపట్టింది మన రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్నారు. ఇది పేద ప్రజలందరికీ వరంలా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో దండుగుల లక్ష్మణ్, చెంద్రం, గౌడలక్ష్మి,దండుగుల రాజు,నక్క రమేష్,నర్సింలు,మహిపాల్,తిమ్మ రెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు బ్రహ్మం, సీనియర్ నాయకులు నాగరాజు, వార్డ్ మెంబర్ యువజన కాంగ్రెస్ గజ్వేల్ నియోజక వర్గ ఉపాధ్యక్షులు నందకుమార్, ఎన్ఎస్ యూఐ జిల్లాకార్యదర్శి కొమ్ము భాను చందు, యువజన కాంగ్రెస్ మార్కుక్ మండల ఉపాధ్యక్షలు ప్రభు, సీనియర్ నాయకులు మహబూబ్, జప్తి నాచారం ఇందిరమ్మ కమిటీ మెంబర్ కిషన్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేస్తుంది

నిజాంసాగర్, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి): రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజలు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని పిట్లం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్ వెల్లడించారు. బుధవారం ఉమ్మడి నిజాంసాగర్, మహమ్మద్ నగర్ మండలాల పరిధిలోని సుల్తాన్ నగర్, హసన్ పల్లి, గిర్ని తాండ గ్రామాలలో ఇందిరా క్రాంతి పదం ఆధ్వర్యంలో వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు తమ ధాన్యం దళారులను నమ్మి వారికి విక్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోని విక్రయించుకొని లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ మహమ్మద్ నగర్ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలే.మల్లికార్జున్, రవీందర్ రెడ్డి రైతులు గ్రామ పెద్దలు సొసైటీ సిబ్బంది ఐకెపి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మృతురాలు భౌతిక కాయానికి పూలమాల వేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



వరంగల్ /రాయపర్తి ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) : మండలం గట్టికల్ గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిన్నల రఘు తల్లి చిన్నల రాధమ్మ అనారోగ్యం తో మరణించగా వారి భౌతిక కాయానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పూలమాల వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మునావత్ నరసింహ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల నాయకులు ఎలమంచి శ్రీనివాసరెడ్డి, మండల యూత్ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్ల స్వామి, మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# టియూడబ్ల్యూ జె జిల్లా అధ్యక్షులుగా శ్రీరామ్ రామ్ చందర్



వరంగల్ /వర్ధన్నపేట, ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) : వర్ధన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన శ్రీరామ్ రామ్ చంధర్ శనివారం వరంగల్ జిల్లా కేంద్రంలోని జర్నలిస్ట్ పరపతి సంఘం కమ్యూనిటీ హాల్ లో రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ, ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ నారాయణ,ముఖ్య అతిదులుగా పాల్గొని జిల్లా అధ్యక్ష,ఉపాధ్యక్ష,వివిధ పదవుల నియామాకాలకై ప్రతి రెండు సంవత్సరాలకి నిర్ణయించినట్లు ఈ సంవత్సరం 2025కి ఎన్నిక ప్రక్రియ జరిపించగా ఇందులో అధ్యక్ష పదవికి రెండు నామినేషన్ లు రాగా, ఉపాధ్యక్ష పదవి కి రెండు పోస్ట్ లు ఉండగా, రెండు నామినేషన్ లు, వచ్చాయని, ట్రెజరరీ కి ఒకరు నామినేషన్ వేషారాని, కార్యదర్శి పోస్ట్ కి ఆరుగురు నామినేషన్ వేషారని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ,ఇందులో సృటీని లో ట్రెజరరీ పోస్ట్ కి ఒక్కరు మాత్రమే నామినేషన్ వేయగా వారిని ఏకగ్రీవం ఎన్నిక చేసినట్లు,తెలిపారు.సహాయ కార్యదర్శి పోస్ట్ కి పోటీకి నలుగురు పోటీలో నిలువగా ఇందులో నలుగురు సృటీని లో పోయారని, మిగిలినకార్యదర్శి పోస్ట్ కి ఇద్దరు పోటీలో నిలువగా ఓటింగ్ ప్రక్రియ నిర్వహించగా ఒకరు గెలుపొందారని,ఉపాధ్యక్ష పదవి రెండు ఉండగా, ఇద్దరు మాత్రమే పోటీలో ఉన్నవారిని ఉపాధ్యక్షులుగా, ప్రకటించినట్లుశ్రీరామ్ రామ్ చందర్ ని, టి యూ డబ్ల్యూ జె వరంగల్ జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీవంగా గెలుపొందగా వారినే ప్రకటించడం జరిగిందని,తెలిపారు.ఈసందర్భంగా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో (ఐ జె యూ)అనుబంధ సంఘం టి యూ డబ్ల్యూ జె సంఘ సభ్యులు అంబేద్కర్ సెంటర్ వద్ద బానసంచా పేల్చి స్వీట్స్ పంపిణి చేసి సంబురాలు జరుపున్నారు.

# చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణ...

**ఈ నెల 11 4 2025 నుండి 13 4 2025 వరకు కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు..**
**జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్**




జగిత్యాల ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి) ఈ నెల 11వ తేదీ నుండి 13 వ తేదీ వరకు కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి చిన్న హనుమాన్ జయంతి ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అన్నారు బుధవారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించే కార్యక్రమాలు ఏర్పాట్లపై జిల్లా సూపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు జయంతి కార్యక్రమాలు జరుగనున్న నేపథ్యంలో 10వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని క్రింది స్థాయి ఉద్యోగులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు 3 రోజుల పాటు లైటింగ్ హోర్డింగ్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు ఈ నెల 11వ తేదీ రాత్రి నుండి 13 వ తేదీ ఉదయం వరకు సుమారు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని సుమారు 45 వేల మంది మాల విరమణ చేస్తారని తెలిపారు ఈ 3 రోజుల పాటు 14 కౌంటర్లను ఏర్పాటు చేసి సుమారు 5 లక్షల ప్రసాదలను అందుబాటులో ఉంచడం జరుగుతుందని తెలిపారు ఆలయ ప్రాంగణంలో 64 సి సి కెమెరాలు ఉండగా అదనంగా 50 సి సి కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని 6 మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉండే విధంగా చూడాలని సూచించారు అలాగే 3 రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు ఇందు కోసం ఒక వేదికను ఏర్పాటు చేసి 100 మంది కూర్చునే విధంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు అలాగే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు కొండపైకి వెళ్లేందుకు ఆర్టిసి బస్సులను పెంచాలని అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని ఆదేశించారు చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని కోనేరు వద్ద భక్తులు అధిక సంఖ్యలో స్నానం ఆచరించే వీలు ఉన్నందున ఎప్పటికప్పుడు నీటిని శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులను భక్తులకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని మిషన్ భగీరథ అధికారులను 24 గంటలు నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చూడాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు కేశఖండనకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా కళ్యాణ కట్ట వద్ద ఎక్కువ మంది నాయీబ్రాహ్మణులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు పబ్లిక్ టాయిలెట్స్ ను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుటకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జయంతి ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేయుటకు షిఫ్ట్ ల వారీగా అధికారులు సిబ్బంది సమన్వయం చేసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్ డిఎస్పీ రఘు చందన్ కొండగట్టు ఆలయ ఈ.ఓ శ్రీనివాస్ రావు జిల్లా పంచాయతీ అధికారి మదన్ మోహన్ కలెక్టరేట్ ఏఓ హాకీం వివిధ శాఖల అధికారులు మున్సిపల్ కమిషనర్ స్పందన ఎంపీడీఓలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# జీతాలు ఇప్పించాలని యం పి డి వో కి వినతి...



కోదాడ రూరల్ ఏప్రిల్ 9(వుదయం) పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న మూడు నెలల జీతాలు ఇప్పించాలని కోదాడ మండల ఫీల్డ్ అసిస్టెంట్ లు ఎంపీడీవో రామచంద్రరావు కు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రాంబాబు మాట్లాడుతూ జనవరి నెల నుండి ఇప్పటివరకు వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. ఇంటి ఖర్చులు, పిల్లల స్కూల్ ఫీజులు, బ్యాంక్ బకాయిలు, పొదుపు సంఘాల చెల్లింపులు కట్టలేక పోతున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో పనుల వద్దకు వెళ్లేందుకు పెట్రోల్ ఖర్చులకు కూడా డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నామని జీతాలపైన ఆధార పడి జీవిస్తున్న మా పై దయ ఉంచి 3 నెలల జీతాలు ఇప్పించాలి అని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రుప్లా, కోశాధికారి సిద్దయ్య, సతీష్, భిక్షం, ప్రమీల, శంకర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం యొక్క అభివృద్ధి ఫలాలు అందరికీ అందజేయాలి

**-రాజ్యంగం పరిరక్షణ అందరి భాద్యత**
**-చెన్నూర్ ఎంమ్మెల్యే వివేక్ వెంకటస్వామి**



రామకృష్ణాపూర్/ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) క్యాతన్ పల్లి మున్సిపాలిటీ అమరవాది ఐదవ వార్డు లో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం లో చెన్నూరు ఎంఎల్ఏ వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ మహాత్మా గాంధీ 1924 లో ఎఐసిసి కాంగ్రెస్ కు అధ్యక్షత వహించిన బెల్గాం సమావేశానికి నేటికీ 100 సంవత్సరాల పూర్తి అయిన సందర్భంగా, డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం విలువలను ప్రతి ఒక్కరికి, ప్రజలందరికీ తెలియజేయడానికి కాంగ్రెస్ పార్టీ అధిస్థానం జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ప్రతి ఒక్కరూ బాపు అడుగుజాడల్లో నడుస్తూ రాజ్యాంగ ఔనత్యాన్ని,ఆవశ్యకతను తెలుసుకోవాలని రాజ్యాంగం యొక్క అభివృద్ధి ఫలాలను బడుగు బలహీన వర్గాలకు అందజేయడానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పల్లె రాజు,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఒడ్నాల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ జంగం కళ,సీనియర్ నాయకులు గాండ్ల సమ్మయ్య,అబ్దుల్ అజీజ్,మహంకాళి శ్రీనివాస్,పలిగిరి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# అంజన్న స్వాముల పాదయాత్ర



రామకృష్ణాపూర్/ఏప్రిల్ 09(వుదయం ప్రతినిధి) క్యాతంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు క్యాతన్ పల్లి, కుర్మపల్లి గ్రామాల నుండి హనుమాన్ దీక్ష స్వాములు కొండగట్టుకి పాదయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ యొక్క పాదయాత్రని కన్నె స్వామి వేనంక శ్రీనివాస్ ప్రారంభించాడు. ఈ కార్యక్రమంలో దొడ్డి రాయమల్లు, ఎనుగుల ప్రశాంత్, కడారి సాయికుమార్,ఏనుగుల మహేష్, మిడిదొడ్డి శ్రీనివాస్, బండ శ్రీనివాస్ వంశీ కిరణ్, హరీష్, భార్గవ్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**సూపర్‌వైజర్ మమత**



లక్షెట్టిపేట, ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. బుధవారం లక్షెట్టిపేట, గుల్లకోట, ఉత్కూర్ అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ పక్షంలో భాగంగా పోషన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ...అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని మహిళలు తీసుకోవాలన్నారు. గర్భిణీలు తమ ఆరోగ్యంపై దృష్టిసారించి హిమోగ్లోబిన్ శాతం మెరుగుపరుచుకోవాలని సూచించారు. పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు పట్టించాలని తెలిపారు.గర్భిణీలు, బాలింతలు ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలని తద్వారా పోషకాహారం లభించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు జ్యోతి, లత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

# కుల సంక్షేమ సంఘ భవన ప్రారంభం...

## - కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు



కోరుట్ల ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి): కోరుట్ల పట్టణంలో దక్కలి కుల సంక్షేమ సంఘ భవన ప్రారంభం బుధవారం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు విచ్చేసి రిబ్బన్ కట్ చేసి సంఘ భవన ప్రారంభోత్సవ చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అంటేనే పేద ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడే ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒకటొకటిగా నెరవేరుస్తూ వస్తున్నామన్నారు అంతే కాకుండా ప్రతి కుల సంఘ భవనానికి నిధులు మంజూరు చేస్తూ అసంపూర్తిగా ఉన్న భవనాలను నిధుల మంజూరు ద్వారా పూర్తి చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు తోపాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నం అనిల్ ఎంబెరి నాగభూషణం ఆడెపు మధు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు దక్కలి కుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కట్టడాలు కూల్చివేత...



కోరుట్ల ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి) భీమారం మండల కేంద్రంలో గల సర్వే నెంబర్ 1308 లో గల ప్రభుత్వ భూమిని ఆక్రమించి కొంత మంది సంఘాల పేరుతో ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేయడంతో భీమారం మండల కేంద్రంలోని పలు కుల సంఘాల నాయకులు ప్రజలందరూ కలిసి సోమవారం స్థానికంగా ఉన్న ఎమ్మార్వో కార్యాలయం ఎదుట శాంతియుతంగా ధర్నా చేపట్టి ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అక్రమ నిర్మాణాలు లేకుండా చూడాలని నిర్మించిన వాటిని తొలగించాలని డిమాండ్ చేస్తూ తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు బుధవారం ఉదయం తహసిల్దార్ రవి కిరణ్ ఆధ్వర్యంలో పోలీస్ రెవిన్యూ సిబ్బంది జెసిబి తో పలు ప్రాంతాల్లో నిర్మించిన భవనాల రేకుల షెడ్లను తొలగించారు ఎవరైనా మునుముందు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా న్యాయపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రవి కిరణ్ మేడిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ శ్యామ్ రాజ్ ఆర్ఐ రాజారామ్ కిరణ్ కుమార్ రెవెన్యూ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సిబ్బందికి శిక్షణా తరగతులు...

## - లైన్ క్లియరెన్స్ యాప్ పై అవగాహన సదస్సు...



మేట్ పల్లి ఏప్రిల్ 09 (వుదయం విలేఖరి): క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తిస్తున్న విద్యుత్ సిబ్బంది విద్యుత్ ప్రమాదాల పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని లైన్ లలో పని చేస్తున్నపుడు అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకొని తమ ప్రాణాలను రక్షించుకోవాలని శిక్షణా తరగతుల సందర్భంగా మెట్ పల్లి డీఈ గంగారాం పేర్కొన్నారు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి నూతనంగా ఆవిష్కరించిన ఎల్ సీ యాప్ ( లైన్ క్లియరెన్స్- అప్లికేషన్) పై డివిజన్ స్థాయి అవగాహన సదస్సు మెట్ పల్లి లో నిర్వహించి సిబ్బందికి ఎల్సీడీ ప్రొజెక్టర్ ద్వారా శిక్షణ నిచ్చారు గతంలో ఒక ఫీడర్ పై పని చేయాలంటే సంబంధిత సబ్స్టేషన్ ఆపరేటర్ ను ఫోన్ లో సంప్రదించి క్షేత్ర స్థాయి సిబ్బంది లైన్ క్లియరెన్స్ తీసుకునేవారు కొన్ని సందర్భాల్లో ఒక ఫీడర్ కు బదులు మరో ఫీడర్ బందు చేయడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరిగి సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు వీటన్నింటిని అధిగమించడానికి ఎల్సీ యాప్ ద్వారా సంబంధిత సిబ్బంది రిక్వెస్ట్ పెడితే ఆ ఫీడర్ పై చేయబోయే పని ఏమిటి ఎంత సమయం బందు చేయాలి ఆ ప్రదేశం ఫోటో అప్ లోడ్ చేస్తే ఆ ఫీడర్ మొదలయ్యే సబ్స్టేషన్ ఆపరేటర్ బ్రేకర్ ట్రిప్ చేసి ఐసోలేటర్ తెరిచిన ఫోటో అప్ లోడ్ చేస్తే పనికి ఉపక్రమించాలి ఆ ఫీడర్ కింద మరేదైనా ఫీడర్ అడ్డంగా వెళ్తే ఆ రెండవ ఫీడర్ ను కూడా బందు చేస్తారు ఆ ఫీడర్ పోయే మార్గంలో లైన్ ల మధ్య సరియైన నిడివి లేని దుర్బలమైన స్థానాలు కూడా పరిగణలోకి తీసుకుంటారు. %శ్రీ% ముఖ్యంగా ఈ పని ఆ సెక్షన్ లో పని చేసే సిబ్బంది అందరూ భాగస్వాములై జట్టు స్ఫూర్తితో బాధ్యతగా పని చేస్తారు లైన్ క్లియరెన్స్ గంట కంటే ఎక్కువ సమయం కోరితే ఏఈ అనుమతి తీసుకోవాలి ఈ యాప్ సమర్థ నిర్వహణకు అన్ని సబ్స్టేషన్ లకు ఆండ్రాయిడ్ ఫోన్ లు సరఫరా చేస్తామని డీఈ గంగారాం తెలిపారు ఇలా ప్రతీ విపత్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే లైన్ బందు చేయబడుతుంది చీటికి మాటికి ఎవరు పడితే వారు ఫీడర్ లు బందు చేయరాదు తద్వారా విద్యుత్ అంతరాయాలు తగ్గుతాయి ఇక నుండి ఏ ఒక్కరి ప్రాణం పోకూడదని అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్న తర్వాతనే లైన్ ల నిర్వహణ పనులు చేయాలని ప్రమాదాలను సున్నా స్థాయికి తీసుకు రావడమే విద్యుత్ సంస్థ లక్ష్యమని డీఈ గంగారాం అన్నారు ఈ కార్యక్రమంలో ఏడీఈ లు మనోహర్ హరీష్ అంజన్ రావు రఘుపతి ఏఈ లు సబ్ ఇంజనీర్లు క్షేత్ర స్థాయి సిబ్బంది సుమారు 200 మంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉన్నత విద్య క్యాంపస్ ప్లేస్మెంట్స్ గురించి వ్యక్తిత్వ వికాస నిపుణులచే తరగతులు నిర్వహణ...



మెట్ పల్లి ఏప్రిల్ 09 (వుదయం విలేఖరి): జ్ఞానోదయ డిగ్రీ కళాశాల మెట్పల్లిలో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు పుప్పాల నవీన్ కుమార్ చే క్యాంపస్ ప్లేస్మెంట్స్ విద్యార్థులకు భవిష్యత్తు కార్యాచరణ ఉన్నత విద్య అనే అంశాలపై మోటివేషన్ క్లాసెస్ నిర్వహించారు మోటివేషన్ లో భాగంగా క్యాంపస్ ప్లేస్మెంట్ కావాల్సినటువంటి స్కిల్ డెవలప్మెంట్ అంశాలు ఉన్నత చదువులకు ఏ విధంగా ప్రిపేర్ కావాలి? ఆత్మవిశ్వానం స్వీయ ప్రేరణను పెంపొందించుకొనే పద్ధతులను మొదలగు అంశాలను విద్యార్థులకు తెలియజేశారు ఇందులో భాగంగా పుప్పాల నవీన్ కుమార్ రాసిన ఓడిపోవడం అంటే ఆగిపోవడం కాదు పుస్తకాన్ని కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ కు అందజేశారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంతోష్ వైస్ ప్రిన్సిపాల్ రాజు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లన్న విగ్రహ ప్రతిష్ఠాపన ఆహ్వానం...



మేట్ పల్లి ఏప్రిల్ 09 (వుదయం విలేఖరి) మేడిపల్లి యాదవ కులస్తులు నూతనంగా నిర్మాణం చేపడుతున్న మల్లన్న దేవాలయంలో వచ్చే నెల మొదటి వారంలో పలు విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా టీపీసీసీ నాయకులు వెంకట్రావు పేట మాజీ సర్పంచ్ హైకోర్టు న్యాయవాది కొమిరెడ్డి లింగా రెడ్డిని ఆహ్వానించారు ఈ కార్యక్రమంలో మేడిపల్లి మల్లన్న దేవాలయ కమిటీ అధ్యక్షులు పంచాయతీ జలంధర్ మాజీ ఎంపీటీసీ గుండెల నగేష్ గుండెల జెలేందర్ పంచాయతీ స్వామి బైరి ప్రణయ్ హేమంత్ శ్రీకాంత్ విజయ్ యాదవ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సురభి నవీన్ కుమార్



కోరుట్ల ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి): కోరుట్ల మండలం చిన్న మెట్పల్లి గ్రామ బజరంగ్దళ్ మాజీ సుదవేణి గణేష్ సోదరి సుదవేణి గౌతమీ వివాహం రంజిత్ తో కోరుట్ల మండల వెంకటాపూర్ గ్రామంలో గల వెంకటేశ్వర కళ్యాణ మండలంలో బుధవారం జరుగగా ఇట్టి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ తో పాటు భారతీయ జనతా పార్టీ భారతీయ జనతా యువ మోర్చా వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పలు వివాహ వేడుకల్లో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన జువ్వాడి నర్సింగరావు







కోరుట్ల ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి): కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో కోరుట్ల మండలంలోని సంఘం గ్రామంలోని లక్కీ ఫంక్షన్ హాల్ లో జరిగిన నూతన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు అనంతరం మెట్పల్లి మండలంలోని ఎస్ వి ఎస్ ఫంక్షన్ హాల్లో జరిగిన నూతన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఈ కార్యక్రమంలో జువ్వాడి నర్సింగరావు తో పాటు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన సురభి నవీన్ కుమార్



కోరుట్ల ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి): కోరుట్ల మండలం చిన్న మెట్పల్లి గ్రామ బజరంగ్దళ్ మాజీ సుదవేణి గణేష్ సోదరి సుదవేణి గౌతమీ వివాహం రంజిత్ తో కోరుట్ల మండల వెంకటాపూర్ గ్రామంలో గల వెంకటేశ్వర కళ్యాణ మండలంలో బుధవారం జరుగగా ఇట్టి వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ తో పాటు భారతీయ జనతా పార్టీ భారతీయ జనతా యువ మోర్చా వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఉన్న మాట అంటే ఎమ్మెల్యే సంజయ్ కి ఉలుకు ఎందుకు...

- దొంగరాత్రి పోయి కండువా కప్పుకున్నది వాస్తవం కదా...?
- దమ్ముంటే మీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చెయ్ ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం రా...
- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి



జగిత్యాల ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి): జగిత్యాల నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ కార్యాలయం కమల నిలయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ బోగ శ్రావణి మీడియా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవన్ రెడ్డి టీడీపీ నుంచి మంత్రి పదవికి ఎమ్మెల్యే పదవికి పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యారు నేను నా చైర్మన్ పదవికి అధికార టీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ప్రతిపక్ష బీజేపీ పార్టీలో గౌరవప్రదంగా చేరాను మరి మీరు ఏం చేశారు...? దొంగ రాత్రి పోయి కాంగ్రెస్ పార్టీలో చేరారు... 2018లో లక్ష ఓట్లు వచ్చాయి అని గర్వంగా చెప్పుకున్నారు కదా 2023 లో 40 వేల ఓట్లు ఎందుకు తగ్గాయి...? కోట్లు ఖర్చు పెడితే 8 శాతం ఓట్ల తేడాతో గెలిచారు మరి అప్పటికీ ఇప్పటికీ ఓట్ల శాతం ఎందుకు తగ్గింది నడుమంత్రాపు సిరి వస్తే ఎగిరి పడుతారంటారు నువ్వు అనుభవిస్తున్న రాజకీయ జీవితం పదవి ప్రజల భిక్ష నిన్ను నమ్మిన కార్యకర్తల కష్టం మిమ్మల్ని గెలిపించిన నాయకులు జైలులో ఉన్న వాళ్ళను మరిపోయి దొంగరాత్రి దొంగలెక్క పోయి బిల్లుల కోసం కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నీతులు మాట్లాడడం హాస్యాస్పదం నిన్ను నమ్మిన వారి ఆత్మ గౌరవాన్ని పార్టీ కార్యకర్తల నమ్మకాన్ని కాంగ్రెస్ పార్టీకి తాకట్టు పెట్టావు (యు ఆర్ నాట్ ఫర్ జగిత్యాల డెవలప్మెంట్ యు ఆర్ ఫర్ యువర్ పర్సనల్ డెవలప్మెంట్ యువర్ ఫర్ యువర్ కాంట్రాక్టు డెవలప్మెంట్) సంజయ్ కుమార్ ది తెరిచిన పుస్తకం కాదు రాక్షస పాలన జగిత్యాల లో కక్ష సాధింపు రాజకీయాలు చేయడం మీతోనే సాధ్యం 2017లో భూమి పూజ చేసిన డబుల్ బెడ్ రూం ఇల్లు ఎందుకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పూర్తి కాలేదు దానికి మీ బంధువులే కదా కాంట్రాక్టర్లు...? 4 వేల నుండి 43 వేల ఓట్లు మా కార్యకర్తల కష్టం పార్టీ సపోర్ట్ ప్రజలు దీవించి ఇచ్చిన గౌరవప్రదమైన తీర్పు అది స్థానం గురించి మాట్లాడుతున్నారు కదా... ప్రజలు నీపై ఉన్న అభిప్రాయం ఇటీవల జరిగిన సర్వేలో మిమ్మల్ని 108వ స్థానంలో ఉంచారు అది గుర్తు పెట్టుకుని మాట్లాడండి దమ్ముంటే మీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయి...? బీఆర్ఎస్ లేదా కాంగ్రెస్ నుండి ఏ పార్టీ నుండి టికెట్ తెచ్చుకుంటావో తెచ్చుకో నేను బీజేపీ తరఫున నిలుచుంటా పోటీ చేస్తా ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం రా... అన్ని ఇటీవల కొన్ని మీడియా పత్రికల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్థాయి గురించి మాట్లాడినందుకు గాను డాక్టర్ బోగ శ్రావణి ఎమ్మెల్యే గారి మాటలకు చురకలు అంటించారు ప్రజలందరికి విజ్ఞప్తి చేస్తున్నాం జగిత్యాల ప్రజలు ఎమ్మెల్యేకి రాబోయే కాలంలో తగిన బుద్ధి చెబుతారన్నారు ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు కొక్కు గంగాధర్ పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న మహిళ మోర్చా ప్రధాన కార్యదర్శి సాంబరి కళావతి మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత పట్టణ ఉపాధ్యక్షులు పవన్ సింగ్ సింగం పద్మ కాశెట్టి తిరుపతి గడ్డల లక్ష్మి ఇట్యాల రాము నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర...

- రాజ్యాంగ పరిరక్షణ కాంగ్రెస్ తోనే సాధ్యం...
- కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు





కోరుట్ల ఏప్రిల్ 09 (వుదయం ప్రతినిధి): కోరుట్ల మండలం యూసుఫ్ నగర్ గ్రామంలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా యూసఫ్ నగర్ గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ప్రతిజ్ఞ చేయించి యూసఫ్ నగర్ గ్రామం నుండి ప్రజలతో కలిసి తిమ్మాయపల్లి వరక రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర యూసుఫ్ నగర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు విచ్చేశారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా యూసుఫ్ నగర్ గ్రామంలో నుండి తిమ్మాయపల్లి గ్రామం వరకు పాదయాత్ర చేపట్టడం జరుగుతుందని రాజ్యాంగాన్ని అత్యంత పవిత్రమైనదిగా ప్రపంచంలోనే గొప్ప రాజ్యాంగంగా భావిస్తామని సార్వభౌమత్వ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాంగ నిర్మించుకోవడానికి సాంఘిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని ఆలోచన భావ ప్రకటనను అంతస్తులును అవకాశాల్లోనూ మానవత్వాన్ని కల్పించడానికి కులమత ప్రాంత వర్మ లింగ ధనిక పేద లాంటి ఏ రకమైన భేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు బాధ్యతలు రాజ్యాంగ కల్పించిందని ఇటీవల పరిమాణాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ రాజ్యాంగ విలువలను కాలరాస్తూ సమాజంలో అసాధ్యులే నెలకొల్పుతున్నాయని విభేదాలు సృష్టిస్తూ రాజకీయం మనగడ కోసం విద్వేషాలు రెచ్చగొడుతున్నాయన్నారు ఇలాంటి తరుణంలో శాంతి అహింసను మూల సూత్రాలుగా మనకు బోధించే మహాత్ముడి స్ఫూర్తిగా మనసులంతా ఒకటే అంటూ రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు కల్పించడానికి డాక్టర్ బాబాసాహెబ్ ఆశయాలను అమలు చేస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి చిత్తశుద్ధితో అంకితభావంతో అహర్నిశలు కృషి చేయాలన్నారు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రచించింది కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని పరిరక్షించేది కూడా కాంగ్రెస్ పార్టీ యేనన్నారు అలాంటి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన ఇంటింటికి తీసుకెళ్లి కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ 200 రూపాయల వరకు ఉచిత విద్యుత్ ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం రైతు రుణమాఫీ వంటి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు.

కావున రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని కాబట్టి ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి గ్రామంలో ర్యాలీ నిర్వహించాలన్నారు కాంగ్రెస్ పార్టీ అంటేనే పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కృషి చేసే పార్టీ అని అన్నారు కాంగ్రెస్ పార్టీ చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు గడ్డం వెంకటేష్ గౌడ్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి ముక్కెర లింబాద్రి గుగ్గిళ్ళ సురేష్ నగునూరి గంగాధర్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఇంద్రాల హరీష్ గంగానర్సయ్య నవీన్ రెడ్డి రాకేష్ రెడ్డి హైస్ల గణేష్ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు యూసుఫ్ నగర్ గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# బిజినెస్





## ఆర్బీఐ ఎంపీసీ సమావేశంలో కీలక నిర్ణయం..
## కోట్లాది మందికి ఉపశమనం!

దేశ బ్యాంకింగ్ నియంత్రణ సంస్థ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ దేశంలోని కోట్లాది మందికి రుణ ఈఎంఐలలో ఉపశమనం కల్పించింది. ఆర్బీఐ MPC వరుసగా రెండవసారి రెపో రేటును 0.25 శాతం తగ్గించింది. ఆ తర్వాత రెపో రేటు 6.25 శాతం నుంచి 6 శాతానికి తగ్గింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలతో ఇబ్బంది పడుతున్న సమయంలో ఆర్‌బిఐ నుండి ఈ నిర్ణయం వచ్చింది. దీని తర్వాత ప్రపంచంలో ద్రవ్యోల్బణం, మాంద్యం పెరిగే అవకాశం పెరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి వెళ్లే అవకాశాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఆర్‌బిఐ తీసుకున్న ఈ నిర్ణయం చాలా మెరుగైనదిగా ఉంది. ఆర్బీఐ ఎంపీసీలోని మెజారిటీ సభ్యులు 0.25 శాతం కోతను సిఫార్సు చేశారు. ఆ తర్వాత రెపో రేటును ఇంత తగ్గించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రత్యేకత ఏమిటంటే ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వరుసగా రెండోసారి ఆర్‌బిఐ పాలసీ రేటును తగ్గించారు. ఫిబ్రవరి నెలలో జరిగిన పాలసీ సమావేశంలో కూడా వడ్డీ రేట్లను 0.25 శాతం తగ్గించారు. ఈ తగ్గింపు దాదాపు 5 సంవత్సరాల తర్వాత అంటే 56 నెలల తర్వాత కనిపించింది. ఈ తగ్గింపు తర్వాత సామాన్య ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని భావిస్తున్నారు. బ్యాంకింగ్ రంగంలో గృహ రుణాలు, కారు రుణాలు, రిటైల్ రుణాల ఖర్చు తగ్గుతుంది. దీని నుండి రియల్ రంగం ఎంతో ప్రయోజనం పొందుతారు. గత కొన్ని నెలలుగా మాంద్యం ఎదుర్కొంటున్న ఈ రంగంలో ఇళ్లకు డిమాండ్ పెరగవచ్చు. మార్చి నెల ద్రవ్యోల్బణ గణాంకాలు వెల్లడి కానప్పటికీ, ఫిబ్రవరి నెలలో దేశ ద్రవ్యోల్బణం 4 శాతం కంటే తక్కువగా ఉంది. గణాంకాలను పరిశీలిస్తే, దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 3.6 శాతంగా ఉంది. ఇది 7 నెలల్లో కనిష్ట స్థాయికి చేరుకుంది. దీనికి ప్రధాన కారణం ఆహార ద్రవ్యోల్బణం తగ్గడమేనని చెబుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఏప్రిల్ నెలలో కూడా రిటైల్ ద్రవ్యోల్బణం 4 శాతం కంటే తక్కువగా ఉండవచ్చు. రాబోయే రోజుల్లో ఈ సమస్య తప్పదు. దానికి ఒక కారణం ఉంది. ఈసారి వేడి మరింత తీవ్రంగా ఉ ంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. దీనివల్ల పంటలపై ప్రభావం చూపుతుంది. దీని కారణంగా కూరగాయలు, ధాన్యాల ధరలు పెరిగే అవకాశం ఉంది. దీని ప్రభావం ఆహార ద్రవ్యోల్బణంపై కనిపిస్తుంది. రెండవది ట్రంప్ సుంకం కారణంగా రూపాయి తగ్గవచ్చు. అలాగే ద్రవ్యోల్బణం కారణంగా దిగుమతి ద్రవ్యోల్బణం పెరగవచ్చు. ంఆర్‌బిఐ అంచనా ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉంటుందని అంచనా. అయితే నాల్గవ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 10 బేసిస్ పాయింట్లు పెరిగింది. ఇది మునుపటి 4.4 శాతం నుండి 4.5 శాతానికి పెరిగింది. అదే సమయంలో 2026 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.2 శాతంగా అంచనా వేయబడింది.

అయితే మొదటి త్రైమాసికంలో ఇది 4.6 శాతం వద్ద ఉండవచ్చు. గతంలో ఇది 4.5 శాతంగా ఉంటుందని అంచనా. రెండవ త్రైమాసికంలో ఇది 4 శాతం, మూడవ త్రైమాసికంలో 3.8 శాతం, నాల్గవ త్రైమాసికంలో 4.2 శాతంగా ఉంటుందని అంచనా.

## వెంటాడుతున్న ట్రంప్ సుంకాల భయాలు..
## నష్టాల్లో స్టాక్ మార్కెట్స్!



అమెరికా, చైనా మధ్య టారిఫ్ యుద్ధం మరోసారి ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో ప్రకంపనలు సృష్టించింది. భారతదేశంలోని మార్కెట్, పెట్టుబడిదారులు ఈరోజు ఆర్‌బిఐ నిర్ణయం కోసం చూస్తున్న తరుణంలో చైనాపై 104 శాతం సుంకం ప్రకటన మరోసారి మార్కెట్లో ప్రకంపనలు సృష్టించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చైనాపై విధించిన సుంకానికి ప్రతీకారంగా, చైనా అమెరికాపై 34% సుంకాన్ని విధించింది. ఏప్రిల్ 8 నాటికి దానిని ఉపసంహరించుకోవాలని ట్రంప్ కోరినప్పటికీ, చైనా దానికి అంగీకరించలేదు. ఇప్పుడు అమెరికా చైనా నుండి దిగుమతి చేసుకునే వస్తువులపై 104% సుంకం విధిస్తున్నట్లు ప్రకటించింది. చైనాపై సుంకాల ప్రభావం నేడు భారత మార్కెట్‌పై కూడా కనిపిస్తోంది. బుధవారం సెన్సెక్స్ 445.67 పాయింట్లు నష్టంతో 73,781 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 162 పాయింట్లు కుంగి 22,373 వద్ద కదలాడుతోంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 21 పైసలు తగ్గి, 86.45 వద్ద ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తొలి ద్వైమాసిక పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నరు సంజయ్ మల్హోత్రా వెల్లడించనున్నారు. కీలక రేట్లను 0.25% మేర తగ్గించే అవకాశం ఉంది. మరోవైపు, బీజింగ్ నుంచి వచ్చే దిగుమతులపై అమెరికా ఏకంగా 104శాతం టారిఫ్‌లు ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా కాలమానం ప్రకారం ఏప్రిల్ 9 నుంచి ఈ సుంకాలు అమల్లోకి రానున్నాయి. చైనాపై చర్య తీసుకున్న తర్వాత అమెరికా త్వరలో ఔషధ ఉత్పత్తులపై భారీ సుంకాలను విధించబోతోందని ట్రంప్ అన్నారు. ఇప్పటివరకు ఫార్మా రంగాన్ని అమెరికా పరస్పర సుంకం విధానం నుండి మినహాయించారు. కానీ ఇప్పుడు ఈ విధానం పరిధిని విస్తరించవచ్చు. అమెరికాకు ఔషధాలను సరఫరా చేసే అతిపెద్ద దేశం భారతదేశం. ట్రంప్ నిర్ణయం భారత ఫార్మా కంపెనీలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. సన్ ఫార్మా, లుపిన్, డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, గ్లాండ్ ఫార్మా వంటి కంపెనీలు అమెరికా మార్కెట్‌పై ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. బుధవారం వాటి షేర్లు ఒత్తిడిలో కనిపించాయి. మంగళవారం అమెరికా స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగో రోజు పడిపోయింది. దాదాపు ఒక సంవత్సరంలో మొదటిసారిగా S&P 500 5,000 కంటే తక్కువగా ముగిసింది. ఫిబ్రవరి 19న నమోదైన రికార్డు స్థాయి నుండి ఇప్పుడు ఇండెక్స్ 18.9% తగ్గింది. ఇది మాంద్యాన్ని సూచించే 20% క్షీణతకు దగ్గరగా ఉంది. అదే సమయంలో డౌ జోన్స్ పారిశ్రామిక సగటు 320 పాయింట్లు తగ్గి 37,645.59 వద్ద ముగిసింది. ఎస్ అండ్ పి 500 1.57% తగ్గి 4,982.77 వద్ద ముగిసింది.

## భారతదేశంలో క్రిప్టో నిబంధనలు..
## 2025లో పెట్టుబడిదారులు తెలుసుకోవలసినవి!



ఆధునిక ఆర్థికవిధానంలో ఉన్న చిక్కుల్లో.. ఒకప్పుడు సముద్ర వాణిజ్యం ఉన్నట్లు ఇప్పుడు క్రిప్టో ఆస్తులు ఉన్నాయి. ఇందులో అవకాశం, ప్రమాదం రెండూ ఉంటాయి. ప్రతి విషయంలో అభివృద్ధి ఉన్నట్లే మన దేశంలోని క్రిప్టో రెగ్యులేటరీ విధానం ప్రస్తుతం అన్వేషణ దశలో ఉంది. 2025 వచ్చేసింది. ఈ విధానం దేశ నాయకులతో పాటు.. ఇందులో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలనే ప్రతి మదుపుదారు, వ్యాపారి దృష్టిసారించాలని భావిస్తున్నారు. క్రిప్టోపై భారత్ వైఖరి నిర్మాణాత్మక వివేకంతో కూడుకున్నది. అవసరమైనప్పుడు వ్యవహరించే ధోరణితో 'వేచి చూసే' విధానాన్ని ఈ దేశం అవలంబిస్తోంది. అయితే క్రిప్టో, వర్చువల్ డిజిటల్ ఆస్తులను (వీడీఏ) ప్రస్తుత ట్యాక్స్ అండ్ కాంప్లయన్స్ ఫ్యాబ్రిక్‌లో కొంత మేరకు కేంద్రం పొందుపరిచిందని, ఒక ప్రత్యేకమైన వాతావరణాన్ని రూపొందిస్తోంది. దీనిపై అవగాహన కలిగేందుకు దోహదపడుతుందని జియోటస్ క్రిప్టో ప్లాట్‌ఫామ్ సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ అన్నారు. వీడీఏల నుంచి వచ్చే లాభాలపై భారత్ 30 శాతం పన్ను విధిస్తోంది. దీనికి హోల్డింగ్ పీరియడ్ లేదా ట్రేడింగ్ స్కేల్ తో సంబంధం లేదు. నష్టాలను పూడ్చుకోవడానికి ఈ పన్ను విధానంలో వీలుండదు. ఇది మార్కెట్ లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ రిస్క్ మేనేజ్ మెంట్ ను ఒక ముఖ్యమైన నైపుణ్యంగా చేస్తుంది. లావాదేవీలపై మూలం వద్ద 1% పన్ను మినహాయింపు (టీడీఎస్) వర్తిస్తుంది. దీన్ని సులభంగా గుర్తించాలి.

ఇతరత్రా వ్యాపారాల తరహాలో దాచిపెట్టలేరు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను క్రిస్టలైజ్ చేయడం అనేది ఓ కొత్త విషయం. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ)లో రిజిస్టర్ అయిన ఎక్స్ఛేంజీలు నో యువర్ కస్టమర్ (కేవైసీ), యాంటీ మనీ లాండరింగ్ (ఏఎంఎల్) ప్రోటోకాల్స్ లాంటివాటిని సంప్రదాయ ఆర్థిక సంస్థల్లాగే కఠినంగా పాటించాలి. ఇది పెట్టుబడిదారులకు మరింత రక్షణ, సంస్థాగత చట్టబద్ధతకు వేదికను కల్పిస్తుంది. క్రిప్టో ఊహాజనిత కొత్తదనం స్థాయి నుంచి విశ్వసనీయ ఆస్తి వరకు అభివృద్ధి చెందడానికి ఇది అవసరం. నిబంధనలను సాధారణంగా ఒంటరిగా రూపొందించరు. భారతదేశ విధాన దిశ అంతర్జాతీయ చర్చకు అద్దం పడుతోంది. స్థిరమైన, వికేంద్రీకృత ఫైనాన్స్ (డీఫై) కోసం మరింత నిర్వచించిన నిబంధనల దిశగా అమెరికా అడుగులు వేస్తోంది. ఈయూ మార్కెట్స్ ఇన్ క్రిప్టో ఎసెట్స్ (ఎంఐసీఏ) ఫ్రేం వర్క్ ఇప్పటికే సిద్ధమవుతోంది. ఆఫ్ షోర్ ఎక్స్ఛేంజీలు, వాలెట్లపై ఇటీవల భారతదేశం తీసుకున్న అణచివేత చర్యలు.. ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్) ట్రావెల్ రూల్, గ్లోబల్ ఏఎంఎల్ ప్రమాణాలకు అనుగుణంగా ఉ న్నాయి. 2025లో భారత్ 'మల్టీ ఏజెన్సీ ఓవర్ సైట్ ఫ్రేం వర్క్'ను అధికారికంగా ప్రకటించడం ఒక ముఖ్యమైన పరిణామం. సెక్యూరిటీలను పోలిన టోకెన్ల కోసం సెబీబీ పేమెంట్ టోకెన్ల కోసం ఆర్బీఐబీ లేదా బ్లాక్ చెయిన్ టెక్నాలజీ వాడకం కేసుల కోసం మెయిటీ ఉన్నాయి. పెట్టుబడిదారులకు ఇదంతా చూస్తే మొదట్లో చాలా గందరగోళంగా అనిపించవచ్చు. కానీ, ఇది అస్పష్టతను కచ్చితంగా తొలగించి, బాధ్యతాయుతమైన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది.




## హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాదారులకు అలర్ట్..
## 12న బ్యాంకు సేవలలో అంతరాయం!

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతాదారులకు అలర్ట్! 12వ తేదీన బ్యాంకు సేవలలో కొంత అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. అందుకే వినియోగదారులు ముందుస్తుగా గమనించడం చాలా ముఖ్యం. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తన ప్లాట్‌ఫారమ్‌ల నిర్వహణలో భాగంగా, కొన్ని బ్యాంకింగ్ సేవల్లో అంతరాయం ఏర్పడవచ్చు. ఏప్రిల్ 2వ తేదీన ఉదయం 2.30 గంటల నుంచి ఉదయం 6.30 గంటల వరకు (4 గంటలు) పలు సేవల్లో అంతరాయం ఏర్పడనుందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తెలిపింది. ఈ బ్యాంకు సిస్టమ్ నిర్వహణలో భాగంగా ఏర్పడే అంతరాయాల్లో చాట్‌బ్యాంకింగ్, ఎస్ఎంఎస్ బ్యాంకింగ్, ఫోన్‌బ్యాంకింగ్ ఐవీఆర్ సేవల్లో అంతరాయం ఉండవచ్చు. బ్యాంక్ తన కోర్ బ్యాంకింగ్ సిస్టమ్‌ను కొత్త ప్లాట్‌ఫామ్‌కు అప్‌గ్రేడ్ చేస్తోంది. దాని 93 మిలియన్ల వినియోగదారులకు కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచడం క్ష్యంగా పెట్టుకుంది. దీంతో బ్యాంకు వినియోగదారులను మెయిల్స్, సందేశాన్ని కూడా పంపినట్లు తెలిపింది. సిస్టమ్ అప్‌గ్రేడ్ చేస్తున్నందున బ్యాంకు అకౌంట్‌కు సంబంధించి యూపీఐ సేవలతో పాటు ఇతర సేవలు అందుబాటులో ఉండవని తెలిపింది.

# ముడి చమురు తగ్గింపు

### లాభాన్ని కాజేస్తున్న కేంద్రం




అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు అమాంతం పడిపోయాయి. గతేడాది 2024 నుంచి తగ్గుముఖం పట్టిన చమురు ధరలు ఇటీవల మరింత దిగివచ్చాయి. 2025 ప్రారంభంలో బ్యారెల్ 70 డాలర్ల దిగువకు పడిపోయింది. తాజాగా వాణిజ్య యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో సోమవారం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర 64 డాలర్లకు క్షీణించింది. అటు టెక్సాస్ క్రూడ్ ధర 60 డాలర్లకు దిగొచ్చింది. ఇది నాలుగేళ్ల కనిష్ట స్థాయి కావడం విశేషం. వాణిజ్య యుద్ధం ఇతర పరిణామాలతో రష్యా ఉరల్స్ ఆయిల్ ధర ఏకంగా 50 డాలర్లకు క్షీణించింది. అయితే ఈ తగ్గింపు కారణంగా రిటైల్ మార్కెట్‌లో పెట్రోలు, డీజిలు ధరలు తగ్గుతాయని ఆశించిన వినియోగదారులను కేంద్ర ప్రభుత్వం నిలువునా వంచనకు గురిచేస్తోంది. ఎక్సైజ్ డ్యూటీలు అదనంగా పెంచేసి తగ్గింపు లాభాలు ప్రజలకు చేరనీయకుండా దొడ్డిదారిన దోచుకుంటోందన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో ప్రజలపై ఎప్పటిలానే ధరాభారం పెరిగిపోతోంది. డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధం ఒత్తిడి, అమెరికాలో పెరుగుతున్న మాంద్యం భయాలు, ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం ఇవన్నీ చమురు ధరలు పడిపోవడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఒపెక్ దేశాలు ఉత్పత్తి అంచనాలకు కోత పెట్టాయి. ఇది బలహీనమైన ప్రపంచ వినియోగాన్ని ప్రతిబింబిస్తుంది. మరోవైపు చైనా వంటి మార్కెట్లలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరగడం క్రూడ్ ధరలు మరింత తగ్గేలా చేశాయి. వారంలో రెండుసార్లు చమురు ధరల అంచనాలను తగ్గించిన బ్రోకరేజ్ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ మంగళవారం మరింత కోత పెట్టింది. బ్యారెల్ ధర 40 డాలర్లకు పడిపోయినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని విశ్లేషించింది. గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు అమాంతం తగ్గుతుంటే దేశీయంగా మోడీ సర్కార్ ఎప్పటిలాగే తన ఖజానాను నింపుకునే పనిలో ఉ ంది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ.2 చొప్పున పెంచుతూ సోమవారం నిర్ణయం తీసుకుంది. ఈ మొత్తాన్ని ఇంధన కంపెనీలు భరించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. తాజా పెంపు తర్వాత లీటర్ పెట్రోల్‌పై రూ.13, డీజిల్‌పై రూ.10 ఎక్సైజ్ సుంకం అమల్లోకి రానుంది. 2014 నుంచి 2016 మధ్య మోడీ సర్కార్ ఇంధనాలపై 9 సార్లు ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. దీంతో ఆ సమయంలో కేంద్రానికి రూ.99,000 కోట్ల ఆదాయం సమకూరింది. అంటే ఆ మొత్తం ప్రజలపై భారం పడింది.

ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గినప్పుడల్లా ఆ ప్రతిఫలాలను ప్రజలకు అందకుండా బిజెపి సర్కార్ ఎక్సైజ్ సుంకాన్ని బాదుతోందనే విమర్శలు ఉన్నాయి.

# జాతీయం – అంతర్జాతీయం



## రెండోసారి అసెంబ్లీ ఆమోదిస్తే అదే ఫైనల్

న్యూఢిల్లీ : తమిళనాడులో గవర్నర్ వద్ద బి ల్లుల పెండింగ్ అంశంలో డీఎంకే ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఊరట లభించిం ది. అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్లు శాశ్వతంగా తమ వద్ద ఉంచుకోలేర ని అత్యున్నత న్యాయస్థానం వెల్లడించిం ది. కీలక బిల్లులకు సమ్మతి తెలపకుండా పెండింగ్‌లో ఉంచడం చట్ట విరుద్ధమం టూ తీర్పు ఇచ్చింది. అసెంబ్లీ తీర్మానించిన బిల్లులను ఆమోదించడంలో జాప్యం వల్ల గవర్నర్ ఆర్ఎన్ రవికి తమిళనాడు ప్రభుత్వానికి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ తాజా తీర్పు ప్రాధాన్యత సంతరించుకుంది. “ 10 బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపాలన్న గవర్నర్ చర్య చట్టవిరుద్ధం, ఏకపక్షం, గవర్నర్ బిల్లును పునః పరిశీలనకు వెనక్కి పంపాక, అసెంబ్లీ తిరిగి ఆమోదించిన తర్వాత రెండోసారి ఆ బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి సిఫార్సు చేయకూడదు. అలా చేస్తే అది చట్టవిరుద్ధం అవుతుంది. అసెంబ్లీ రెండోసారి ఆమోదించిన బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టుగానే పరిగణించాలి. ఒకవేళ రాష్ట్రపతికి నివేదించదలిస్తే నెలరోజుల్లోపై గవర్నర్ దానిపై నిర్ణయం తీసుకోవాలి. రాష్ట్రపతికి సిఫార్సు అవసరం లేదనుకుంటే 3 నెలల్లోపు బిల్లులపై నిర్ణయం తీసుకోవాలి. అంతేగానీ శాశ్వతంగా వాటిని తమ వద్ద ఉంచుకోలేరు ” అని సుప్రీం ధర్మాసనం తన తీర్పులో పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం రాష్ట్ర శాసనసభ ఒక బిల్లును పాస్ చేసి ఆమోదం కోసం పంపినప్పుడు గవర్నర్ ఆ బిల్లుకు ఆమోద ముద్ర వేయడం, సమ్మతిని నిలుపుదల చేయడం, రాష్ట్రపతి పరిశీలనకు పంపడం, పునః పరిశీలనకు మళ్లీ శాసనసభకు పంపడం వంటివి చేస్తారు. తర్వాత మళ్లీ సభ దానిని ఆమోదిస్తే.. గవర్నర్ సమ్మతితో నిలిపివేయలేరు. కానీ దాన్ని రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వు చేయవచ్చు. రాజ్యాంగానికి, ప్రభుత్వ విధానాలకు, జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశాలకు విరుద్ధంగా ఉ ందని భావిస్తే.. ఆ విధంగా రిజర్వ్ చేసే వీలు ఉ ంటుంది. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవికి పంపగా, ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వాటిని తనవద్దే ఉంచేసుకుంటున్నారని తమిళనాడు ప్రభుత్వం ఆరోపిస్తోంది.

## జాతీయ హీరోలపై బిజెపి, ఆర్ఎస్ఎస్ ‘పక్కా కుట్ర



అహ్మదాబాద్ : బిజెపి, ఆర్ఎస్ఎస్ జాతీయ హీరోలకు వ్యతిరేకంగా ‘పక్కా కుట్ర’ సాగించాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవారం ఆరోపించారు. సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ సిద్ధాంతం ఆర్ఎస్ఎస్ భావజాలానికి భిన్నమైనదని ఆయన స్పష్టం చేశారు. స్వాతంత్ర్యోద్యమంలో ‘ఏమాత్రం పాత్ర లేని’ సంస్థ ఆయన వారసత్వం గురించి చెప్పుకోవడం హాస్యాస్పదం అని ఖర్గే అన్నారు. అహ్మదాబాద్‌లోని సర్దార్ పటేల్ మెమోరియల్‌లో విస్తృత కాంగ్రెస్ కార్యవర్గం (సిడబ్లుసి) సమావేశంలో ఖర్గే ప్రారంభోపన్యాసం చేస్తూ, ఇప్పుడు మతపరమైన విభజనకు పాల్పడడం ద్వారా దేశంలోని మౌలిక సమస్యల నుంచి దృష్టి మళ్లిస్తున్నారని కూడా ఆరోపించారు. ‘మరొక వైపు స్వల్ప జనాధిపత్యం దేశ వనరులను గుప్పిటలోకి తీసుకోవడం ద్వారా ప్రభుత్వాన్ని నియంత్రించే పథంలో సాగుతోంది’ అని ఆయన పేర్కొన్నారు. సర్దార్ పటేల్‌ను ఖర్గే ఉటంకిస్తూ, సంస్థాగత బలం ప్రధానమైనదేనని, సంస్థ లేకుండా కేవలం సంఖ్యాబలం అర్థరహితం అని అన్నారు. గత అనేక సంవత్సరాలుగా జాతీయ హీరోలు పలువురి విషయమై పక్కా కుట్ర సాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ‘గడచిన 140 సంవత్సరాలుగా దేశానికి సేవ చేసిన, దేశం కోసం పోరాడిన మహోన్నత చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఒక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. తమ విజయాలుగా చూపేందుకు ఏమీ లేనివారే ఈ పని చేస్తున్నారు’ అని ఖర్గే విమర్శించారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌పై ఖర్గే విరుచుకుపడుతూ, స్వాతంత్ర్యోద్యమంలో తమ కృషిగా చూపేందుకు వారికి ఏమీ లేదని ఆయన అన్నారు. సర్దార్ పటేల్, పండిత్ నెహ్రూ మధ్య సంబంధాన్ని ఆ దిగ్గజాలకు ఒకరంటే ఒకరికి పడదనేలా చూపేందుకు అవి కుట్ర పన్నాయి. వారు ఒక నాణానికి రెండు వైపుల వారనేది వాస్తవం. వారి మధ్య సుహృద్భావపూర్వక సంబంధాలు ఉన్నాయనేందుకు దాఖలాలుగా అనేక ఘటనలు, పత్రాలు ఉన్నాయి’ అని ఖర్గే స్పష్టం చేశారు. ‘వారిద్దరి మధ్య దాదాపు రోజూ ఉత్తరప్రత్యుత్తరాలు సాగుతుండేవి. నెహ్రూజీ అన్ని విషయాలపై ఆయన సలహా తీసుకుంటుండేవారు. పటేల్ సాహెబ్ అంటే నెహ్రూజీకి అపార గౌరవం ఉంది. ఆయన ఏదైనా సలహా తీసుకోవలసి వస్తే స్వయంగా పటేల్‌జీ ఇంటికి వెళుతుండేవారు. పటేల్‌జీ సౌకర్యార్థం సిడబ్ల్యుసి సమావేశాలను ఆయన నివాసంలో నిర్వహించారు’ అని ఖర్గే తెలియజేశారు. పటేల్ సిద్ధాంతం ఆర్ఎస్ఎస్ భావాలకు విరుద్ధమైనదని, ఆయన ఆ సంస్థను నిషేధించారు కూడా అని ఖర్గే స్పష్టం చేశారు.

## కునాల్ కమ్రా పిటిషన్‌పై స్పందించండి

ముంబయి: తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని బాంబే హైకోర్టు మంగళవారం ఆదేశించింది. మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను అవమానించారంటూ తనపై ఖర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు కొట్టివేయాలని కోరుతూ కమ్రా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ సారంగ్ కొత్వాల్, జస్టిస్ ఎస్ఎం మోదక్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. పిటిషన్‌పై స్పందించాలని రాష్ట్రప్రభుత్వాన్ని, ఫిర్యాదుదారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 16, మధ్యాహ్నం 2:30 గంటలకు వాయిదా వేసింది. మంగళవారం విచారణలో కమ్రా తరుపున న్యాయవాది నవ్రోజ్ సీర్వాయి వాదనలు వినిపించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తన క్లయింట్ స్టేట్‌మెంట్ ఇవ్వడానికి మూడుసార్లు ముందుకొచ్చారని, అయినా అధికారులు స్టేట్‌మెంట్‌ను రికార్డు చేయడం లేదని న్యాయవాది తెలిపారు. ఇది హత్య కేసు కాదని, కామెడీ షోకు సంబంధించిందని, ఈ షో వీడియో కూడా అందుబాటులో ఉందని చెప్పారు. కమ్రాను హత్య చేస్తామంటూ బెదిరింపులు రావడం వల్లే భౌతికంగా విచారణకు హాజరుకావడం లేదని ధర్మాసనానికి తెలిపారు. ఈ కేసులో మద్రాస్ హైకోర్టు కమ్రాకు ముందస్తు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేసిందని గుర్తు చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వం తరుపున ధర్మాసనం ముందు హాజరైన అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మన్కున్వర్ దేశ్‌ముఖ్ తదుపరి విచారణను ఈ నెల 22కు వాయిదా వేయాలని కోరారు. మద్రాస్ హైకోర్టు ఇచ్చిన బెయిల్ గడువు ఈ నెల 17 వరకూ ఉండటంతో తదుపరి విచారణను బాంబే హైకోర్టు ఈ నెల 16కు వాయిదా వేసింది.

## అణు కార్యక్రమంపై ఇరాన్‌తో ప్రత్యక్ష చర్చలు

వాషింగ్టన్ : అణు కార్యక్రమంపై అమెరికా, ఇరాన్ ప్రత్యక్ష చర్చలు ప్రారంభించనున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌తో నేరుగా చర్చలు జరపనున్నామని, వచ్చే శనివారం ప్రారంభమవుతాయని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్‌తో బేటీ కానున్నామని, ఏమి జరుగుతుందో వేచి చూద్దామని సోమవారం ఆయన వ్యాఖ్యానించారు. ఇరు దేశాలు అణు ఒప్పందం చేసుకోవడమే ఉత్తమమని అందరూ అంగీకరిస్తున్నట్లు తాను భావిస్తున్నానని అన్నారు. ఓవల్ కార్యాలయంలో ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూతో చర్చల సందర్భంగా మీడియాతో మాట్లాడారు. అణు కార్యక్రమంపై ప్రత్యక్ష చర్చలు జరపాలని లేదా బాంబు దాడులు ఎదుర్కోవలసి ఉంటుందని ఇటీవల ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించిన సంగతి తెలిసిందే. అమెరికాతో ప్రత్యక్ష చర్చలన్నది అర్థం లేని విషయమని ఇరాన్ వ్యాఖ్యానించింది. పరోక్ష చర్చలకైతే తాము సిద్ధంగా ఉన్నామని తెలిపింది.

## టీచర్ పోస్టులపై సిబిఐ దర్యాప్తు అక్కర్లేదు:

పశ్చిమబెంగాల్‌లో ఉపాధ్యాయ నియామక కుంభకోణం కేసులో అదనపు పోస్టుల సృష్టిలో సీబీఐ దర్యాప్తు నిమిత్తం హైకోర్టులో ఇచ్చిన ఆదేశాల్లో కొన్నింటిని సుప్రీం కోర్టు తాజాగా పక్కనపెట్టింది. అదనపు పోస్టుల సృష్టిపై రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంలో సీబీఐ దర్యాప్తు అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో మమతా బెనర్జీ ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. పశ్చిమబెంగాల్ విద్యాశాఖ నిపుణులతో చర్చించిన తర్వాతనే ఈ అదనపు పోస్టులను సృష్టించిందని, దీనికి గవర్నర్ నుంచి ఆమోదం లభించిందని, అలాంటప్పుడు ఇందులో న్యాయమైన జోక్యం అవసరం లేదని చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వం లోని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే టీచర్ల నియామకాల్లో ఇతర అవకతవకలకు సంబంధించిన ఇతర అంశాలు, ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతుందని కోర్టు పేర్కొంది. 2016 లో పశ్చిమబెంగాల్‌లో ఉపాధ్యాయులతోపాటు సిబ్బంది నియామకాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడం, దీనిపై కలకత్తా హైకోర్టు, సుప్రీం కోర్టు ఈ ప్రక్రియ చెల్లదని తీర్పు ఇవ్వడం తెలిసిందే. అయితే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వ అధికారుల పాత్రతోపాటు అవకతవకలపై దర్యాప్తు జరపాలని హైకోర్టు సీబీఐని ఆదేశించింది. దీన్ని సవాల్ చేస్తూ బెంగాల్ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై గతంలో విచారణ జరిపిన సుప్రీం కోర్టు .. సిబిఐ దర్యాప్తుపై స్టే విధించింది. తాజాగా అదనపు ఉద్యోగాల సృష్టిపై దర్యాప్తు అవసరం లేదంటూ తీర్పు చెప్పింది.

## వేర్పాటువాదానికి మరి మూడు గ్రూపులు గుడ్‌బై

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్ ఇస్లామిక్ పొలిటికల్ పార్టీ, జమ్మూ కాశ్మీర్ ముస్లిం డెమోక్రాటిక్ లీగ్, కాశ్మీర్ ఫ్రీడమ్ ఫ్రంట్ వేర్పాటువాద సంస్థ హురియత్ కాన్ఫరెన్స్ (హెచ్‌సి) నుంచి తప్పుకున్నాయని కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా మంగళవారం ప్రకటించారు. ఇంత వరకు జమ్మూ కాశ్మీర్‌లో అటువంటి 11 సంస్థలు వేర్పాటువాదానికి స్వస్తి పలికాయి. వాటి చర్య రాజ్యాంగంలో ప్రజల విశ్వాసాన్ని ప్రదర్శించిందని అమిత్ షాస్పష్టం చేశారు. ‘మరి మూడు సంస్థలు, జమ్మూ కాశ్మీర్ ఇస్లామిక్ పొలిటికల్ పార్టీ, జమ్మూ కాశ్మీర్ ముస్లిం డెమోక్రాటిక్ లీగ్, కాశ్మీర్ ఫ్రీడమ్ ఫ్రంట్ హురియత్‌తో సంబంధం లేదని స్వయంగా ప్రకటించాయి. లోయలో భారత రాజ్యాంగం పట్ల ప్రజల విశ్వాసానికి అది ప్రధాన సూచిక’ అని అమిత్ షా ‘ఎక్స్’లో రాశారు. జమ్మూ కాశ్మీర్‌లో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా పర్యటన మధ్యలో ఈ ప్రకటన వెలువడింది. సమైక్య, శక్తిమంత భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోడీ లక్ష్యానికి ఇప్పుడు మరింత బలం చేకూరిందని, ఇంత వరకు అటువంటి 11 సంస్థలు వేర్పాటువాదానికి స్వస్తి పలికి, మోడీ లక్ష్యానికి తిరుగులేని మద్దతు ప్రకటించాయని అమిత్ షా తెలియజేశారు. క్రితం నెల వేర్పాటువాదుల బృహత్ కూటమి హురియత్ కాన్ఫరెన్స్ నుంచి పలు సంస్థలు తప్పుకున్నాయి. హురియత్‌తో ఇక సంబంధం లేదని ప్రకటించిన సంస్థల్లో షహీద్ సలీమ్ నేతృత్వంలోని జమ్మూ కాశ్మీర్ పీపుల్స్ మూవ్‌మెంట్, న్యాయవాది షఫీ రెషి నేతృత్వంలోని జమ్మూ కాశ్మీర్ డెమోక్రాటిక్ పొలిటికల్ మూవ్‌మెంట్, మొహ్మద్ షరీఫ్ సర్తాజ్ నాయకత్వంలోని జమ్మూ కాశ్మీర్ ఫ్రీడమ్ మూవ్‌మెంట్ ఉన్నాయి. మార్చి 25వ ఆ సంస్థలు ఆ ప్రకటన చేసినప్పుడు మోడీ ప్రభుత్వ ఏకీకరణ విధానాలు జమ్మూ కాశ్మీర్ నుంచి వేర్పాటువాదాన్ని ‘దూరం చేశాయి’ అని అమిత్ షా చెప్పారు. రెండు రోజుల తరువాత మరి రెండు హురియత్ భాగస్వామ్య సంస్థలు జమ్మూ కాశ్మీర్ తెహ్రీకీ ఇస్తెక్‌లాల్, జమ్మూ కాశ్మీర్ తెహ్రీకీ ఇస్తికామత్ హురియత్‌తో తెగతెంపులు చేసుకుంటున్నట్లు ప్రకటించాయి. జమ్మూ కాశ్మీర్ తెహ్రీకీ ఇస్తెక్‌లాల్‌కు గులామ్ నబీ నాయకత్వం వహిస్తుండగా జెకె తెహ్రీకీ ఇస్తికామత్‌కు గులామ్ నబీ వర్ నేతృత్వం వహిస్తున్నారు.



## ఇజ్రాయిల్ దాడిలో జర్నలిస్ట్ సజీవదహనం

గాజా : గాజాను తన ఆధీనంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఇజ్రాయిల్ తన భీకర దాడులను కొనసాగించింది. గత 24 గంటల్లో గాజా స్ట్రిప్‌లో 58 మంది మరణించారు. ఖాన్ యునిస్‌లోని నాస్ర్ హాస్పిటల్ సమీపంలో ఇజ్రాయిల్ చేసిన దాడిలో ఒక జర్నలిస్ట్‌ను సజీవ దహనం అయ్యాడు. జర్నలిస్టుల టెంట్‌పై జరిగిన దాడిలో ఫోటోగ్రాఫర్ అహ్మద్ మన్సూర్ మరణించారు. ఈ సంఘటనలో ఎనిమిది మంది విలేకరులు గాయపడ్డారు. ఈ ఘటనపై షాట్ అనే విలేకరి మాట్లాడుతూ%8% ”నేను దూరం నుండి చిత్రాలు తీయడం ప్రారంభించాను. నేను మండుతున్న టెంట్‌కు దగ్గరగా వచ్చేసరికి, నా సహోద్యోగులలో ఒకరు మంటల్లో ఉన్నట్లు నేను చూశాను. మంటల దగ్గరికి వెళ్లి కాలిపోతున్న వ్యక్తిని బయటకు లాగడానికి ప్రయత్నించాను. నేను అతని కాలు పట్టుకొని బయటకు లాగడానికి ప్రయత్నించాను, కానీ అతని ప్యాంటు నా చేతిలో చిరిగిపోయింది. మరొక వైపు నుండి నేను ప్రయత్నించాను. మంటలు చాలా బలంగా పెరిగాయి. నేను వెనక్కి పడిపోయాను. నేను ఇక భరించలేకపోయాను. అప్పుడు కొంతమంది వ్యక్తులు మంటలను ఆర్పడానికి నీటితో వచ్చారు. నేను అకస్మాత్తుగా బలహీన పడి, స్పృహ కోల్పోయాను” అని తెలిపారు. పాలస్తీనియన్ జర్నలిస్ట్ సిండికేట్ ప్రకారం, అక్టోబర్ 2023 నుండి 200 మందికి పైగా జర్నలిస్టులు, మీడియా కార్మికులను ఇజ్రాయిల్ దళాల చేతిలో చనిపోయారు. ఇజ్రాయిల్ క్రూరమైన దాడులను బహిర్గతం చేసే జర్నలిస్టులను ఇజ్రాయిల్ లక్ష్యంగా చేసుకుంటోందని హమాస్ తెలిపింది. గాజాలో యుఎన్ శరణార్థి సంస్థ నిర్వహిస్తున్న ఆరు పాఠశాలలపై ఇజ్రాయిల్ దళాలు దాడి చేశాయి. పాఠశాలలను పనిచేయడానికి సైన్యం అనుమతించలేదని తెలిపారు. గాజాపై తీవ్రతరం చేసిన దాడుల వలన దాదాపు 4,00,000 మంది వలసపోయారని యుఎన్ ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్ అన్నారు. గాజా స్ట్రిప్‌లో 50 శాతంపై ఇజ్రాయిల్ ఆక్రమించుకుందని తెలిపింది.

## తుదికంటా పోరాడతాం !

### అమెరికా బెదిరింపులపై చైనా స్పష్టీకరణ




బీజింగ్ : ఇరు దేశాల ప్రయోజనాలను, అంతర్జాతీయ సమాజం ప్రయోజనాలను పట్టించుకోకుండా అమెరికా టారిఫ్ యుద్ధాన్ని లేదా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించాలని పట్టుబడితే చైనా కూడా తుదివరకూ పోరాడుతుందని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ చెప్పారు. అమెరికా చర్యకు దీటుగా చైనా తీసుకుంటున్న ప్రతీకార చర్యలను తక్షణమే ఉపసంహరించుకోని పక్షంలో చైనాపై అదనంగా 50శాతం టారిఫ్‌లు విధిస్తామంటూ ట్రంప్ బెదిరించడంపై అడిగిన ప్రశ్నకు లిన్ మంగళవారం ఈ మేరకు స్పందించారు. అమెరికా ప్రారంభించిన ఈ టారిఫ్ చర్యలు అన్ని దేశాల చట్టబద్ధమైన హక్కులను, ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయని, డబ్ల్యుటిఓ నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని, బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తున్నాయని, అంతర్జాతీయ ఆర్థిక సుస్థిరతను దెబ్బతీస్తున్నాయని లిన్ విమర్శించారు. ఈ వైఖరిని చైనా తీవ్రంగా ఖండిస్తోందని పునరుద్ఘాటించారు. సమస్యలను రెచ్చగొట్టాలని మేం అనుకోవడం లేదు, అలాగే సమస్యలు ఎదురైతే భయపడం కూడా అని స్పష్టం చేశారు. బెదిరింపులు, ఒత్తిళ్లు వంటివి చైనా దగ్గర పని చేయవన్నారు. చైనా సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి ప్రయోజనాలు దెబ్బతింటుంటే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. యురోపియన్ కమిషన్ అధ్యక్షుడు ఉర్సులా వాన్ డెర్ లేయన్‌తో మంగళవారం చైనా ప్రధాని లీ కియాంగ్ ఫోన్‌లో మాట్లాడారని సిసిటివి న్యూస్ తెలిపింది. ఈ ఏడాదితో చైనా – ఇయు దౌత్య సంబంధాలకు 50ఏళు పూర్తయినట్లు లీ తెలిపారు. ఇయుతో రాజకీయ పరస్పర విశ్వాసాన్ని పెంచుకోవాలని చైనా భావిస్తోందన్నారు. ఆచరణాత్మక సహకారాన్ని విస్తరించుకోవాలని కోరుకుంటున్నామన్నారు. చర్చలు, సంప్రదింపుల ద్వారా పరస్పర ఆందోళనలను పరిష్కరించుకోవాలన్నారు.

## పాలస్తీనియన్లకు తాత్కాలిక ఆశ్రయం కల్పిస్తాం

జకార్తా: గాజాలో ఇజ్రాయిల్ సైన్యం, హమాస్ కు మధ్య జరుగుతున్న యుద్ధంలో బాధితులైన పాలస్తీనియన్లకు తాత్కాలిక ఆశ్రయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో బుధవారం ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం గత నెలలో ఇజ్రాయిల్ గాజాపై తిరిగి దాడులను ప్రారంభించినప్పటి నుండి దాదాపు 4,00,000 మంది గాజా నివాసితులు నిరాశ్రయులయ్యారు. గాయపడిన బాధితులకు ఆశ్రయం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రబోవో తెలిపారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, టర్కీ, ఈజిప్ట్, ఖతార్ మరియు జోర్డాన్‌లకు, మధ్యప్రాచ్య పర్యటనకు బయలుదేరే ముందు ఆయన ఈ ప్రకటన చేశారు. “వారిని రవాణా చేయడానికి మేము విమానాలను పంపడానికి సిద్ధంగా ఉన్నాము. మొదటి దశలో 1,000మంది ఉండవచ్చని మేము అంచనా వేస్తున్నాము. గాయపడిన పాలస్తీనియన్లు, అనాథలైన పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని” ఆయన అన్నారు. బాధితులు కోలుకునే వరకు, వారు తిరిగి సురక్షితంగా వెళ్లేవరకు మాత్రమే ఇండోనేషియాలో ఉంటారని, దానికి సంబంధించిన వివరాలను పాలస్తీనా అధికారులతో, స్థానిక పార్టీలతో చర్చించాలని విదేశాంగ మంత్రిని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ముస్లిం దేశమైన ఇండోనేషియా, ఇజ్రాయిల్–పాలస్తీనా వివాదానికి పరిష్కరించుకోవాలని రెండు దేశాలకు నిరంతరం పిలుపునిస్తుంది.

## మేధా పాట్కర్ జైలు శిక్ష సడలింపు

పరువునష్టం కేసులో శిక్ష అనుభవిస్తున్న సామాజిక కార్యకర్త మేధా పాట్కర్ కు ఢిల్లీ హైకోర్టు సత్ ప్రవర్తనకు గానూ ఆమె జైలు శిక్షను తగ్గించి, విడుదల చేసింది. ప్రస్తుతం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ గా ఉన్న వికె సక్సేనా గుజరాత్ లో ఒక స్వచ్ఛంద సంస్థకు నాయకత్వం వహించినప్పుడు దాఖలు చేసిన పరువునష్టం కేసులో మేధా పాట్కర్ ఐదు నెలల జైలు శిక్షఎదుర్కొంటున్నారు. కాగా , మంగళవారం నాడు ఆమెను ఢిల్లీకోర్టు విడుదలకు ఆదేశాలు జారీ చేసింది. అయితే పాట్కర్ లక్షరూపాయల జరిమానా చెల్లించాలనే ముందస్తు షరతు విధించింది.మేధా పాట్కర్ మహిళ, 70 ఏళ్ల వృద్ధురాలు. ఆమెపై గతంలో ఎలాంటి నేరారోపణలు లేవు. ఆమెకు ప్రొబేషన్ పై విడుదల చేయకుండా నిరాకరించడానికి ఎలాంటి కారణాలు లేవని కోర్టు పేర్కొంది. అందువల్ల 2024 జూలై 1న మేధా పాట్కర్ కు కోర్టు విధించిన 5 నెలల సాధారణ జైలు శిక్షను మెజిస్టీరియల్ కోర్టు సవరించి ఆదేశాలు జారీ చేసింది.

# చక్కని ఆరోగ్యం





## దొండకాయలను తింటే ఇన్ని లాభాలా..?

దొండకాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వేసవిలో ఎక్కువగా లభించే ఈ కూరగాయలో ఫైబర్, నీటి శాతం చాలా ఎక్కువగా ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడానికి, ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికీ, బరువు తగ్గడానికి సహాయపడుతుంది. దొండకాయల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. నీటి శాతం కూడా అధికంగా ఉంటుంది. దొండకాయల్లో విటమిన్ ఏ, విటమిన్ సి ఎక్కువగా ఉంటాయి.

ఇవి చర్మ ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. ఇందులో ఉండే కాల్షియం, పొటాషియం, ఐరన్ ఎముకల, కండరాల ఆరోగ్యానికి సహాయపడతాయి. దొండకాయల్ని తినడం వల్ల షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. దొండకాయల్లోని పోషకాలు ఇన్సులిన్ సెన్సిటివిటీపై ప్రభావం చూపుతాయి. డయాబెటిస్ రిస్క్‌ను తగ్గిస్తాయి. దొండకాయల్లో ఉండే బీటా కెరోటిన్, ఫ్లేవనాయిడ్స్, యాంటీ ఆక్సిడెంట్లు కణాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. కణాల ఆక్సీకరణ ఒత్తిడి నుంచి కాపాడతాయి. దొండకాయలలో ఫైబర్ ఎక్కువగా, కేలరీలు తక్కువగా ఉంటాయి. దొండకాయలు తినడం వల్ల ఎక్కువ సేపు ఆకలి వేయదు. బరువు అదుపులో ఉంటుంది. దొండకాయల్లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి వాపులు, నొప్పులు వంటి సమస్యలను తగ్గిస్తాయి. దొండకాయలు తింటే కీళ్ల నొప్పులు తగ్గుతాయి.

దొండకాయలు లివర్ పనితీరును మెరుగుపరుస్తాయి. ఇవి లివర్ డ్యామేజ్ అవ్వకుండా చూస్తాయి. దొండకాయలు తింటే శరీరంలో, కాలేయంలో పేరుకుపోయిన మలినాలు తొలగుతాయి. దొండకాయల్ని తినడం వల్ల శ్వాస సంబంధిత సమస్యల నుంచి దూరంగా ఉండవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఊపిరితిత్తుల సమస్యలను తొలగిస్తాయి. దొండకాయల్లో ఉండే బీటా కెరోటిన్ శరీరంలో విటమిన్–ఏగా రూపాంతరం చెందుతుది. ఇది కంటి సమస్యలను దూరం చేయడంలో సహాయపడతుంది. దొండకాయలు తింటే కంటి సమస్యలు రావు. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫమేటరీ గుణాలు ఊపిరితిత్తుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిని తగ్గించడానికి సహాయపడతాయి.

## ఈ పండు ప్రత్యేకతలేంటో తెలుసా..?

మార్కెట్‌లో మనకు ఎన్నో రకాల పండ్లు అందుబాటులో ఉంటాయి. అయితే, వాటిలో మనం కొన్ని రకాల పండ్లను మాత్రమే తింటుంటాం. కొన్ని పండ్లను అసలు రుచి కూడా చూడం. అలాంటి పండ్లలో పియర్ పండు కూడా ఒకటి. ఇవి గ్రీన్ లేదా పసుపు రంగులో ఉంటాయి. వీటి ధర కూడా కాస్త ఎక్కువే ఉంటుంది. కానీ, పియర్ పండ్లను తినడం వల్ల కలిగే లాభాలు మాత్రం అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. వీటిలో ఆరోగ్యానికి మేలు చేసే పోషకాలు చాలా ఉంటాయి. పియర్స్ పండ్లలో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. వీటితో కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. దీంతో గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. పియర్స్ పండ్లు తినడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. ఇందులో తక్కువ క్యాలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండడం వల్ల ఎక్కువ సేపు ఆకలి వేయకుండా ఉంటుంది. పియర్స్ పండ్లలో విటమిన్ సి, యాంటీ



ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. వీటిని తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అనేక రకాల ఇన్ఫెక్షన్స్‌కి దూరంగా ఉండొచ్చు. పియర్స్ పండ్లలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల తిన్న ఆహారం బాగా జీర్ణం అవుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. ఇందులో ఉండే ప్రీబయోటిక్స్ జీర్ణ ఆరోగ్యానికి సహకరిస్తాయి. పేగులను ఆరోగ్యంగా ఉంచి మలబద్ధకం సమస్య నుంచి ఉపశమనం కల్పిస్తాయి.. పియర్స్ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి ఉంటాయి. వీటిని తింటే చర్మం ముడతలు పడకుండా ఉంటుంది. అందంగా, యవ్వనంగా కనపడొచ్చు. పియర్స్ ఎముకలు ఆరోగ్యంగా, దృఢంగా ఉండడానికి సహాయం చేస్తాయి. ఆస్టియోపొరోసిస్ వంటి ప్రమాదకరమైన సమస్యలు రాకుండా చూస్తాయి. ముఖ్యంగా ఈ పండ్లలో ఉండే పాలిఫినాల్స్ కణాలు నాశనం అవకుండా చూస్తాయి. ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు రాకుండా ఉంటాయి. పియర్స్ పండ్లు తినడం వల్ల రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి. ఇందులో ఉండే తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ షుగర్ ఉన్న వారికి సహాయం చేస్తుంది. పియర్స్ పండ్లలో రెండు రకాల ఫైబర్‌లు ఉంటాయి. సాల్యుబుల్, ఇన్‌సాల్యుబుల్ ఫైబర్‌లు ఉండటం వల్ల ఈ పండ్లను తింటే షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలోకి వస్తాయి.

## ఈ ఆకులు వేస్ట్ అని పడేస్తున్నారా..?



మనకు ఎన్నో రకాల కూరగాయలు, ఆకు కూరలు అందుబాటులో ఉన్నాయి. అన్ని మన ఆరోగ్యానికి మేలు చేసేవే. ముఖ్యంగా ఆకుకూరలు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. ఆరోగ్యానికి సంజీవనిలా పనిచేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆకుకూరల్లో కొవ్వు తక్కువగా ఉంటుంది. ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్ కూడా పుష్కలంగా ఉన్నాయి. ఆకు కూరలు తినడం ద్వారా మలబద్ధకాన్ని నివారించవచ్చు. ఆకుకూరల్లో విటమిన్ ఎ, సి, అలాగే కాల్షియం పుష్కలంగా ఉంటాయి. బీట్‌రూట్ మాదిరిగానే బీట్‌రూట్ ఆకుల్లో కూడా పోషకాలు అధికంగా ఉంటాయి.

వీటిలో విటమిన్ ఎ, సి, బి6తో పాటు ఐరన్ వంటివి సమృద్ధిగా లభిస్తాయి. బీట్‌రూట్ ఆకులు తింటే ఇన్ఫెక్షన్ల నుంచి దూరంగా ఉండొచ్చు. ఎందుకంటే బీట్‌రూట్ ఆకుల్లో విటమిన్ సి కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధకశక్తిని పెంచుతుంది. బీట్‌రూట్ ఆకుల్లో కరిగే ఫైబర్, కరగని ఫైబర్ ఉంటుంది. ఇవి పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. బీట్‌రూట్ ఆకులు తింటే గట్ బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. జీర్ణ సమస్యలు రావు. బీట్‌రూట్ ఆకులు తింటే ఫెర్టిలిటీ రేటు పెరుగుతుంది. ఇందులోని ఫోలేట్ శిశువు ఎదుగుదలకు సహాయపడుతుంది. బీట్‌రూట్ ఆకుల్లో నైట్రేట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిజన్ లెవెల్స్‌ను పెంచుతాయి. రక్తపోటును కంట్రోల్ చేస్తాయి. గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. బీట్‌రూట్ ఆకుల్లో విటమిన్ ఎ కంటెంట్ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. బీట్‌రూట్ ఆకుల్లో మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ డి అధిక మోతాదులో లభిస్తుంది. ఇవి ఎముకలను బలంగా, ఆరోగ్యవంతంగా మార్చుతాయి. బీట్‌రూట్ ఆకుల్లో ఉండే విటమిన్ బి6 మెదడు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. బీట్‌రూట్ ఆకులు తింటే మెదడు పనితీరు మెరుగుపడుతుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది. బీట్‌రూట్ ఆకులు తింటే వయస్సుతో పాటు వచ్చే కంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాదు.. బీట్‌రూట్ ఆకుల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది కడుపు నిండిన ఫీల్ అందిస్తుంది. ఫలితంగా తక్కువ తింటారు. దీంతో బరువు తగ్గొచ్చు. సూప్స్, సలాడ్స్ రూపంలో వీటిని తీసుకోవచ్చు.

## ఉదయాన్నే ఒక స్పూన్ నెయ్యిని ఇలా తీసుకుంటే..

రోజూ ఉదయం ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీళ్లలో కొన్ని వస్తువులు కలిపి తీసుకుంటే.. ఊహించని ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీంతో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కూడా చెక్ చెప్పవచ్చు అంటున్నారు. అంతేకాదు.. ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తీసుకుంటే ఎంతటి రోగమైనా ఇట్టే మాయమౌతుందని నిపుణులు చెబుతున్నారు. ఆహారపు అలవాట్లు, జీవశైలి, కొన్ని రకాల చిట్కాలు పాటిస్తుంటే శరీరం ఎప్పటికీ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటుందని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మన రోజువారి అవాట్లతో మన శరీరాన్ని అన్ని రకాల వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చునని చెబుతున్నారు. అందులో భాగంగా మనం ప్రతి రోజూ ఉదయాన్నే తీసుకునే ఆహారం కూడా అతి ముఖ్యమైనది. చాలా మందికి ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లు తాగే అలవాటు ఉంటుంది. ఇది చాలా రకాలుగా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. రోజూ ఉదయం ఖాళీ కడుపుతో గోరు వెచ్చని నీళ్లలో కొన్ని వస్తువులు కలిపి తీసుకుంటే.. ఊహించని ప్రయోజనాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీంతో ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కూడా చెక్ చెప్పవచ్చు అంటున్నారు. అంతేకాదు.. ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో నెయ్యి కలిపి తీసుకుంటే ఎంతటి రోగమైనా ఇట్టే మాయమౌతుందని నిపుణులు చెబుతున్నారు.



విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉన్న నెయ్యి వేడి నీటిలో కలిపి తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వేడి నీటిలో నెయ్యి కలిపి ఖాళీ కడుపుతో తాగితే మలబద్ధకం తగ్గి, జీర్ణక్రియ మెరుగుపడుతుంది. నెయ్యి కలిపిన వేడి నీళ్లు తాగితే పొట్ట చుట్టూ ఉండే కొవ్వు కూడా తగ్గుతుంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్న నెయ్యి మెదడు ఆరోగ్యానికి చాలా మంచిది. విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉన్న నెయ్యి ఎముకల బలాన్ని పెంచడానికి సహాయపడుతుంది. దీంతో కీళ్ల నొప్పులు, కాళ్ల నొప్పుల వంటివి కూడా తగ్గుతాయి. గోరువెచ్చని నీటిలో నెయ్యిని కలిపి తీసుకోవటం వల్ల బాడీ డీటాక్స్ అవుతుంది.

కొలెస్ట్రాల్ బర్న్ అవుతుంది. దీంతో బరువు తగ్గుతారు. శరీరం ఆరోగ్యానికి అవసరమైన విటమిన్స్, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్స్ అందుతాయి. ఇవన్నీ కూడా మనలో రోగనిరోధక శక్తిని పెంచేవిగా పనిచేస్తాయి. కిడ్నీల ఆరోగ్యానికి సపోర్ట్ చేస్తుంది. ఇది మొత్తం ఆరోగ్యానికి చాలా మంచిది. నీళ్లలో నెయ్యి కలిపి తాగడం వల్ల పేగులు పొడిబారడంతోపాటు జీర్ణశక్తి మెరుగుపడుతుంది. దీనివల్ల మలబద్ధకం నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. గోరువెచ్చని నీళ్లలో నెయ్యి కలిపి తాగడం వల్ల కళ్లకు కూడా మేలు జరుగుతుంది. అంతేకాదు చర్మానికి కూడా చాలా మంచిది. నెయ్యి చర్మాన్ని మెరిసేలా చేస్తుంది.

## ఈ పప్పులో నాన్ వెజ్ కంటే ఎక్కువ ప్రోటీన్ ఉంటుంది..!

పెసరపప్పుతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు. ఇందులో ఉన్న ప్రోటీన్, ఫైబర్, ఐరన్, ఫోలేట్ వంటి పోషకాలు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. మాంసాహారాన్ని తీసుకోని వారు ప్రోటీన్ కోసం పెసరపప్పును ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. పెసరపప్పు అంటేనే పోషక విలువలతో నిండి ఉంటుంది. సాధారణంగా మనం చికెన్, మటన్, గుడ్లలో ప్రోటీన్ ఎక్కువగా ఉంటుందనుకుంటాం. కానీ పెసరపప్పులో ఉండే ప్రోటీన్ కూడా చాలా ఎక్కువగా ఉంటుంది. మాంసాహారాన్ని తినని వారికీ ఇది బాగా ఉపయోగపడుతుంది. ప్రత్యేకంగా శాకాహారులు ఈ పప్పును తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన ప్రోటీన్‌ను పొందవచ్చు. ఈ పప్పులో కేవలం ప్రోటీన్ మాత్రమే కాదు.. ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, ఫోలేట్, విటమిన్ బి6 వంటి అవసరమైన పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇవన్నీ శరీరంలో అనేక విధాలుగా పనిచేస్తాయి. ముఖ్యంగా ఎముకలకు, కండరాలకు బలాన్ని ఇస్తాయి. దాంతో పాటు నాడీ వ్యవస్థను మెరుగుపరుస్తాయి. పెసరపప్పులో ఫైబర్ కూడా అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థకు మంచి మద్దతు ఇస్తుంది. గ్యాస్, అజీర్తి, మలబద్దకం వంటి సమస్యల నుంచి బయటపడటానికి ఇది సహాయపడుతుంది. ఇది తినడం అలవాటుగా మార్చుకుంటే జీర్ణ సంబంధిత సమస్యలు సహజంగా తగ్గుముఖం పడతాయి. మలబద్దకం సమస్యతో చాలా మంది ఇబ్బంది పడతారు. ముఖ్యంగా పెద్దలకే కాదు.. పిల్లల్లో కూడా ఇది ఎక్కువగా కనిపిస్తోంది. అలాంటి సమస్యలకు పెసరపప్పు మంచి సహాయకారి. ఇది క్రమం తప్పకుండా తింటే మలబద్ధకం తగ్గి, శరీరం హైడ్రేట్‌గాను, శుభ్రంగాను ఉంటుంది. రక్తహీనత సమస్యలు ఉన్నవారికి కూడా పెసరపప్పు మేలు చేస్తుంది. ఇందులో ఉండే ఐరన్ వల్ల ఎర్ర రక్తకణాల ఉత్పత్తి పెరుగుతుంది. ఇది శరీరానికి తగినంత శక్తిని అందిస్తుంది. అధికంగా అలసట, బలహీనత వంటివి ఉండే వారికి ఇది తినమని సూచిస్తున్నారు. పెసరపప్పులో ఉన్న మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు గుండె ఆరోగ్యానికి కూడా మంచివి. ఇవి రక్తనాళాల్లో ఒత్తిడి తగ్గిస్తాయి. దాంతో రక్తప్రసరణ సరిగా జరిగి హైపర్‌టెన్షన్ సమస్యలు దూరమవుతాయి. ఈ పప్పు తినడం వల్ల ఒత్తిడి తగ్గే అవకాశం కూడా ఉంటుంది. ఇది తినడం వల్ల శరీరానికి తగిన శక్తి లభిస్తుంది. రోజువారీ పనులలో చురుకుగా ఉండాలంటే శక్తి అవసరం. పెసరపప్పు తీసుకుంటే శక్తి స్థాయిలో మెరుగుదల కనిపిస్తుంది. ఇది ముఖ్యంగా వ్యాయామం చేసే వారి కోసం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పెసరపప్పును ఉప్మా, కిచిడీ, పెసరట్టు, పచ్చడి, దోస వంటి వంటకాల్లో వాడొచ్చు. ఇలా వాడటం వలన ఆహారంలో రుచితో పాటు ఆరోగ్యానికి మేలు కూడా కలుగుతుంది.

## బెల్లీ ఫ్యాట్ కరిగించే టాప్ బెస్ట్ కూరగాయలు...!



పొట్టపై కొవ్వు పేరుకోవడం చాలా మందికి సాధారణ సమస్యగా మారింది. దీన్ని తగ్గించాలంటే సరైన ఆహారపు అలవాట్లు చాలా అవసరం. కొవ్వును కరిగించడంలో సహాయపడే కొన్ని ప్రత్యేకమైన కూరగాయలు ఉన్నాయి. వాటిని రోజువారీ ఆహారంలో చేర్చుకుంటే బెల్లీ ఫ్యాట్ తగ్గించడం సులభమవుతుంది. అధిక బరువుతో బాధపడేవారిలో ముఖ్యంగా పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం అనేది చాలా సాధారణంగా కనిపించే సమస్య. దీనికి ప్రధాన కారణాలు ఆరోగ్యానికి హానికరమైన ఆహారం తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం. ఈ సమస్యను పరిష్కరించాలంటే ఆరోగ్యకరమైన జీవన విధానం పాటించడమే కాదు.. తినే ఆహారాన్ని కూడా సరిగ్గా ఎంచుకోవాలి. కీర దోసకాయ: దోసకాయలు నీటిని అధికంగా కలిగి ఉంటాయి. ఇది శరీరానికి తేలికగా ఉండే ఆహారం. ఇందులో ఉన్న తక్కువ కేలరీలు, అధిక నీరు కారణంగా తిన్న తర్వాత కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. తద్వారా ఎక్కువ తినాలనిపించదు. ఇది బరువు తగ్గేందుకు సహకరించడమే కాకుండా.. బెల్లీ ఫ్యాట్ కరిగించడంలోనూ సహాయపడుతుంది. దోసకాయను రసం, సలాడ్, చట్నీ, కూరల రూపంలో తీసుకోవచ్చు. పాలకూర: పాలకూరలో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీని వల్ల శరీరంలో జీర్ణ ప్రక్రియ మెరుగవుతుంది. ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం తిన్నపుడు కడుపు త్వరగా నిండిపోతుంది. దీని వల్ల దీర్ఘకాలం ఆకలి వేయదు. పాలకూరలో మెగ్నీషియం కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తంలో షుగర్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఆస్పరాగస్: స్పరాగస్ అనేది మనకు అంతగా పరిచయం లేని కూరగాయ అయినా.. దీనిలో ఉన్న పోషకాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. ఇది తక్కువ కేలరీలతో ఉండటం తో పాటు శరీరానికి అవసరమైన ఫైబర్‌ను కూడా సమృద్ధిగా అందిస్తుంది. ఆస్పరాగస్ తినడం వలన కడుపు నిండిన భావన కలుగుతుంది. తద్వారా మళ్లీ తినాలనిపించదు. ఇది బరువు నియంత్రణలో సహాయపడటమే కాకుండా.. కొవ్వు కరిగించడంలోనూ ఉపయోగపడుతుంది. కాలీఫ్లవర్: కాలీఫ్లవర్ అనేది బరువు తగ్గించడంలో సహాయపడే అద్భుతమైన కూరగాయ. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉండడం వల్ల శరీరానికి తేలికగా ఉంటుంది. అలాగే ఫైబర్ అధికంగా ఉండటం వల్ల జీర్ణవ్యవస్థ మెరుగవుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు కూడా ఎక్కువగా ఉండటంతో ఇది ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. కాలీఫ్లవర్‌ను కూరగా లేదా రైస్ సబ్‌స్టిట్యూట్‌గా కూడా ఉపయోగించవచ్చు. బ్రొకోలి: బ్రొకోలిలో విటమిన్ సి, కాల్షియం, ఫైబర్ వంటి అవసరమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి జీర్ణవ్యవస్థకు మేలు చేస్తాయి. బ్రొకోలిని తినడం వలన గట్ హెల్త్ మెరుగవుతుంది.. శరీర బరువు నియంత్రించబడుతుంది. దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఉన్న హానికరమైన పదార్థాలను బయటకు పంపించడంలో సహాయపడతాయి. ఇది పొట్టపై ఉండే కొవ్వును కరిగించడంలో సహకరించే ముఖ్యమైన కూరగాయ. బరువు తగ్గాలంటే ప్రత్యేకమైన మాయాజాలం అవసరం లేదు. సరైన ఆహారం, సరైన అలవాట్లు ఉంటే మీ శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడం చాలా సులభం. ఈ ఐదు కూరగాయలను మీ డైట్‌లో భాగంగా చేసుకుంటే బెల్లీ ఫ్యాట్ కరిగిపోవడం అంత కష్టంగా ఉండదు. ఆరోగ్యంగా, చురుకుగా జీవించాలంటే ఈ చిన్న మార్పులు చేయడం చాలా అవసరం.

# సినిమా



## విజువల్స్, మ్యూజిక్ సూపర్.. ట్రైలర్ చూశారా?

తమన్నా ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ సినిమా 'ఓదెల 2'. ఇ?ప్పటికే టీజర్ తో మంచి బజ్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం ప్రమోషన్స్ జోరుగా చేస్తున్నారు. ఏప్రిల్ 17న మూవీ థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్ బట్టి చూస్తే.. ఓదెల అనే ఊరిలో ప్రేతాత్మల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతుంటారు. దీంతో ఎక్కడో కాశీలో ఉన్న శివశక్తి (తమన్నా) ఈ ఊరికి వస్తుంది. తర్వాత దెయ్యాల ఆట ఎలా కట్టించింది అనేదే మిగతా స్టోరీలా అనిపిస్తుంది. తమన్నా తప్పితే పెద్దగా పేరున్న నటీనటులు ఎవరూ లేనప్పటికీ విజువల్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. ప్రస్తుతం డివోషనల్ మూవీస్ ట్రెండ్ నడుస్తుంది. చూస్తుంటే ఓదెల 2.. బాక్సాఫీస్ దగ్గర క్లిక్ అయ్యేలా కనిపిస్తుంది. అశోక్ తేజ దర్శకుడు కాదా.. సంపత్ నంది మిగతా విషయాలన్నీ చూసుకున్నారు.

## బ్లాక్ డ్రెస్సులో అందాలతో కళ్లు చెదరగొడుతున్న షాలిని పాండే



## అఖిల్ బర్త్‌డే స్పెషల్.. 'లెనిన్' టైటిల్ గ్లింప్స్ రిలీజ్

కెరీర్‌లో ఒక్క బ్లాక్‌బస్టర్ హిట్ అయిన కొట్టాలని తెగ ఎదురుచూస్తున్నాడు యువ హీరో అక్కినేని అఖిల్. గత చిత్రం 'ఏజెంట్' ఆశించిన స్థాయిలో సక్సెస్‌కాకపోవడంతో తదుపరి సినిమాల విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకుంటున్నారు అఖిల్. ఈ క్రమంలోనే కొత్త దర్శకుడితో సినిమా చేస్తున్నాడు. అఖిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం లెనిన్ ఈ సినిమాకు మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తుండగా.. అఖిల్ స్వీయ నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. నేడు అఖిల్ బర్త్‌డే సందర్భంగా మూవీ నుంచి టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. గతాన్ని తరమటానికి పోతా.. మా నాయిన నాకో మాట సెప్పినాడు. పుట్టేటప్పుడు ఊపిరి ఉంటాదిరా పేరు ఉండదు. అట్నే పోయేటప్పుడు ఊపిరి ఉండదు పేరు మాత్రమే ఉంటాది. ఈ పేరు ఎట్లా నిలబడాలి అంటే అంటూ పవర్‌ఫుల్‌గా సాగింది ఈ గ్లింప్స్. ఈ వీడియో చూస్తుంటే.. రూరల్ లవ్ డ్రామాగా ఈ సినిమా రాబోతుంది. శ్రీలీల ఇందులో కథానాయికగా నటిస్తుండగా.. ఎస్ థమన్ సంగీతం అందిస్తున్నాడు.





## నా మొదటి పారితోషికం రూ.6 వేలే..

### ఆ సినిమాల్లో చెప్పకుండా తీసేశారు

మెజారిటీ హీరోయిన్లు వరుస సినిమాలతో దూకుడు పెంచుతుంటే ప్రియాంక జవాల్కర్ మాత్రం నెమ్మదిగా అడుగులు వేస్తోంది. ఈ బ్యూటీ ఇటీవలే వచ్చిన మ్యాడ్ స్క్వేర్‌లో నటించి అలరించింది. తాజాగా ఈ తెలుగమ్మాయి ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు చెప్పుకొచ్చింది. ప్రియాంక జవాల్కర్ మాట్లాడుతూ.. నేను మొదటగా టాక్సీవాలా సినిమాకు సంతకం చేశాను. ఈ సినిమా కోసం యాక్టింగ్ క్లాసులు తీసుకుంటున్న సమయంలో కల వరం ఆయె చిత్రయూనిట్ నన్ను సంప్రదించారు. వారు అప్పటికే ఓ హీరోయిన్‌తో షూటింగ్ చేశారట.. కానీ అది నచ్చకపోవడంతో నన్ను సంప్రదించారు. సరే అని చేశాను. అయితే అప్పుడు నాకు రెమ్యునరేషన్ ఇవ్వడానికి వారి దగ్గర బడ్జెట్ కూడా లేదు. మా దగ్గర రూ.10 వేలు మాత్రమే ఉన్నాయి. బడ్జెట్ లేనప్పుడు ఇవ్వడం దేనికిలే.. అని వద్దన్నాను. నా స్నేహితురాలేమో చేస్తున్న పనికి ఎంతోకొంత తీసుకోవాలి కదా అని వారించింది. దాంతో వాళ్లకు ఫోన్ చేసి ఆ పది వేలు తీసుకుంటానన్నాను. నేను వద్దన్నానని వేరేవాటి కోసం కొంత వాడేశాం.. ఇప్పుడు మా దగ్గర రూ.6 వేలే ఉన్నాయని చెప్పారు. అలా నేను తొలి సినిమాకు రూ.6 వేలు తీసుకున్నాను. తర్వాత ఓ యాడ్ కోసం రూ.10 వేలు తీసుకున్నాను. ?కథ బాగుంటేనే సినిమాలు చేయాలని నియమం పెట్టుకున్నాను. అందుకే గమనం సినిమా తర్వాత మూడేళ్లు గ్యాప్ వచ్చింది. టిల్లు స్క్వేర్‌లో 15 సెకన్లు మాత్రమే కనిపించే రోల్ చేశాను. తెలుగు, తమిళంలో రెండు పెద్ద ప్రాజెక్టుల్లో, ఓ తమిళ సినిమాలో నన్ను చివరి నిమిషంలో తీసేశారు అని ప్రియాంక జవాల్కర్ చెప్పుకొచ్చింది. ప్రియాంక.. టాక్సీవాలా, తిమ్మరుసు, ఎస్ఆర్ కళ్యాణమండపం, గమనం సినిమాలు చేసింది.




## అజయ్ దేవగన్ 'రైడ్ 2' ట్రైలర్ రిలీజ్

యాక్షన్, మాస్, కామెడీ జానర్‌లతో పాటు ప్రయోగాత్మక సినిమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటులలో బాలీవుడ్ నటుడు అజయ్ దేవగన్ ఒకడు. ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'రైడ్ 2'. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమాకు రాజ్ కుమార్ గుప్తా దర్శకత్వం వహిస్తుండగా.. 2018లో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రైడ్ సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. రితేష్ దేశ్‌ముఖ్, వాణి కపూర్ కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. పనోరమా స్టూడియోస్ బ్యానర్‌పై భూషణ్ కుమార్, కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్, క్రిషన్ కుమార్ కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాను సమ్మర్ కానుకగా మే 01న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఈ మూవీ విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఆదాయపు పన్ను విభాగంలో(%×అఙశీఎవ ఝఇ ఐవజ్ఞుఖతీఎవత్%) సీనియర్ అధికారిగా పనిచేసే అమయ్ పట్నాయక్ (అజయ్ దేవగణ్) రాజకీయ నాయకులతో పాటు వ్యాపారవేత్తల ఇళ్లపై దాడులు చేస్తూ వారిని నిద్రలేకుండా చేస్తుంటాడు. అయితే, ఒక రాజకీయ నాయకుడి ఇంటిపై ఐటీ దాడి చేయాలని అమయ్ పట్నాయక్‌కి ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందుతాయి. ఈ సందర్భంలో దాడి కోసం ఆ ఇంటికి వెళ్లిన తర్వాత ఏం సంభవించిందనేది ఈ చిత్ర కథాంశంగా తెలుస్తోంది.

# తమిళనాడే లక్ష్యంగా కమల దళం



చెన్నై : దక్షిణాదిలో పాగా వేసేందుకు స్కెచ్ వేస్తోంది బీజేపీ. అందులో భాగంగానే తమిళనాడులో గత కొన్నిరోజులుగా పొలిటికల్ డ్రామాకు తెరతీస్తోంది. తమిళనాడులో పాతమిత్రుడితో కలిసి అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతోంది బీజేపీ. తమిళనాడులో ఏడాదిలోపే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అధికారంలో ఉన్న డీఎంకే కాంగ్రెస్ సహా మిత్ర పక్షాలు కలిసి ఈసారి కూడా కూటమిగా బరిలోకి వెళ్ళాలని భావిస్తోంది. ఇక నటుడు విజయ్ సొంత పార్టీని ఏర్పాటు చేసి తాను ఒంటరిగా పోటీ చేస్తానని ఇప్పటికే ప్రకటించారు. ముందుగా ఏఐడీఎంకేతో కలిసి పోటీ చేసి అధికార భాగస్వామ్యంతో డిప్యూటీ సీఎంగా ఉండేలా ఒప్పందం కుదిరినట్లు వార్తలు వచ్చాయి.. ఏపీలో టీడీపీ–జనసేన ఫార్ములా లోనే విజయ్ కూడా రాజకీయాల్లో తన ప్రయత్నాలను మొదలు పెడతారని జోరుగా చర్చ జరిగింది. అధికార ఆటఐను గద్దెదించేందుకు పక్కా ప్రణాళికతో వెళ్తోంది. తమిళనాడులో రాజకీయం రసవత్తరంగా మారింది.. అధికార డిఎంకె ను గద్దె దించడమే లక్ష్యంగా ప్రతిపక్షాలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి.. అందుకు గట్టి ఓటు బ్యాంకు కలిగిన పార్టీలతో కలిసి వెళ్తేనే అది సాధ్యమని విశ్లేషకులు చెబుతుంటే.. విపక్షాల వ్యూహాలను డిఎంకె మాత్రం ఏ మాత్రం లెక్క చేయడంలేదు. బీజేపీ ఈసారి దక్షిణాన కొట్టి తీరాలన్న కసితో చేస్తున్న ప్రయత్నాలు అన్నీ ఇన్ని కావు. అలా బీజేపీ వేస్తున్న ఎత్తులకు డీఎంకే ఎత్తుకు పైఎత్తు వేస్తూ.. జనంలో సెంటిమెంట్‌ను రెచ్చగొడుతూ ప్రతిపక్షాలకు ఎక్కడా అందడం లేదు. తమిళనాడులో పాగా వేయాలన్న ప్రయత్నాల్లో ఉన్న భారతీయ జనతా పార్టీ వ్యూహంతో ముందుకు వెళుతోంది. అయితే ఎక్కడో తేడాగా ఉందన్న చర్చ జరుగుతోంది. పొత్తు కోసం ఏఐడీఎంకే నుంచి దూరమైన అందరినీ కలిపేలా బీజేపీ ప్లాన్ చేస్తోందని తెలుస్తోంది. పొత్తులను సెట్ చేయడం.. మాజీ ముఖ్యమంత్రులు ఓ పన్నీర్ సెల్వం, పళనిస్వామి, శశికళను కలిపి బీజేపీ చేస్తున్న కూటమి ప్రయత్నాలకు ఏఐడీఎంకే షరతులు పెడుతోంది. అలా పెట్టె షరతుల్లో కొన్ని విషయాల్లో తగ్గుతున్నా మరి కొన్ని అంశాల్లో బీజేపీ ఏమాత్రం తగ్గడం లేదు. తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షమైన ఏడీఎంకే సహా మరి కొన్ని పార్టీలను కలిపి కూటమిగా ఏర్పాటు చేసి అధికారంలోకి రావాలని బీజేపీ గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఐదేళ్ల వరకు రాష్ట్రంలో డీఎంకేతో సమానంగా బలమైన పార్టీగా ఉన్న ఏఐడీఎంకేలో చీలికతో కాస్త బలహీన పడింది. గతంలో జయలలిత జైలుకెళ్లిన సందర్భంలో నమ్మినబంటుగా ఉన్న ఓ పన్నీరు సెల్వం పార్టీ నుంచి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే జయలలిత నచ్చలి శశికళ కూడా పార్టీకి దూరమైంది. మాజీ ముఖ్యమంత్రి ఎడపాడి పళనిస్వామి పార్టీని లీడ్ చేస్తున్నారు. మునుపటిల పార్టీకి బాగుండాలంటే ఈ ముగ్గురు కలవాల్సిన అవసరం ఉందని భావించిన బీజేపీ అందర్నీ కలిపే ప్రయత్నం మొదలుపెట్టింది. ఇటీవల పొత్తుల విషయంపై చర్చించేందుకు ఏఐడీఎంకే ప్రధాన కార్యదర్శి మాజీ ముఖ్యమంత్రి పలని స్వామి ఢిల్లీ వెళ్లి అమిత్ షా సహా పలువురు ముఖ్యనేతలను కలిశారు. అయితే ఆ సమయంలో బీజేపీకి ఏఐడీఎంకే తరఫున పళని స్వామి కొన్ని షరతలు పెట్టినట్టు తెలుస్తోంది. అందులో ముఖ్యమైనది తమిళనాడు బీజేపీ చీఫ్ గా ఉన్న అన్నమలైను ఆ బాధ్యతల నుంచి పక్కన పెట్టాలని విధించినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఇటీవల అన్నమలై పార్టీ చీఫ్ పదవికి రాజీనామా చేశారు. అలాగే ఏఐడీఎంకే పార్టీలోకి పన్నీరు సెల్వం మళ్లీ తీసుకొచ్చే ప్రతిపాదనను కూడా ఆయన విభేదించినట్లు తెలుస్తోంది. తమిళనాడులో జరిగిన ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో పొత్తుల విషయమై మాట్లాడేందుకు మాజీ ముఖ్యమంత్రులు ఈపీఎస్–ఓపిఎస్ ఇద్దరికీ వేరువేరుగా మోదీ అపాయింట్‌మెంట్ ఫిక్స్ అయింది. ఓపిఎస్‌కూ కూడా అపాయింట్‌మెంట్ దక్కడం పట్ల ఈపిఎస్ కినుక వహించినట్టు తెలుస్తోంది. అందుకే ప్రధానిని కలిసి ఆలోచనను విరమించుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత కొద్దిసేపటికి ప్రధాని షెడ్యూల్‌లో మార్పులు చేసినట్టు ప్రకటన వచ్చింది. ఎలాంటి రాజకీయ సమావేశాలు భేటీలు లేవని ఓపిఎస్ అపాయింట్‌మెంట్ కూడా రద్దు చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల తమిళనాడు చీఫ్ పదవికి రాజీనామా చేసిన అన్నమలై కూడా ఒకంత అసంతృప్తితో ఉన్నారు. మీడియాతో మాట్లాడిన సందర్భంలో అధ్యక్ష పదవి అనేది నాకు ఉల్లిపాయతో సమానం అంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. ఓపిఎస్– టిటివి దినకర్, శశికళ పళని స్వామి అందరిని కలపాలని బీజేపీ ప్రయత్నాల కు ఈపీఎస్ సుముఖంగా లేరన్నది తాజా పరిణామాలను బట్టి తెలుస్తోంది. వీటన్నింటిపై బ్యాక్ గ్రౌండ్‌లో అన్ని వర్క్‌వుట్ చేసుకున్నాక పొత్తులపై ముందుకు వెళ్లాలని బీజేపీ భావిస్తున్నట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే మోదీ పర్యటనలు షెడ్యూల్ మార్పులు చేసి పొలిటికల్ మీటింగ్స్ అన్ని రద్దు చేసినట్లు తెలుస్తోంది. వచ్చే రెండు మూడు రోజుల్లో రాష్ట్ర అధ్యక్షుడు నియామకం అయ్యాక అన్ని పరిస్థితులను చక్కదిద్దిన తర్వాత పొత్తుల విషయంలో క్లారిటీ ఇవ్వాలని భావిస్తోంది భారతీయ జనతా పార్టీ.

# ఏఐ చేతుల్లో పిల్లల ఎదుగుదల..



**భువనేశ్వర్:** వయసుకు తగిన విధంగా పిల్లలు ఎదుగుతున్నారా? ఎత్తు, బరువు సరైన విధంగానే అభివృద్ధి చెందుతోందా? వారు పోషకాహార లోపాలను ఎదుర్కొంటున్నారా? మొదలైనవన్నీ తెలుసుకోవడం ఇకపై చాలా సులభం కానున్నాయి. ఇందుకు కృత్రిమ మేథ తోడ్పాటునందించనుంది. పిల్లల సమగ్ర ఎదుగుదలను పర్యవేక్షించేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాధనాన్ని అభివృద్ధి చేసేందుకు ఒడిశా ప్రభుత్వం ప్రత్యేక పైలట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ విధమైన కార్యక్రమాన్ని చేపట్టిన తొలి రాష్ట్రంగా ఒడిశా నిలిచింది. 'ఏఐ ఫర్ గ్రోత్ మానిటరింగ్: డెవలప్‌మెంట్ ఆఫ్ యాన్ ఏఐ టూల్ ఫర్ చైల్డ్ ఆంత్రోపోమెట్రీ' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ (కేంద్ర ప్రభుత్వం), వధ్వానీ ఏఐ, ఐసీఎంఆర్–ఆర్ఎంఆర్సీ భువనేశ్వర్, పోషణ్ అభియాన్‌ను సంయుక్తంగా సహకారాన్ని అందిస్తున్నాయి.

నూతనంగా రూపొందించబోయే ఈ ఏఐ టూల్ సాయంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ దగ్గరకు వచ్చే పిల్లల బరువు, ఎత్తు, తల చుట్టుకొలత, ఛాతీ చుట్టుకొలత మొదలైన వాటి పెరుగుదల తగిన విధంగా ఉందో లేదో తెలుసుకోగలు గుతారు. ఈ వినూత్న విధానం ఆంత్రోపోమెట్రిక్ అంచనాల ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడం, పోషకాహార లోపాన్ని ముందుగానే గుర్తించడంలో సహాయపడుతుంది. అంగన్వాడీ కార్యకర్తలకు ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్), ఐసీఎంఆర్–ఆర్ఎంఆర్సీ భువనేశ్వర్, వధ్వానీ ఏఐ నిపుణులు శిక్షణను అందించనున్నారు. శిక్షణ పొందిన ఇన్వెస్టిగేటర్లు నాలుగు నెలల పాటు రాష్ట్రంలోని బాలాసోర్, కటక్, గంజాం, జాజ్‌పూర్, కియోంఝర్, మయూర్‌భంజ్ జిల్లాల్లోని చిన్నారుల డేటాను సేకరిస్తారు. ఈ డేటా సేకరణ పైలట్ అంచనాకు ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమాన్ని ఒడిశా మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శుభా శర్మ ప్రారంభించారు. ఏఐ చేతుల్లో పిల్లల ఎదుగుదల.. ఒడిశాలో శ్రీకారం పిల్లల సమగ్ర ఎదుగుదలను పర్యవేక్షించేందుకు కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాధనాన్ని అభివృద్ధి చేసేందుకు ఒడిశా ప్రభుత్వం ప్రత్యేక పైలట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఈ విధమైన కార్యక్రమాన్ని చేపట్టిన తొలి రాష్ట్రంగా ఒడిశా నిలిచింది. 'ఏఐ ఫర్ గ్రోత్ మానిటరింగ్: డెవలప్‌మెంట్ ఆఫ్ యాన్ ఏఐ టూల్ ఫర్ చైల్డ్ ఆంత్రోపోమెట్రీ' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీనికి మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ (కేంద్ర ప్రభుత్వం), వధ్వానీ ఏఐ, ఐసీఎంఆర్–ఆర్ఎంఆర్సీ భువనేశ్వర్, పోషణ్ అభియాన్‌ను సంయుక్తంగా సహకారాన్ని అందిస్తున్నాయి. నూతనంగా రూపొందించబోయే ఈ ఏఐ టూల్ సాయంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ దగ్గరకు వచ్చే పిల్లల బరువు, ఎత్తు, తల చుట్టుకొలత, ఛాతీ చుట్టుకొలత మొదలైన వాటి పెరుగుదల తగిన విధంగా ఉందో లేదో తెలుసుకోగలుగుతారు. ఈ వినూత్న విధానం ఆంత్రోపోమెట్రిక్ అంచనాల ఖచ్చితత్వాన్ని మెరుగుపరచడం, పోషకాహార లోపాన్ని ముందుగానే గుర్తించడంలో సహాయపడుతుంది. అంగన్వాడీ కార్యకర్తలకు ఐసీఎంఆర్–నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్), ఐసీఎంఆర్–ఆర్ఎంఆర్సీ భువనేశ్వర్, వధ్వానీ ఏఐ నిపుణులు శిక్షణను అందించనున్నారు. శిక్షణ పొందిన ఇన్వెస్టిగేటర్లు నాలుగు నెలల పాటు రాష్ట్రంలోని బాలాసోర్, కటక్, గంజాం, జాజ్‌పూర్, కియోంఝర్, మయూర్‌భంజ్ జిల్లాల్లోని చిన్నారుల డేటాను సేకరిస్తారు. ఈ డేటా సేకరణ పైలట్ అంచనాకు ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమాన్ని ఒడిశా మహిళా, శిశు అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శుభా శర్మ ప్రారంభించారు.

# భారత్‌లో డేంజరెస్‌గా డయాబెటిస్!

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆరోగ్య సమస్యల్లో డయాబెటిస్ ఒకటి. మధుమేహం బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ వస్తున్నది. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ దీని బారినపడుతున్నారు. మారుతూ వస్తున్న జీవనశైలి కారణంగా దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారు. దీన్ని నియంత్రించకపోతే భవిష్యత్‌లో ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. రాబోయే సంవత్సరాల్లో భారత్‌లో ఆందోళనకరంగా డయాబెటిస్ రోగులు పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇండియన్ డయాబెటిస్ ఫెడరేషన్ ఇటీవల నివేదికలో భయంకరమైన విషయాలు వెలుగు చూశాయి. ప్రస్తుతం భారత్‌లో 89.8 మిలియన్ల (8.94కోట్లు) మంది డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. ఇది 2050 నాటికి భారత్‌లో డయాబెటిస్ కేసులు 73శాతం పెరిగి 156 మిలియన్లు (15.6కోట్లు) చేరుకుంటుందని నివేదిక బయటపెట్టింది. ఇదిలా ఉండగా.. ప్రపంచవ్యాప్తంగా 20–79 సంవత్సరాల మధ్య వయసు గల 589 మంది మిలియన్ల మంది మధుమేహంతో జీవిస్తున్నారని అంచనా. ప్రపంచ జనాభాలో 11.1శాతం మంది దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నారు. 2050 నాటికి ఈ సంఖ్య 853 మిలియన్లకు పెరుగుతుందని అంచనా. మధుమేహంతో జీవిస్తున్న నలుగురిలో ఒకరు (158 మిలియన్లు) 65 సంవత్సరాలు వ్యక్తులే. 20–79 సంవత్సరాల వయసు గల 365 మిలియన్ల మంది గ్లూకోజ్ టాలరెన్స్‌తో జీవిస్తున్నారని అంచనా. 2024లో మధుమేహం తో బాధపడుతున్న వారంతా చికిత్స కోసం ట్రిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. ఇది ప్రపంచ ఆరోగ్య వ్యయంలో 12శాతంగా ఉన్నది. ఇదే సంవత్సరంలో డయాబెటిస్ కారణంగా 3.4 మిలియన్ల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. అన్ని కారణాలతో ప్రపంచ మరణాల రేటుతో పోలిస్తే 9.3శాతంగా ఉన్నది. అప్పుడే పుట్టిన ప్రతి ఐదుగురిలో ఒకరు (23 మిలియన్లు) ఏదో ఒక రకమైన హైపర్‌గ్లైసీమియాతో బాధపడుతున్నట్లు అంచనా. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 9.15 మిలియన్ల మంది వ్యక్తులు టైప్–1 డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. ఇందులో 22.3శాతం అంటే 2.04 మిలియన్ల మంది తక్కువ ఆదాయం, మధ్య ఆదాయ దేశాల్లో నివస్తున్నారు. ఈ మొత్తం 9.15 మిలియన్ జనాభాలో 1.81 మిలియన్లు (19.8శాతం) 20 సంవత్సరాల కంటే తక్కువ వయసున్నవారు ఉన్నారు. 6.28 మిలియన్లు (68.6శాతం 20–59 సంవత్సరాల మధ్య వయసుగల వారు, 1.06 మిలియన్లు 60 లేదా అంతకంటే ఎక్కువ వయసు గల వ్యక్తులు ఉన్నారు. జీవనశైలిలో మార్పులు, సరిగా ఆహారం తీసుకోకపోవడం, ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాలతో డయాబెటిస్ ముప్పు పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు.

## అమలులోకి వచ్చిన వక్ఫ్ సవరణ చట్టం..




దేశంలో వక్ఫ్ సవరణ చట్టం నేటి నుంచి అమలులోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. గతవారం పార్లమెంట్ ఉభయసభలు సవరణ చట్టాన్ని ఆమోదించి.. రాష్ట్రపతికి పంపిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం ఆమోదించగా.. ఎప్పటి నుంచి అమలులోకి వస్తుందన్న విషయం ప్రకటించలేదు. అయితే, నేటి నుంచి (ఏప్రిల్ 8) నుంచి వక్ఫ్ చట్టం అమలులోకి వచ్చిందని నోటిఫికేషన్‌లో పేర్కొంది. కేంద్రం పంపిన వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ఏప్రిల్ 8న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బిల్లును ఆమోదించారు. బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంట్ బిల్లును ఆమోదించిన విషయం తెలిసిందే. రెండు బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారని న్యాయ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఏప్రిల్ 4న రాజ్యసభ బిల్లుకు అనుకూలంగా 128 ఓట్లు, వ్యతిరేకంగా 95 ఓట్లు రాగా, లోక్‌సభ సుదీర్ఘ చర్చ తర్వాత ఏప్రిల్ 3న బిల్లుకు ఆమోదం తెలిపింది. లోక్‌సబలో 288 మంది ఎంపీలు అనుకూలంగా, 232 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే, 1995 చట్టం ప్రకారం.. వక్ఫ్ అనేది ముస్లిం చట్టం కింద ఓ వ్యక్తి తన ఆస్తిని మతపరమైన, దాతృత్వ ఉద్దేశాల కోసం శాశ్వతంగా అంకితం చేయడం. ఒకటి ప్రకటన ద్వారా, దీర్ఘకాల వినియోగం ఆధారంగా (వక్ఫ్ బై యూజర్), వారసత్వం అంతరించినప్పుడు (వక్ఫ్–అలల్–ఔలాద్) ఏర్పడుతుంది. ఈ చట్టం కింద వక్ఫ్ బోర్డులకు ఆస్తులను నిర్వహించే, వాటిని వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ఉంటుంది. సర్వే కమిషనర్ ఆస్తుల సర్వే చేస్తారు. వివాదాలను వక్ఫ్ ట్రిబ్యునల్స్ పరిష్కరిస్తాయి. వాటి నిర్ణయాలు అంతిమంగా పరిగణిస్తారు. చట్టం ప్రకారం, వక్ఫ్ బోర్డు సభ్యులు ముస్లింలు మాత్రమే కావాల్సి ఉంటుంది. ఆస్తులపై బోర్డుకు పూర్తి నియంత్రణ ఉంటుంది. ఈ విధానంలో పారదర్శకత లేకపోవడం, ఆస్తుల దుర్వినియోగం తదితర సమస్యలు ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో వక్ఫ్ బోర్డులు ప్రభుత్వ ఆస్తులను సైతం వక్ఫ్‌గా ప్రకటించడం వివాదాస్పదంగా మారింది. కొత్త తీసుకువచ్చిన చట్టం ప్రకారం.. ఎవరైనా వక్ఫ్ ఆస్తిగా ప్రకటించాలంటే ఆ వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాం ఆచరించి ఉండాలి. ఆస్తి అతనికి మాత్రమే సొంతమై ఉండాలి. సవరణ చట్టంలో 'వక్ఫ్ బై యూజర్' నిబంధన తొలగించారు. వక్ఫ్–అలల్–ఔలాద్‌లో స్త్రీలతో సహా వారసుల హక్కులు కాపాడబడతాయి. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుంచి కలెక్టర్‌కు ఇచ్చారు. వక్ఫ్ ఆస్తుల వివరాలు ఆరు నెలల్లో కేంద్రీయ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరు స్త్రీలతో పాటు ఇద్దరు ముస్లిం కాని సభ్యులను సైతం చేర్చాల్సి ఉంటుంది. ట్రిబ్యునల్ నిర్ణయా మాత్రమే అంతిమం కాదు. 90 రోజుల్లో హైకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇకపై వక్ఫ్ బోర్డులకు ఏకపక్షంగా ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ఉండబోదు.

## టీఎంసీలో అంతర్గత విభేదాలు..

## ఆగని అమిత్ మాలవీయ వరుస పోస్టులు



ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత పోరును బీజేపీ రచ్చకెక్కించింది. టీఎంసీ నేతల మధ్య గొడవలకు సంబంధించిన వీడియోలు, వాట్సప్ చాట్‌లను కమలం పార్టీ బయటపెట్టింది. సీనియర్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ, ఫైర్ బ్రాండ్‌గా పేరున్న మరో ఎంపీ మధ్య గొడవ జరిగిందని.. అదీ ఎన్నికల సంఘం కేంద్రకార్యాలయం వద్దేనంటూ బీజేపీ ఐటీ సెల్ ఇంఛార్జి అమిత్ మాలవీయ వాటిని షేర్ చేశారు. ఈ క్రమంలో ఇంకా వరుస వీడియోలు షేర్ చేస్తూనే ఉన్నారు. మాలవీయ చేసిన పోస్టుల ప్రకారం.. తృణమూల్ కాంగ్రెస్ ప్రతినిధుల బృందం ఒక ప్రజెంటేషన్‌ను సమర్పించడానికి ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లింది. ఆ టైంలో.. ఈసీ ఆఫీస్‌కు వెళ్లడానికి ముందు వినతిపత్రంపై సంతకాలు చేసేందుకు ఒకసారి సమావేశం కావాలని అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది. కానీ సదరు ఎంపీ ఆ సమావేశానికి గైర్హాజరు అయ్యారు. నేరుగా ఈసీ వద్దకు వెళ్లడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదే.. ఇద్దరు ఎంపీల మధ్య గొడవకు దారితీసి పోలీసుల జోక్యం దాకా వెళ్లింది. అమిత్ మాలవీయా షేర్ చేసిన వీడియోలో కల్యాణ్ బెనర్జి మరో ఎంపీపై "ఇదంతా పబ్లిక్ ప్లేస్. కాస్త సంయమనం పాటించండి" అని ఊగిపోతూ కనిపించినట్లు ఉంది. టీఎంసీ నేత డెరెక్ ఓబ్రిన్ మధ్యలో వచ్చి"మీడియాలో ప్రసారమవుతుంది. వద్దు.." సర్దిచెప్పినా ఫలితం లేకపోయింది. కొసమెరుపు ఏంటంటే.. ఈ వ్యవహారం తర్వాత పార్లమెంట్ సభ్యులు బెనర్జీ, కీర్తి ఆజాద్ చాటింగ్ చేసుకుంటే.. ఏఐటీసీ ఎంపీ 2024 పేరిట ఉన్న గ్రూపులోని ఆ సంభాషణను కూడా మాలవీయ బయటపెట్టారు. ఆ సంభాషణ ధాటి తట్టుకోలేక సదరు మహిళా ఎంపీ గ్రూప్ నుంచి ఎగ్జిట్ అయినట్లు ఆ షేరింగ్‌లో ఉంది. ఇక ఈ వ్యవహారంపై టీఎంసీ నేత సౌగతారాయ్ తీవ్రంగా స్పందించారు. పార్టీ అంతర్గత గోప్యతను కాపాడుకోవాలంటూ టీఎంసీ నేతలకు హితవు పలికారు. ఈ క్రమంలో కల్యాణ్ బెనర్జి తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఆ మహిళా ఎంపీ కన్నీళ్లు పెట్టుకోవడం చూశాను. కల్యాణ్ ప్రవర్తనపై పార్టీలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది అని రాయ్ అన్నారు. అయితే అమిత్ మాలవీయా ఇక్కడితోనే ఆగలేదు. సౌగతారాయ్‌ను తీవ్రంగా విమర్శించిన కళ్యాణ్ బెనర్జీ వీడియోను సైతం షేర్ చేశారు.

మరోవైపు.. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ గోప్యంగా ఈ విషయాన్ని ఉంచాలని మొదటి నుంచి భావించారట. అయితే ఈలోపే బీజేపీ నేత అమిత్ మాలవీయ పోస్టులతో మొత్తం వ్యవహారం బయటకు వచ్చేసింది. ఈ విషయాన్ని బెంగాలీ న్యూస్ ఛానెల్స్ ప్రముఖంగా ప్రచురిస్తున్నాయి.

## గంగాజలం ఎఫెక్ట్.. బీజేపీ నేతపై సస్పెన్షన్ వేటు

రాజస్థాన్‌లో వివాదాస్పద నేత జ్ఞానదేవ్ అహూజాపై ఎట్టకేలకు అక్కడి బీజేపీ విభాగం చర్యలు తీసుకుంది. క్రమశిక్షణా చర్యల ఉల్లంఘనకుగానూ షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఆలయంలో గంగా జలంతో శుద్ధి చేయడమే ఇందుకు కారణం!!. ఆల్వాల్‌లో శ్రీరామ నవమి సందర్భంగా ఓ ఆలయంలో జరిగిన ప్రాణ ప్రతిష్టకు కాంగ్రెస్ నేత తికారాం జల్లీ హాజరయ్యారు. అయితే దళిత నేత అడుగుపెట్టి ఆలయం అపవిత్రం చేశారంటూ మాజీ ఎమ్మెల్యే జ్ఞానదేవ్ అహూజా గంగా జలంతో ఆ ఆలయాన్ని శుద్ధి చేశారు. ఈ పరిణామం దళిత సంఘాలకు ఆగ్రహావేశాలు తెప్పించింది. ఈ చర్య పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేదిగా ఉందని పేర్కొంటూ బీజేపీ ఎంపీ దామోదర్ అగర్వాల్ , అహుజాకు నోటీసులు పంపించారు. మూడు రోజుల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మదన్ రాథోడ్‌కు వివరణ ఇవ్వాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. జ్ఞానదేవ్ అహూజా.. 2013–18 మధ్య రామ్‌ఘడ్ ఎమ్మెల్యేగా పని చేశారు. వివాదాల్లో నిలవడం ఈయనకు కొత్తేం కాదు. 2016లో.. జేఎన్‌యూలో జాతీ వ్యతిరేక నినాదాల వ్యవహారంపై స్పందిస్తూ జ్ఞానదేవ్ తీవ్రవ్యాఖ్యలే చేశారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.